మాసపత్రిక
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital

కామన్‌వెల్త్ గేమ్స్: షాట్‌పుట్‌లో **షర్మిలకు స్వర్ణం** శిల్పకు కాంస్యం
-'ఆట'లో




Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 179 పేజీలు: 12 వెల: 6.50

# ఎల్ నినోపై యాక్షన్ ప్లాన్


మంగళవారం అధికారులతో వర్చువల్‌గా సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

## ఆగస్టు 3నుంచి అవగాహన కార్యక్రమాలు

### నిరంతర మానిటరింగ్‌కు కంట్రోల్ రూమ్

### యేడాదికి సరిపడా పశుగ్రాసం నిల్వలు

### సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జులై28,ప్రభాతవార్తప్రతినిధి:** రైతులకు వర్షాభావ పరిస్థితులను వ్యూహాత్మకంగా ఎదుర్కొనేందుకు అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.ఎల్ నినో కష్టకాలంలో రైతులను ఆదుకోవాలని, వారికి సరైన సమాచారాన్ని సహకారాన్ని అందిస్తూ అండగా నిలవాలని ముఖ్యమంత్రి అధికారులకు కీలక నిర్దేశం చేసారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, రైతుల్లో కల్పించాల్సిన అవగాహనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. పలువురు జిల్లాలస్థాయి అధికారులతో వర్చువల్‌గా మాట్లాడారు.ఎల్ నినో ప్రభావం ఏ మేరకు ఉంటుంది, దీనికి సంబంధించిన యాక్షన్‌ప్లాన్ వంటి అంశాలను సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. జూలై నెలలో 69శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో సరాసరి 35 నుంచి 40 శాత మేర లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్న అధికారులు, జూన్ - నవంబర్ మధ్య 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 551 మి.మీ మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఉన్న అంచనాల ప్రకారం అన్ని జిల్లాల్లోనూ ఎల్‌నినో ప్రభావం చూపిస్తోందని, ఎక్కువగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయని అధికారులు చెప్పారు. 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07లక్షల హెక్టార్లలో >>2

## మాజీ ఎమ్మెల్యే తనయుడిపై కిడ్నాప్ కేసు

# ఐదుగురి అరెస్టు

**గుంటూరు, జులై 28, ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కుమారుడు బషీర్‌పై నూజివీడు పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఏలూరు జిల్లాకు చెందిన ఓ పొగాకు వ్యాపారి, అతని డ్రైవర్‌ను అపహరించిన ఘటనలో బషీర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, కోయిలగూడెం నుంచి గుంటూరు వైపు పొగాకు లోడుతో వెళ్తున్న వాహనాన్ని కొందరు వ్యక్తులు అడ్డుకున్నారని, అనంతరం వ్యాపారి, డ్రైవర్‌ను బలవంతంగా తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిని గుంటూరులోని ఓ గెస్ట్‌హౌస్‌లో నిర్బంధించినట్లు ఆరోపణలున్నాయి. సమాచారం అందుకున్న నూజివీడు పోలీసులు ఈ ఘటనకు సంబంధించి బషీర్ అనుచరులుగా గుర్తించిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.


మంగళవారం సిఎం చంద్రబాబు సమక్షంలో ఎంఒయు కుదుర్చుకుంటున్న ఫార్మాసంస్థ

# అమరావతిలో కేన్సర్ పరిశోధనా కేంద్రం

### జెనోమిక్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా ఇండియా ఎంఒయు

### సిఎం చంద్రబాబు సమక్షంలో ఫార్మాసంస్థ ఒప్పందం

**విజయవాడ, జులై 28,ప్రభాతవార్తప్రతినిధి:** కేన్సర్ రంగంలో జన్యుపరమైన పరిశోధనల ద్వారా వైద్య చికిత్సలను అందించేందుకు వీలుగా కీలకమైన ముందడుగు పడింది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ విధానాన్ని ప్రారంభించేందుకు వీలుగా అంతర్జాతీయ ఫార్మాసుటికల్, బయో టెక్నాలజీ దిగ్గజ సంస్థ ఆస్ట్రాజెనెకా ఇండియా ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్స్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో వైద్యారోగ్యశాఖ ఆస్ట్రాజెనెకా ఇండియా సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. రిలయన్స్‌కు చెందిన స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూఆర్ఏఐ సంస్థలతో కలిసి ఆస్ట్రా జెనెకా ఇండియా ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ అంకాలజీ చికిత్సా విధానాన్ని ప్రారంభించేందుకు ఈ ఎంఓయూ కుదుర్చుకున్నారు.

# 'భోగాపురం' రెడీ

### ప్రారంభోత్సవానికి హాజరుకానున్న 3లక్షల మంది

### ప్రధాని పర్యటనను సక్సెస్ చేద్దాం: మంత్రి లోకేష్


మంగళవారం భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రి లోకేష్, చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తదితరులు

**భోగాపురం, జులై 28 ప్రభాతవార్త:** విజయనగరంజిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రధాని పర్యటన విజయవంతానికి ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఆగష్టు 1వ తేదీన రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై భోగాపురం విమానాశ్రయంలో కేంద్ర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో కలిసి అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులతో >>2

# జపాన్‌లో సునామీ హెచ్చరికలు జారీ

### రిక్టర్ స్కేలుపై భూకంపం 7.1గా నమోదు

**టోక్యో,జులై 28:** జపాన్‌లోని దక్షిణ ప్రాంతాన్ని మంగళవారం మధ్యాహ్నం భారీ భూకంపం వణికించింది. క్యుషు ద్వీపంలోని కుమమోటో ప్రిఫెక్చర్‌లో రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. దీంతో జపాన్ వాతావరణ సంస్థ వెంటనే తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఈ భూకంపం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. కుమమోటో నగర సమీప ప్రాంతం కేంద్రంగా, భూమికి 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు నమోదయ్యాయి. అరియాకే, యత్సుషిరో సముద్ర తీరాల్లో సుమారు ఒక మీటర్ ఎత్తున అలలు ఎగిసిపడే ముప్పు ఉందని, ప్రజలందరూ తీరానికి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. భూకంపం కారణంగా కుమమోటో ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భద్రతా కారణాల దృష్ట్యా బుల్లెట్ రైళ్లతో సహా అన్ని రైలు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేశారు. క్యుషు ద్వీపంలోని కుమమోటో, నాగసాకి, కగోషిమా, ఫుకుయోకా, సాగా, ఒయిటా, మియాజాకి ప్రాంతాల్లో జపాన్ ప్రభుత్వం తదుపరి అత్యవసర భూకంప హెచ్చరికలను జారీ చేసింది. జపాన్‌లో ప్రతి ఏటా వందలాది భూకంపాలు సంభవిస్తుంటాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవించే భూకంపాలలో దాదాపు 18 శాతం జపాన్‌లోనే నమోదవుతుంటాయి. వీటిలో అత్యధిక శాతం స్వల్ప తీవ్రత కలిగినవే అయినప్పటికీ, కొన్నిసార్లు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. 2011లో రిక్టర్ స్కేలుపై 9.0 తీవ్రతతో సంభవించిన వినాశకర భూకంప వల్ల సుమారు 18,500 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న జపాన్ ఉత్తర ప్రాంతంలో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే.



29-7pg2exHMNWJQE_29-7pg2exHMNWJQE.qxd 29/Jul/26 12:22 AM Page 1





మంగళవారం తెల్లవారుజామున బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద ప్రమాదానికి గురైన కారు. ఇన్‌సెట్-సురేష్(ఫైల్)

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

# ప్రముఖ విద్యాసంస్థ యాజమాని సురేష్ దుర్మరణం

**హనుమాన్‌జంక్షన్, జులై 28, ప్రభాతవార్త :** రోడ్డుప్రమాదంలో తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ సురేష్ దుర్మరణం చెందిన ఘటన కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బొమ్ములూరు గ్రామంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాష్ట్రంలో ప్రముఖ విద్యాసంస్థలైన తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సురేష్(52), తన భార్య విమలాదేవితో కలిసి హైదరాబాద్ నుండి సోమవారం రాత్రి కారులో స్వగ్రామమైన రాజమండ్రికి బయలుదేరారు. ఈక్రమంలో వీరు ప్రయాణిస్తున్న కారు మంగళవారం ఉదయం 6గంటల సమయంలో చెన్నై-కోల్‌కత్తా ప్రధాన రహదారిపై బాపులపాడు మండలం బొమ్ములూరు టోల్‌గేట్ వద్దకు చేరుకునే సరికి ముందు ఆగి ఉన్న లారీని వెనుకనుండి బలంగా ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సురేష్ ప్రమాదస్థలిలోనే మృత్యువాతపడగా, తీవ్రంగా గాయపడిన విమలాదేవిని వైద్యచికిత్స నిమిత్తం ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసునమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వవైద్యశాలకు తరలించి కేసుదర్యాప్తు చేస్తున్నారు. కాగా సురేష్ మరణవార్త సమాచారం అందుకున్న ప్రభుత్వవిప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ గన్నవరం ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని సురేష్ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలియ చేసారు.



# అత్యంత వైభవంగా గిరిప్రదక్షిణం

## లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు

### జెండా ఊపి పుష్పరథం ప్రదక్షిణ ప్రారంభించిన అశోక్ గజపతిరాజు

**సింహాచలం, ప్రభాత వార్త జులై 28:** శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షణకు లక్షలాదిమంది భక్తులు తరలివచ్చారు సింహాద్రినాథుని స్మరణతో అడివి వరం సింహాచల ప్రాంతం మారుమ్రోగింది.శ్రీ సింహగిరివాసుడి దర్శనం పరవశింపజేస్తుందని శ్రీ చందన శతక కర్త మానాప్రగడ శేషసాయి. అంతటి విశిష్టత కలిగిన సింహగిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ ప్రదక్షిణతో పాటు స్వామివారి పాద దర్శనం భాగ్యం కూడా దక్కుతుందని పండితులు చెబుతారు. అందుకే ఏటేటా గిరి ప్రదక్షిణ చేసే భక్తుల సంఖ్య లక్షల్లో పెరుగుతోంది. మంగళవారం చల్లని వాతావరణం నడుమ సింహగిరి ప్రదక్షిణ ప్రశాంతంగా ప్రారంభమైంది. ఎప్పటిలాగే తేలికపాటి చినుకులు కురిసి కొద్దిసేపటికి తగ్గుముఖం పట్టడంతో సింహాచలం చేరుకున్న భక్తులు మంగళవారం ఉదయమే ప్రదక్షిణ మొదలు పెట్టారు. కొండ దిగువ తొలి పావంచా వద్ద టెంకాయ కొట్టి నడక ప్రారంభించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు మధ్యాహ్నం 2 గంటలకు స్వామి పుష్పరథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా రథంలో కొలువుతీరివున్న సింహాద్రినాథుని నమూనా మూర్తుల వద్ద అర్చకులు సంప్రదాయ పూజలు చేశారు. మంగళ హారతులిచ్చి, అశోక్ గజపతి, ఈఓ వెంకట్రావుతో కొబ్బరికాయ కొట్టించారు. ప్రభుత్వ విప్ పిజివిఆర్ నాయుడు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కోడూరి రామచంద్ర మోహన్, ధర్మకర్తలి సభ్యులు, ధర్మ కర్తలి మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు,హాజరయ్యారు. స్థానాచార్యులు డాక్టర్ టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కరి సీతారామాచార్యుల నేతృత్వంలో పండితులు ఉత్సవం నిర్విఘ్నంగా పూర్తికావాలని అర్చన చేశారు. పులివేషాలు, తపెట్టగుళ్లు, కోలాటాల విన్యాసాలు, సంప్రదాయ నాదస్వర, డోలు, కేరళా వాయిద్యాల నడుమ సింహాచలేశుని పుష్ప రథం ముందుకు కదిలింది. నారసింహ, గోవింద నామస్మరణ చేసుకుంటూ భక్త బృందాలు రథంతో పాటు ముందుకు కదిలాయి. పాత అడివివరం వరకు అధికార యంత్రాంగమంతా రథం ముందు నడిచారు. తొలిపావంచా వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి అధికారులు ఉత్సవాన్ని పర్యవేక్షించారు. పలు స్వచ్ఛంద సంస్థలు భక్తుల కోసం మంచినీరు, వివిధ ప్రసాదాలను ఏర్పాటు చేసి, భారీగా వితరణ చేశాయి.రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి బాల వీరాంజనేయ స్వామి సోమవారం రాత్రి సింహాచలం చేరుకుని గిరిప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ రూమ్లో ఏర్పాటులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, దేవస్థానం ఈఓ వెంకట్రావు ఇతర అధికారులు హాజరయ్యారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని మంత్రి అధికారులకు సూచించారు. భక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్ కు స్పందించి తగిన సమాచారం అందించే వ్యవస్థను అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

# మెగా డిఎస్సీపై ఆరోపణలు నిరాధారం

## అవకతవకలకు ఆస్కారం లేదు: ప్రభుత్వం వివరణ

**విజయవాడ,జులై28,ప్రభాతవార్తప్రతినిధి:** మెగా డీఎస్సీ 2025 ఉపాధ్యాయ నియామక పరీక్షల ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పకడ్బందీ చర్యలతో పరీక్షలు నిర్వహించామని స్పష్టం చేసింది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఈ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించామని, అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. పరీక్షల నిర్వహణలో అనుసరించిన పటిష్ఠమైన భద్రతా విధానాలను ప్రభుత్వం వెల్లడించింది. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన టీసీఎస్ అయాన్ ప్లాట్‌ఫామ్‌ను ఈ పరీక్షల కోసం వినియోగించినట్లు తెలిపింది. సమాచార భద్రతకు అత్యున్నత ప్రామాణికమైన 256బిట్ ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీతో ప్రశ్నపత్రాలను భద్రపరిచామని, దీనివల్ల డేటా లీక్ అయ్యే అవకాశమే లేదని స్పష్టం చేసింది. పరీక్ష రాసే ప్రతి అభ్యర్థికి 42 లక్షల ప్రశ్నల భారీ బ్యాంక్ నుంచి కంప్యూటర్ ద్వారా యాదృచ్ఛికంగా ప్రశ్నలు వస్తాయని, ఒక అభ్యర్థికి వచ్చిన ప్రశ్నపత్రం మరొకరికి రాదని వివరించింది. దీనివల్ల మాస్ కాపీయింగ్‌కు గానీ, ముందుగా ప్రశ్నలు తెలుసుకునేందుకు గానీ ఆస్కారం ఉండదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. ప్రతి పరీక్షా కేంద్రంలో బయోమెట్రిక్ హాజరు, వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ నిఘా వంటి బహుళస్థాయి భద్రతా ఏర్పాట్లు చేసి పరీక్షలు నిర్వహించామని పేర్కొంది. దరఖాస్తు స్వీకరణ నుంచి హాల్ టికెట్ల జారీ, ఆన్‌లైన్ పరీక్ష, ఫలితాల వెల్లడి, తుది ఎంపిక వరకు ప్రతి దశలోనూ పారదర్శకతకు పెద్దపీట వేశామని ప్రభుత్వం వివరించింది.ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయ నియామకాలపై అనుసరించిన వైఖరిని ప్రస్తుత ప్రభుత్వం తప్పుబట్టింది. గత పాలకులు ఖిమెగా డీఎస్సీఖి అంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసి, చివరికి ఖిటెట్ కమ్ టీఆర్టీఖి పేరుతో నియామకాలు చేపట్టి అభ్యర్థులను గందరగోళానికి గురిచేశారని ఆరోపించింది. 2024 ఎన్నికల ముందు కేవలం 6,100 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చి చేతులు దులుపుకొనే ప్రయత్నం చేశారని విమర్శించింది.అయితే, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సంఖ్యను 16,347కు పెంచి, నిరుద్యోగ యువతకు అండగా నిలిచిందని గుర్తుచేసింది. గతంలో జరిగినట్లుగా అసంబద్ధ విధానాలకు, అభ్యర్థుల భవిష్యత్తుతో ఆడుకునే చర్యలకు తమ పాలనలో తావులేదని స్పష్టం చేసింది.ఏళ్ల తరబడి కష్టపడి చదివి, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన అభ్యర్థుల శ్రమ వృథా కాదని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రతిభ, నిబద్ధత, కఠోర శ్రమను నమ్ముకున్న వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని పేర్కొంది. కొందరు కావాలనే అవాస్తవ ప్రచారాలతో అభ్యర్థులను తప్పుదోవ పట్టించి, వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మవద్దని సూచించింది. ఈ నియామక ప్రక్రియలో ఏ ఒక్క అర్హుడికి కూడా అన్యాయం జరగదని, కేవలం మెరిట్ ఆధారంగానే ఎంపికలు ఉంటాయని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి రాజీకి తావులేదని, ఈ విషయంలో తమ ప్రభుత్వ నిబద్ధతను ఎవరూ శంకించాల్సిన పనిలేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది.

# 'భోగాపురం' రెడీ

>> మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారుల పనులు, పార్కింగ్, టెర్మినల్ బిల్డింగ్, బహిరంగ సభ వేదిక, భద్రత, జనసమీకరణ, ప్రోటోకాల్ గ్యాలరీ, భోజనం, రవాణా ఏర్పాట్లపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి నారా లోకేష్ పలు సూచనలు చేశారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి 32 నియోజకవర్గాల నుంచి దాదాపు 3 లక్షల మంది హాజరవుతారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. బహిరంగ సభ వేదికలో వీవీఐపీ సీటింగ్ సామర్థ్యాన్ని 520 నుంచి వెయ్యికి పెంచామని, వీఐపీ 3వేలు, వెయ్యి మంది ఛాంపియన్స్, విమానాశ్రయానికి భూములు ఇచ్చిన వారు ఆసీనులయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజల కోసం ప్రధాన రహదారికి ఇరువైపులా 20 భోజనం కౌంటర్లు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని మంత్రి లోకేష్ సూచించారు. విద్యార్థుల విషయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అంబులెన్స్ లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్ కె.అచ్చెన్నాయుడు, వం గలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, కొలుసు పార్థసారథి, బీసీ జనార్థన్ రెడ్డి, డోలా బాలవీ రాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, కళా వెంకట్రావు, ఏలూరి సాంబశివరావు, పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, అరిమిల్లి రాధాకృష్ణ, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారు రాజేష్, కార్యక్రమాల కమిటీ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్, మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, విజయనగరం డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున, మాజీ ఎమ్మెల్యే ఎస్.వీ.ఎస్.ఎన్ వర్మ, జీఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ ఛైర్మన్ జీబీఎస్ రాజు, స్టేట్ మీడియా కోఆర్డినేటర్ బీవీ. రాముడు, ప్రధాని పర్యటన నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఎల్ నినోపై యాక్షన్‌ప్లాన్

>> వరిపై ప్రభావం చూపిస్తుందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పరిధిలోనే వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. వంశధార నుంచి జలాలు అందుబాటులోకి వస్తే వాటిని సద్వినియోగం చేసుకుంటూ పంటలను కాపాడాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించామని అధికారులు సీఎంకు వివరించారు.హై రిస్క్ మండలాల్లో బోర్లు ఆధారంగా పంటలను కాపాడుకునే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఆగస్ట్ 3 నుంచి అవగాహన కార్యక్రమాలు, వరికి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి, అత్యవసర విత్తన ప్రణాళికను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. కంది, ఆముదం, మినుము పంటలను ఇప్పటికే కొందరు ప్రత్యామ్నాయ పంటలుగా వేస్తున్నారని చెప్పారు. ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద ఈ నెల 31వ తేదీ వరకు నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నామని, అయితే వరి పంటకు ఆగస్ట్ 15 వరకు సమయం ఉందని అధికారులు వివరించారు. ఇప్పటి వరకు 6.30 లక్షల హెక్టార్ల మేర పంటలను బీమాలో నమోదు చేశామని అధికారులు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, వేసిన ప్రతి పంటకు బీమా నమోదు చేయాల్సిందేనని ఏ పంటకైనా బీమా నమోదు చేయకపోతే... దానికి కలెక్టర్లే బాధ్యత వహించాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. అలాగే తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. 5 నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల పశుగ్రాసం అందుబాటులో ఉందామని అధికారులు చెప్పారు. అయితే 5 నెలలకు సరిపడా పశుగ్రాసం సిద్ధం చేసుకుంటే సరిపోదని... ఎల్ నినో ప్రభావం ఏదైనా పొడవుగా కన్పించే సూచనలు ఉండటంతో ఏడాదికి అవసరమైన పశుగ్రాసాన్ని అందుబాటులో ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలి. వరదలు, తుఫాన్లు వచ్చినప్పుడు ఎలా మానిటర్ చేశారో... అదే విధంగా ఎల్ నినో అంశాన్ని మానిటర్ చేయాలన్నారు. అలాగే ఉద్యాన పంటలకు జీ రామ్ జీ నిధులను వాడుకోవచ్చు. ఎల్ నినో ఉపద్రవాన్ని అధికార యంత్రాంగం ఓ సవాల్ గా తీసుకుని పని చేయాలన్నారు. ఈ సమీక్షకు ప్రభుత్వ ఉన్నతాధికారులు, వ్యవసాయ శాఖ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు హాజరయ్యారు.

## ఉక్రెయిన్‌లోని చోర్నోమోర్స్క్ పోర్టులో చిక్కుకున్న 13 మంది భారత నావికులు

**న్యూఢిల్లీ,జులై 28:** ఉక్రెయిన్‌లోని చోర్నోమోర్స్క్ పోర్టులో నిలిచి ఉన్న ఎం.వి. అమీర్1 నౌకలో 13 మంది భారతీయ నావికులు చిక్కుపోయారని ఫార్వర్డ్ సీమెన్స్ యూనియన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. వారి భద్రత, స్వదేశానికి తరలింపు కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని, నౌక యజమానులను యూనియన్ కోరింది.మొత్తం 15 మంది సిబ్బందితో ఉన్న ఈ నౌక ప్రస్తుతం "ప్రాణాపాయ పరిస్థితుల్లో చిక్కుకుంది అని ఎఫ్ఎస్‌యుఐ తెలిపింది. నౌక సమీప ప్రాంతాల్లో వరుసగా డ్రోన్లు, క్షిపణి దాడులు జరుగుతుండటంతో ఎప్పుడైనా నేరుగా దాడి జరిగే ప్రమాదం ఉందన్న భయంతో సిబ్బంది తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొంది.ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎఫ్ఎస్‌యుఐ అత్యవసర విజ్ఞప్తి చేసింది.ఉక్రెయిన్‌లోని చోర్నోమోర్స్క్ పోర్టులో 15 మంది సిబ్బందితో ఉన్న ఎం.వి. అమీర్1 నౌకలో 13 మంది భారతీయ నావికులు ఉన్నారు. ప్రస్తుతం వారు అత్యంత ప్రమాదకర, ప్రాణాంతక పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. నౌక సమీపంలో పదేపదే డ్రోన్, క్షిపణి దాడులు జరుగుతున్నాయి.



మంగళవారం సచివాలయంలో ఆర్టీజీఎస్ కమాండ్‌కంట్రోల్ కేంద్రాన్ని సందర్శించిన రాజస్థాన్ ఐటి బృందం

# ఆర్టీజీఎస్‌ను సందర్శించిన రాజస్థాన్ ఐటి బృందం

**విజయవాడ.జులై 28,ప్రభాతవార్తప్రతినిధి:** సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఐటీ శాఖ ఉన్నతాధికారుల బృందం మంగళవారం సందర్శించింది. రాజస్థాన్ ప్రభుత్వరంగ సంస్థ రాజ్ కాంప్ ఇన్ఫో సర్వీసెస్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ లక్షీ మ్కాంత్ కటార, రాజస్థాన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిపార్టుమెంట్‌కు చెందిన బ్రహ్మగుప్త సెంటర్ ఆఫ్ ఫ్రంటీయర్ టెక్నాలజీస్ సంస్థ నోడల్ ఆఫీసర్ రమేష్ దవాండ, డిప్యూటీ డైరెక్టర్ నితీష్ కుమార్ జంగడిల నేతృత్వంలో అధికారులతో కూడిన ప్రతినిధుల బృందం ఆర్టీజీఎస్ పనితీరును గురించి తెలుసుకోవడానికి వచ్చారు. ఈ బృందానికి ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్ స్వాగతం పలికి ఆర్టీజీఎస్ పనితీరు గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆర్టీజీఎస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డేటా డ్రివన్ గవర్నెన్స్ ఆశయాల గురించి, డేటాలేక్, దానిద్వారా ఒనగూరుతున్న ప్రయోజనాల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వంలోని 40 శాఖల్లోని ఒకచోటకు తీసుకొచ్చి అతిపెద్ద డేటాలేక్‌ను రూపొందించామన్నారు. ఈ సమావేశంలో ఆర్టీజీఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి. శ్రీఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన గవర్నర్ కోటా ఎమ్మెల్సీల పదవీకాలం

**విజయవాడ,జులై28,ప్రభాతవార్తప్రతినిధి:** గవర్నర్ కోటా ఎమ్మెల్సీలైన జకియా ఖానం, రవీంద్రబాబు పదవీకాలం మంగళవారంతో పూర్తయింది. ఏపీలో రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయినట్లు ఏపీ శాసన మండలి కార్యనిర్వహక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.ఖాళీ అయిన ఈ రెండు ఎమ్మెల్సీ స్దానాల కోసం టీడీపీలో పలువురు సీనియర్ నాయకులు పోటీపడుతున్నారు.కీలకంగా వర్ల రామయ్య, దేవినేని ఉమామహేశ్వరరావు, తొండెపు దశరథ్ జనార్దన్ తదితరులు పోటీపడుతున్నారు.

# ఆగస్టు 11 దాకా నాగరాజు రిమాండ్ పొడిగింపు

## సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు

**విజయవాడ, జులై28, ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో సస్పెండయిన సీఐ నాగరాజు రిమాండ్‌ను విజయవాడ కోర్టు పొడిగించింది.సస్పెండయిన సీఐ నాగరాజు రిమాండ్‌ను ఆగస్టు 11 వరకు న్యాయస్థానంపొడిగించింది.ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో కోర్టు ఈ కీలక నిర్ణయం తీసుకుంది.ఇక సీఐ నాగరాజును ఈ కేసులో సిట్‌కు కొన్ని నిబంధనలకు లోబడి కస్టడీలో తీసుకుని ఎక్కడైనా విచారించేందుకు ఇప్పటికే సుప్రీంకోర్టు అనుమతించింది.దీంతో నాగరాజును సిట్ రాజమండ్రి కేంద్ర కారాగారం నుంచి కస్టడీలో తీసుకుని రేపటి నుంచి విజయవాడ కృష్ణలంక స్టేషన్‌లో విచారించే అవకాశం ఉంది.విజయవాడలో అతన్ని కస్టడీలో విచారిస్తున్నందున , ప్రతిరోజు ఎంక్వయిరీ పూర్తి కాగానే స్దానిక సబ్‌జైలు రిమాండ్ తరలిస్తారని సమాచారం.

# తూర్పులో ఆవుదూడను లాక్కెళ్లిన పులి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై 28,ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలంలోని కరగపాడు, బుచ్చయ్యపాలెం, నందిగూడెం, కరిచర్లగూడెం, తొక్కిరెడ్డిగూడెం పరిసరాల్లో పెద్దపులి సంచారం స్థానిక ప్రజలను తీవ్ర భయాందోళనల కు గురిచేస్తోంది. పులి అడుగుజాడలను అటవీశాఖ అధికారులు అధికారికంగా గుర్తించడంతో గ్రామాల్లో భయాందోళనలు మరింత పెరిగాయి. సాయంత్రం వేళ బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు సాహసించలేకపోతుండగా, చిన్నారులను ఇళ్ల నుంచి బయటకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. సోమవారం రాత్రి కరిచర్లగూడెం, తొక్కిరెడ్డిగూడెం గ్రామాల మధ్యనున్న అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో అటవీ ప్రాంతాల్లో ట్రాకర్ కెమెరాలు ఏర్పాటు చేసి పులి ప్రతి కదలికపై నిఘా ఉంచారు. మొత్తం 60 మంది అటవీశాఖ సిబ్బంది అడవులను జల్లెడ పడుతుండగా, టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి ప్రత్యేక బృందాన్ని కూడా రంగంలోకి దించారు. ఇదిలా ఉండగా, కరిచర్లగూడెం గ్రామ శివారులో కట్టి ఉంచిన పశువుల మందపై పెద్దపులి దాడి చేసి ఒక ఆవు దూడను లాక్కెళ్లి చంపినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ ఘటనతో గ్రామస్థులు మరింత భయాందోళనలకు గురయ్యారు. పులిని సురక్షి తంగా బంధించేందుకు కరిచర్లగూడెం సమీపంలో ప్రత్యేక బోన్లు ఏర్పాటు చేశారు. పాపికొండల అభయారణ్యం నుంచి సంచరిస్తూ వచ్చిన ఈ పెద్దపులి ఇటీవల పోలవరం అటవీ ప్రాంతాల్లో కనిపించగా, ప్రస్తుతం గోపాలపురం మండలంలోకి ప్రవేశించినట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా పొలాలు, అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా హెచ్చరికలు జారీ చేస్తూ నిరంతరం అప్రమత్తం

# 'పరీక్షల' దోషులకు జైలు శిక్ష పదేళ్లు

## జరిమానా పదికోట్లకు హెచ్చింపు

### సవరణ బిల్లుపై చర్చలో కేంద్రమంత్రి జితేంద్రసింగ్

### ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టిన గౌరవ్ గగొయ్, ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ,జులై 28:** పేపర్ లీకేజీలకు పాల్పడిన వారికి కఠినంగా శిక్షిచేందుకు ప్రభుత్వ పరీక్షల్లో అక్రమాల కట్టడి సవరణ బిల్లు2026" బిల్లు తీసుకొచ్చామని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లుపై చర్చను ప్రారంభించిన సింగ్ మాట్లాడుతూ దోషులకు జైలు శిక్షను 10 ఏళ్లకు పెంచామని, లీకేజీ గ్యాంగ్‌లకు జరిమానాను రూ.1 కోటి నుంచి రూ.10 కోట్లకు పెంచామని చెప్పారు. ఈ కేసుల విచారణకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదిత బిల్లు చట్టమైతే సత్వర న్యాయం జరుగుతుందని అన్నారు. పరీక్ష పేపర్ లీకేజీలు అరికట్టేందుకు నందన్ నిలేకని ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇంతకు ముందు యూపీఏ ప్రభుత్వ హయాంలో ఎన్నో ఎంట్రన్స్ పరీక్షలు, ఉద్యోగ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయని జితేంద్ర సింగ్ గుర్తుచేశారు. 2009, 2011లో ఎన్నో పేపర్ లీక్స్, 2010లో యూపీలో బీఈడీ పేపర్ లీక్, 2012లో ఎయిమ్స్ ఎంట్రన్స్ పేపర్ లీక్, తమిళనాడులో పీఎస్సీ పేపర్ లీక్‌లు జరిగాయి. క్రమంగా ఇవి వ్యవస్థీకృత నేరాలుగా మారాయి. వీటిని అరికట్టేందుకు 1992, 2010లో కొన్ని ప్రయత్నాలు జరిగాయని, కానీ అవి ఎందుకు ఫలించలేదో ఆనాటి పాలకులే చెప్పాలని జితేంద్ర సింగ్ అన్నారు. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లు అనేది విద్యార్థులు, యువత పట్ల మోడీ సర్కార్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. ఇది భారత పార్లమెంట్ చరిత్రలోనే నిలిచిపోతుందని అన్నారు. ఉమ్మడి పరీక్ష విధానాన్ని ఏర్పాటు చేయడానికి గతంలో జరిగిన ప్రయత్నాలను కూడా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ప్రస్తావించారు.

2017లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని ఏర్పాటు చేశామన్నారు. చరిత్రను పరిశీలిస్తే 1992లో మొదటిసారి ఉమ్మడి పరీక్ష కోసం సిఫార్సు చేయడం జరిగింది. 2010లో యూపీఏ పాలనలో ఒక కమిటీ ఏర్పాటు అయ్యింది. కానీ ఆ పని మధ్యలోనే నిలిచిపోయింది. అలా నిలిచిపోయిన పనిని పూర్తి చేసినందుకు మీరు ప్రధాని మోడీని, ఈ ప్రభుత్వాన్ని అభినందించాలని జితేంద్రసింగ్ విపక్ష ఎంపిలకు హితవు పలికారు. అయితే కాంగ్రెస్ సభా పక్షం ఉపనేత గౌరవ్‌గగోయ్ మాట్లాడుతూ లీకేజీ కేసుల విచారణలో ప్రభుత్వం ఉదాసీన వైఖరి ప్రదర్శించిందని, అనేక లీకేజీ కేసుల్లోని నిందితులకు ప్రభుత్వం బెయిలిచ్చిందని వ్యాఖ్యానించారు. నీట్ లీకేజీతో 21 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రధాని కనీసం స్పందించలేదని, ఇప్పుడు టాస్క్‌ఫోర్స్ వేశామంటూ ప్రధాని చెప్పడం పట్ల ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండేళ్ల క్రితం కూడా నిపుణుల కమిటీ వేశారని, దానిపై ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. అప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే మళ్లీ లీకేజీ జరిగేది కాదు కదా అని మండిపడ్డారు.రెండేళ్ల క్రితం పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ 2024 పేరుతో బిల్లును తీసుకువచ్చిందని, ఆ సమయంలో బిల్లు ప్రవేశపెడుతూ, ఇదొక చరిత్రాత్మక అడుగని, ఇకపై ప్రశ్న పత్రాల లీకేజీలు జరగవని ప్రభుత్వం పేర్కొందని గొగోయ్ గుర్తుచేశారు. ఈ ఆ బిల్లులో కఠినమైన నిబంధనలను పొందుపర్చామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుందని దుయ్యబట్టారు. పదే పదే లీకేజీలు జరుగుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తూ ఉండిపోయిందని వ్యాఖ్యానిం చారు. విద్యను కూడా ఓట్లు సంపాదించే మార్గంగా ఎన్‌డీఏ సర్కారు భావిస్తోందని గొగోయ్ ఆరోపించారు. లోక్‌సభలో యాంటీ పేపర్ లీక్‌బిల్లుపై చర్చలో గౌరవ్ గొగోయ్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఇక, పదే పదే జరుగుతున్న పేపర్ లీకేజీ ఘటనలపై గౌరవ్ గొగోయ్ తీవ్రంగా మండిపడ్డారు. తరచూ లీకేజీలు జరుగుతున్నా ఎన్‌టీఏ ఛైర్మన్‌ను ఎందుకు తొలగించలేదని ఆయన ప్రశ్నించారు. ఎన్‌టీఏ ఛైర్మన్ గతంలో మధ్యప్రదేశ్ పీఎస్సీ ఛైర్మన్‌గా ఉన్నారు. అంతకుముందు, ఎంపీపీఎస్సీ ఛైర్మన్‌గా ఉన్నప్పుడూ ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఒక విషయం ఆలోచిస్తే, ఆర్‌ఎస్ఎస్ భావజాలం ఉన్నవారినే వర్సిటీ పదవుల్లో నియమిస్తున్నారు. ఆర్‌ఎస్ఎస్ భావజాలం ఉన్నవారినే ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లోకి తీసుకుంటున్నారు అని గొగోయ్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. నీట్‌పరీక్ష పేపర్ లీకేజీపై నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జీ చేయడంపై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ మండిపడ్డారు. విద్యార్థులను పోలీసులు లాఠీలతో కొట్టారని, బాష్పవాయువు ప్రయోగించారని, ముఖ్యంగా బాలికల దుస్తులు లాగి అసభ్యంగా ప్రవర్తించారని మండిపడ్డారు.ప్రధాని మోడీ కెమెరా యాంగిల్ కాదు, తన మనసు యాంగిల్ మార్చి చూడాలని సూచించారు. పేపర్ లీక్ బిల్లు వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఒక్కరికీ శిక్ష పడలేదు. పేపర్ లీక్ దోషులకు శిక్ష పడనంత కాలం యువతకు భరోసా ఎలా కలుగుతుంది ప్రధాని తన సలహాదారులను మార్చాలి. ఎందుకంటే ఆయన వాస్తవాలను పూర్తిగా విస్మరించారు. కేంద్ర ప్రభుత్వ విద్యావ్యవస్థపై అన్ని వర్గాలతో చర్చించాలి. నిపుణులతో చర్చించి సమూల మార్పులు చేయాలి. ఉపాధి కల్పనకు పెద్దపీట వేయాలి. వైద్య కళాశాలల సంఖ్యను మరింత పెంచాలి. యువత న్యాయం కోరుతున్నారు. వారు భిక్షాటన చేయడం లేదు. యువత డిమాండ్లలో న్యాయం ఉంది. కనుకనే అందరూ మద్దతు ఇస్తున్నారు. పేపర్ లీక్‌లు నివారించడానికి కొత్త కమిటీలు వేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇంతకు ముందు రాధాకృష్ణ కమిటీ సిఫారసులు ఒక్కటీ అమలు చేయలేదు. శిక్షల గురించి అనుభవం లేని వ్యక్తులను కమిటీలో చేర్చారు. ఇక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు గతంలోనూ ఉన్నాయి.

ఆ కోర్టుల రికార్డులు మొదటి నుంచి సరిగ్గా లేవని ప్రియాంక గా2024లో పేపర్ లీక్ బిల్లు వచ్చాక ఇంతవరకు ఒక్కరిపై కూడా చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకాగాంధీ గుర్తుచేశారు. ఇప్పటివరకు 152 పేపర్ లీక్ ఘటనలు జరిగినట్లు చెప్పారు. పేపర్ లీక్ ఘటనల వెనుక మాఫియా ఉందని ప్రియాంకాగాంధీ ఆరోపించారు. వారు విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారని విమర్శించారు. పేపర్ లీక్‌ల వల్ల విద్యార్థుల ఆత్మస్థైర్యం దెబ్బతిందని ప్రియాంకగాంధీ విమర్శించారు. అటు రాజ్యసభలోను చర్చ సజావుగా కొనసాగలేదు. పదేపదే విపక్ష సభ్యులు అడ్డుతగలడంతో సభను మరుసటిరోజు అంటే బుధవారానికి వాయిదా వేసారు.

## వారం - వర్జ్యం

29-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
పౌర్ణమి రా.8.03,
ఉత్తరాషాఢ ఉ.3.35
వర్జ్యం : రా.7.56-9.40
దు. ఉ.11.47-మ.12.39
శుభసమయం : ఉ.9.00-10.00
రాహుకాలం - మ.12.00-1.30

## వారఫలం

**మేషం:** ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. ... ఎదురై చికాకుపెడతాయి.

**వృషభం:** కుటుంబ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ... పొందుతారు. కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి.

**మిథునం:** ... ఆర్థికంగా బలం చేకూరుతుంది ... పూర్తిచేస్తారు.

**కర్కాటకం:** ... సమాచారం అందుకుంటారు.

**సింహం:** నూతన పరిచయాలు పెరుగుతాయి. ... అనుకూలిస్తాయి.

**కన్య:** శాస్త్ర, సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు. ... లాభిస్తాయి.

**తుల:** ఆకస్మిక సమస్యలు ఎదురైనా ... అధిగమిస్తారు.

**వృశ్చికం:** మీ మాటకు కొంత విలువ ... జాగ్రత్త వహించండి.

**ధనుస్సు:** ... విద్యార్థులకు ... జాగ్రత్త.

**మకరం:** ... ప్రయోజనాలు ... పొందుతారు.

**కుంభం:** ... సహాయం పొందుతారు.

**మీనం:** దాన ధర్మాల వంటి పుణ్యకార్యాలలో ... చూపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వెయిట్ లిఫ్టర్ అజయ్ బాబుకు సిఎం చంద్రబాబు అభినందనలు



**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** వెయిట్ లిఫ్టర్ గ్లాస్గో 2026 కామన్వెల్త్ క్రీడల్లో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్ బాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు. తన తండ్రి శ్రీనివాసరావు అడుగుజాడల్లో నడుస్తూ అజయ్ క్రీడా వారసత్వాన్ని విజయవంతంగా కొనసాగించారని ప్రశంసించారు. అజయ్ సాధించిన ఈ విజయం ఆంధ్రప్రదేశ్‌తో పాటు యావత్ భారతదేశానికే గర్వకారణం అని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ క్రీడా కీర్తిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. అజయ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టం చేసారు.



## డి.సిఎం పవన్ కళ్యాణ్ ప్రశంసలు

కామన్వెల్త్ గేమ్స్ 2026లో రజత పతకం సాధించిన వెయిట్ లిఫ్టర్ వల్లూరి అజయ్ బాబుకు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలియజేశారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ గ్లాస్గోలో పురుషుల 79 కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించి భారతదేశానికి మరో కీర్తిని తెచ్చిపెట్టిన అజయ్ బాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. స్వర్ణ పతకాన్ని అత్యంత స్వల్ప తేడాతో చేజార్చుకున్నా ఛాంపియన్‌గా నిలిచావని కొనియాడారు. అజయ్ బాబు ప్రదర్శన.. ధైర్యం, పట్టుదల, క్రమశిక్షణకు నిదర్శనమన్నారు. అజయ్ బాబు విజయనగరం జిల్లా కీర్తిని ప్రపంచ వేదికపై చాటారని, తండ్రి వల్లూరి శ్రీనివాసరావు క్రీడా వారసత్వాన్ని కొనసాగించారని పవన్ అన్నారు. భారతదేశానికి మరో గర్వకారణమైన విజయాన్ని అజయ్ అందించారన్నారు. తమ బిడ్డలలో ఒకరు భారత్‌కు కీర్తిని తెచ్చిపెట్టినందుకు ఆంధ్రప్రదేశ్ ఎంతో గర్వపడుతోందని అన్నారు. ప్రపంచ వేదికపై మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అజయ్‌బాబుకు పవన్ శుభాకాంక్షలు తెలిపారు.

# నాడు తండ్రి.. నేడు కొడుకు

## కామన్వెల్త్ గేమ్స్‌లో అజయ్ బాబు రజతం

## విజయనగరం జిల్లా కొండవెలగాడలో సంబరాలు




**నెల్లిమర్ల, జులై 28 ప్రభాతవార్త:** స్కాట్లాండ్ దేశంలోని గ్లాస్గో పట్టణంలో జరుగుతున్న కామన్వెల్త్ దేశాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన వల్లూరి అజయ్ బాబు రజత పతకం సాధించి దేశ కీర్తి ప్రతిష్టలను రెపరెపలాడించాడు. 79 కిలోల కేటగిరీలో ఈ పోటీల్లో పాల్గొన్న అజయ్ బాబు స్నాచ్‌లో 149 కిలోల బరువు, క్లీన్ అండ్ జర్క్‌లో 181 కిలోల బరువు మొత్తం 330 కిలోల బరువుని ఎత్తి ఈ రజత పతకం సాధించాడు. ఈ పోటీల్లో భారతదేశానికి దక్కిన ఆరో పతకమిది.

**తండ్రికి వారసుడిగా..:** 2010వ సంవత్సరంలో న్యూఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ దేశాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో అజయ్ బాబు తండ్రి వల్లూరు శ్రీనివాసరావు పాల్గొని రజిత పతకం సాధించాడు. తండ్రి బాటలో నడిచిన కుమారుడు అజయ్ బాబు కూడా అదే కామన్వెల్త్ దేశాల పోటీల్లో పాల్గొని రజిత పతకం సాధించి భారతదేశానికి అందించడం యాదృచ్ఛికమే అయినప్పటికీ తండ్రికి తగ్గ తనయుడిగా, అసలు సిసలైన వారసుడిగా నిలబెట్టుకున్నట్లయింది. అజయ్ బాబు సాధించిన విజయం పట్ల రాష్ట్ర, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు అజయ్ బాబును అభినందనలతో ముంచెత్తారు. కొండవెలగాడ గ్రామంలో క్రీడాకారులు, గ్రామస్తులు సంబరాలు చేసుకుంటున్నారు.

# స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా రాజధాని పనులు

- వేగం మరింత పెరగాలి... అనుకున్న సమయానికి పనులు పూర్తి కావాలి
- రాజధాని పనులపై కాంట్రాక్ట్ సంస్థలు, అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం మరింత పెరగాలని, అనుకున్న సమయానికి ప్రతి ప్రాజెక్టు పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. స్పీడ్, క్వాలిటీ, డెలివరీ లక్ష్యంగా రాజధాని పనులు జరగాలని సిఎం అన్నారు. గతంతో పోల్చితే పనుల్లో వేగం కొంత మేర పెరిగినా, ఇంకా వేగం పెంచాలన్నారు. ఒక నిర్మాణ సంస్థగా రాజధాని పనులు చేపట్టడం గొప్ప అవకాశమని, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిఎం సూచించారు. ఆర్థికంగా ఎటువంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం చూస్తున్న నేపథ్యంలో పనుల్లో ఎక్కడా జాప్యం ఉండకూదని సిఎం స్పష్టం చేశారు. సచివాలయంలో రాజధాని అమరావతి నిర్మాణ సంస్థల ప్రతినిధులతో ముఖ్యమంత్రి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజధానిలో 95 ప్రాజెక్టులకు సంబంధించి రూ.50,999 కోట్ల విలువైన పనులు చేపట్టగా నెలకు కనీసం 7.92శాతం పనులు జరగాలని సూచించారు. భూసేకరణ, నిధుల సమీకరణ, అనుమతులు, డిజైన్లు వంటి అంశాల్లో అన్ని శాఖలు, ఉన్నతాధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అమరావతి అంటే... కేవలం 29 గ్రామాల సమాహారంగా కాకుండా విజయవాడ, గుంటూరుతో కలిపి చూడాలన్నారు. అందుకు తగిన విధంగా ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతుల ప్రాజెక్ట్ పనులు జరగాలన్నారు. రోడ్ల నిర్మాణంతో పాటు పచ్చదనం పెంపుపైనా దృష్టిపెట్టాలని సూచించారు. తాను కూడా స్వయంగా ఇకపై రాజధాని పనులను పరిశీలిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో మంత్రి నారాయణ, సిఎస్ సాయిప్రసాద్, ఉన్నతాధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎల్ నినో నుంచి రైతులను ఆదుకోండి



- సిఎం చంద్రబాబుకు సిపిఐ రామకృష్ణ వినతి

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్ నినో కారణంగా తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. కె.రామకృష్ణ మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబును కలిశారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 54 శాతం తక్కువగా వర్షపాతం నమోదైందని, 249 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని ఆయన వివరించారు. అదే విధంగా మంచినీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని రామకృష్ణ ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా సిఎం స్పందిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఎల్ నినో సమస్యపై దృష్టి సారించిందని, ఆగస్ట్ 3 నుంచి అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా ఉండేలా యంత్రాగానికి ఆదేశాలు జారీ చేశామని సిఎం అన్నారు. ప్రభుత్వం దృష్టికి రామకృష్ణ తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు.

# ట్రోలింగ్‌కు దూరంగా ఉండండి

- అభిమానులకు అల్లు అర్జున్ కీలక సూచన



అభిమానులతో కలిసి సెల్ఫీ దిగుతున్న అల్లు అర్జున్

**జూబ్లీహిల్స్, జులై 28 ప్రభాతవార్త:** నచ్చని వారి గురించి ఆలోచించడం కంటే నచ్చే పనిచేసుకుంటూ వెళ్లడం మంచిదని తన అభిమానులను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సూచించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియాలో జరుగుతున్న నెగెటివిటీ, అనవసర వివాదాల గురించి స్పందిస్తూ అభిమానులకు పలు కీలక సూచనలు చేశారు.యూసుఫ్‌గూడలోని శౌర్య భవన్‌లో మంగళవారం అల్లు అర్జున్ దాదాపు 900ల మంది అభిమానులతో నలుపు రంగు దుస్తు కోడ్‌లో అభిమానుల ఆతిథ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడుతూ.. ఈ రోజు నేను ఇక్కడ ఉండటం చాలా గర్వంగా ఉంది. ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు. మీలో ఈ ఉత్సాహాన్ని ఎప్పటికి పోనివ్వకండి. నా అభిమానులకే కాదు.. నన్ను ద్వేషించేవారికి చెబుతున్నా.. ఒకరిపై ఒకరు ట్రోలింగ్ చేయడం మంచిది కాదు. మనకు నచ్చని వాళ్ల కోసం మన సమయం, డబ్బు, శక్తి ఎందుకు ఖర్చుచేయాలి.? సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌పై స్పదించడం కంటే, ఆ సమయాన్ని మీ సొంత ఎదుగుదల కోసం ఉపయోగించండి, మీకు నచ్చిన పని చేయండి, నీకు నచ్చిన అమ్మాయి ఇంటి ముందు నిలబడి ఎదురుచూడండి, పర్లేదు కనీసం నువ్వు ఆ సయమాన్ని అయినా ఎంజాయ్ చేస్తావు కదా అని అన్నారు. ఎవరిని ఎప్పుడు ట్రోల్స్ చేయవద్దని, సమయం, శక్తి ఏదైనా అనుకోండి ప్రతి మనిషికి ఒక రోజులో 100 శాతం ఉందనుకుంటే దాన్ని మీరు దేనికి ఉపయోగిస్తారనేది ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతోపాటు ఒరిస్సా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ నుంచి అభిమానులు తరలివచ్చారు. ఏఏఎఫ్ఏ తరుపున ఆయన అభిమానులకు ఇన్సూరెన్స్ పాలసీలను అందించారు. ఈ సందర్భంగా ప్రతి అభిమానికి ఆయన తనతో ఫొటో దిగే అవకావం కల్పించారు.

## ఎపిలో జాతీయ రహదారులపై

# డ్రైవర్ల కోసం 59 అప్నా ఘర్‌లు

## రాజ్యసభలో ఎంపి రఘునాథ రెడ్డికి కేంద్ర మంత్రి సురేష్ గోపి వెల్లడి

**రాజంపేట, జులై 28 ప్రభాతవార్త:** జాతీయ రాష్ట్ర రహదారులపై ట్రక్ డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్ల భద్రత, విశ్రాంతి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అవసరమైన చోట అప్నా ఘర్ అమలు చేస్తున్నట్లు 'అప్నా ఘర్' కార్యక్రమంపై వైసిపి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సురేష్ గోపి సమాధానం ఇచ్చారు. 2026 జులై 1 నాటికి దేశవ్యాప్తంగా 840 'అప్నా ఘర్' కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఆంధ్రప్రదేశ్‌లో 59 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 58 జాతీయ రహదారులపై, 1 రాష్ట్ర రహదారిపై ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో ట్రక్ డ్రైవర్లకు 10 నుంచి 30 పడకలతో వసతి, రెస్టారెంట్, ధాబా లేదా స్వీయ వంట సౌకర్యం, శుభ్రమైన మరుగుదొడ్లు, ప్రత్యేక స్నాన సౌకర్యాలు, శుద్ధి చేసిన తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అదేవిధంగా, జాతీయ రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్ మార్గాలు, పోర్టు అనుసంధాన రహదారులు, మైనింగ్ బెల్ట్‌లు, తయారీ క్లస్టర్లు వంటి ప్రాంతాల్లో ట్రక్కుల రద్దీ, భూమి లభ్యత, పారిశ్రామిక కేంద్రాలకు సమీపం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కొత్త 'అప్నా ఘర్' కేంద్రాల ఏర్పాటును దశలవారీగా విస్తరిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

# పార్టీ గీత దాటలేదు.. భవిష్యత్‌లోనూ దాటను!

## - విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పార్టీ గీత దాటలేదు. భవిష్యత్‌లోనూ దాటను. చంద్రబాబు ఆదేశాలను ఎప్పుడూ శిరసావహిస్తానని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు స్పష్టం చేసారు. ముద్రగడ పద్మనాభం. సంస్మరణ సభకు వెళ్లి వైఎస్సార్సీపీ నేతలను కలవాల్సి వచ్చిందన్నారు. ఆ విషయాన్ని విపరీతంగా ట్రోల్ చేశారన్నారు. మంగళవారం త్రిసభ్య కమిటీ ముందు బొండా ఉమా విచారణకు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనపై వచ్చిన ఆరోపణలకు పల్లా శ్రీనివాస్, రామానాయుడుకు వివరణ ఇచ్చానని తెలిపారు. "సోషల్ మీడియాలో నా మాటలను వక్రీకరించారు. జరిగిన ఘటనను వక్రీకరించారు ఇదంతా సమన్వయ లోపమే. ఇలాంటివి మరోసారి జరగకుండా చూస్తానని చెప్పా. కొన్ని దుష్టశక్తులు నాపై బురద జల్లాయి. నేను చెప్పని మాటలను కూడా టివిల్లో ప్రసారం చేశారు" అని ఎమ్మెల్యే బోండా ఉమ పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభకు మాత్రమే హాజరయ్యానని తెలిపారు. కాపు జెఏసి ఆధ్వర్యంలో నిర్వహించిన ముద్రగడ సంస్మరణ సభకు అన్ని పార్టీలకు చెందిన నేతలు హాజరయ్యారని బోండా ఉమ తెలిపారు. ఆ సభలో తాను పాల్గొనడంలో ఎలాంటి రాజకీయ ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. సభలో నేను కూర్చున్న కుర్చీ పక్కకు వైసిపి మాజీ మంత్రి అంబటి రాంబాబు వచ్చి పలకరించారు. అది వాస్తవం. కానీ దాన్ని వేరే విధంగా ప్రచారం చేస్తున్నారు అని బోండా ఉమ పేర్కొన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుని సోషల్ మీడియాలో ప్రచారం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ వ్యవహారంపై పార్టీ అధిష్టానానికి పూర్తి వివరాలు వెల్లడించినట్లు తెలిపారు. తాను ఎప్పుడూ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించలేదని బోండా ఉమ స్పష్టం చేశారు.

# ముగిసిన కపిలేశ్వరుని పవిత్రోత్సవాలు

**తిరుమల, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన వార్షిక పవిత్రోత్సవాలు మంగళవారం మహాపూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిశాయి. వేద మంత్రోచ్చారణల నడుమ భక్తిపారవశ్య వాతావరణంలో నిర్వహించిన ఈ మహోత్సవాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం యాగశాల పూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మూలవర్లకు కలశాభిషేకం, పట్టుపవిత్ర సమర్పణ తదితర విశిష్ట ఆగమ కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం పంచమూర్తులు ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దివ్య దర్శనమిస్తూ ఊరేగి అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి జెఇఒ డాక్టర్ ఎ. శరత్, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



## జీవితాంతం విఐపి బ్రేక్ దర్శనమంటూ మోసం

# భక్తులను నమ్మిస్తే చర్యలు: టిటిడి

**తిరుమల,జులై 28 ప్రభాతవార్తప్రతినిధి:** యాత్రాస్థలం తిరుపతి నగర ప్రాధాన్యత దృష్ట్యా సొంతింటి కల సాకారం పేరుతో ప్లాట్ కొంటే జీవితాంతం విఐపి బ్రేక్ దర్శనం సదుపాయం కల్పిస్తామని మోసం చేస్తున్న వారిపై టిటిడి చర్యలకు ఉపక్రమించింది. సామాజిక మాధ్యమంలో ఈ దుష్ప్రచారం చేస్తున్న ఎస్‌సిపి డెవలపర్స్ సంస్థపై కఠిన చర్యలకై పోలీసులకు ఫిర్యాదు అందింది. కొంతమంది వ్యక్తులు తిరుపతి హైవే లో ప్లాట్లు కొనుగోలు చేస్తే "జీవితాంతం శ్రీవారి విఐపి బ్రేక్ దర్శనం కల్పిస్తామంటూ ప్రచారం చేస్తున్న రీల్స్‌ను టిటిడి తీవ్రంగా ఖండించింది. ఈ ప్రచారానికి టిటిడితో ఎలాంటి సంబంధం లేదని, ఇటువంటి హామీలు ఇచ్చే అధికారం ఏ ప్రైవేటు సంస్థకు, వ్యక్తికి లేదని టిటిడి యంత్రాంగం స్పష్టం చేసింది. శ్రీవారి దర్శనానికి సంబంధించిన అన్ని విధానాలు, సేవలు, టికెట్లు పూర్తిగా టిటిడి నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే అమలులో ఉంటాయి. ఎవరైనా వ్యక్తులు ,సంస్థలు భక్తులను ఆకర్షించేందుకు టిటిడి పేరు, శ్రీవారి పేరు, దర్శనాల పేరును ఉపయోగించి తప్పుడు ప్రచారం చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్యగా పేర్కొన్నారు. భక్తులు ఇటువంటి తప్పుడు ప్రకటనలు, సోషల్ మీడియా రీల్స్, వాణిజ్య ప్రకటనలను నమ్మి మోసపోవద్దని టిటిడి విజ్ఞప్తి చేసింది. శ్రీవారి దర్శనాలకు సంబంధించిన అధికారిక సమాచారం కోసం టిటిడి అధికారిక ప్రకటనలు, వెబ్‌సైట్ ,అధికారిక సోషల్ మీడియా వేదికలను మాత్రమే విశ్వసించాలని భక్తులను కోరారు.

# సినీ నటి పావలా శ్యామల కన్నుమూత

- అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి
- 250పైగా చిత్రాల్లో నటించి ప్రత్యేక గుర్తింపు





**హైదరాబాద్, జులై 28 ప్రభాతవార్త:** సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్ట్ పావలా శ్యామల కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆమె మరణించినట్లుగా ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆమె భౌతికకాయాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఎపిలోని గుంటూరు జిల్లాలో 1951లో జన్మించిన పావలా శ్యామల అసలు పేరు నేతి శ్యామల. పదో తరగతి వరకు చదువుకున్న ఆమె, నాటక రంగంతో నటన రంగంలోకి అడుగుపెట్టింది. నటిగా, రేడియో ఆర్టిస్ట్‌గా ప్రస్థానం ప్రారంభించారు. ఆమె నటించిన 'పావలా' అనే నాటకం విశేష ప్రజాదరణ పొందడంతో అదే ఆమె ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. తన అమాయకత్వంతో కూడిన నటనతో తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్రవేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన సినీ ప్రయాణంలో పావలా శ్యామల 250కి పైగా చిత్రాలలో నటించారు. 1985లో బాలకృష్ణ హీరోగా వచ్చిన 'బాబాయ్ అబ్బాయ్' సినిమాతో పావలా శ్యామల ఇండస్ట్రీలోకి వచ్చారు. కె.విశ్వనాథ్ దర్శకత్వంలో వచ్చిన 'స్వర్ణకమలం' సినిమాతో నటిగా ఆమె గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత ఖడ్గం, గోలీమార్, ఆంధ్రావాలా సినిమాలతో ఆమె పాపులర్ అయ్యారు. కాగా,పావలా శ్యామల మరణవార్తతో తెలుగు సినీ పరిశ్రమలో విషాదం నెలకొంది.

## శాకంబరిగా దుర్గమ్మ

# దర్శనానికి భక్తుల వెల్లువ

**ఇంద్రకీలాద్రి, జులై 28 ప్రభాతవార్త:** దుర్గమ్మకి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో మంగళవారం రద్దీ నెలకొంది. శ్రీ కనక దుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్ర కీలాద్రికి 15వ రోజు మంగళవారం 32 సారె బృందాలకు చెందిన 16,890 మంది మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. దుర్గమ్మ దర్శనానంతరం 6వ అంతస్తు లోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు. భవానీ అనుగ్రహ దర్శన్ క్యూ లైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు.

**పోరంకి వేదపాఠశాల విద్యార్థులకు ప్రత్యేక దర్శనం:** పోరంకి వేద పాఠశాల విద్యార్థులకు పౌర్ణమి, అమావాస్య రోజుల్లో దుర్గమ్మ ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసినట్లు ఇఒ శీనా నాయక్ తెలిపారు. దేవస్థాన చరిత్ర లో తొలిసారిగా వేద విద్యార్థుల కోసం వేద దివ్య దర్శనం పాలసీ" రూపొందించామన్నారు. వేద విద్యను ప్రోత్సహించేందుకు ఇకపై ప్రతి పండగ దినాల్లో, పౌర్ణమి, అమావాస్య వంటి విశేష పర్వదినాల్లో అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించనున్నామన్నారు. సకల లోకాలను రక్షించడానికి ఈనెల 27 నుండి శాకంబరి మాతగా అనుగ్రహించిన దుర్గమ్మ ఆలయంలో బుధవారం ఉదయం పూర్ణాహుతి నిర్వహిస్తామని ఇఒ శీనా నాయక్ తెలిపారు.


Ref B1/46/2025 dt.27.07.2026

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

**భూసేకరణ చట్టం, 2013లోని సెక్షన్ 93 (1) ప్రకారం**

**(ఉపసంహరణ)**

2013 భూసేకరణ చట్టంలోని సెక్షన్ 93లోని సబ్-సెక్షన్ (1) ప్రకారం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జీలుగుమిల్లి మండలం, బర్రింకలపాడు గ్రామంలోని ఆర్.ఎస్.నెం.లోని క్రింద పేర్కొన్న షెడ్యూల్లోని భూమికి భూ సమస్యలు పెండింగ్ లో ఉన్నది, కావున ఇందుమూలంగా ఉపసంహరించుకుంటుంది. పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం ద్వారా 2013 నాటి భూసేకరణ, పునరావాసం మరియు పునరావాసంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత చట్టం 30 యొక్క సెక్షన్ - 11(1) కింద ప్రాథమిక ప్రకటన నోటిఫికేషన్ మొత్తం Ac. 1.72 సెంట్లు విస్తీర్ణంలో సర్వే నెం 8-4,12-1A,12-1B అంటే, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కింద వారి నుండి సేకరించిన భూములకు బదులుగా పునరావాసం మరియు పునరావాసం కింది కూనవరం మండలంలోని వల్పోర్డ్ పేట గ్రామంలోని గిరిజన భూమిని కోల్పోయిన వారికి ప్రజా ప్రయోజనం కోసం భూమిని కేటాయించడం కోసం అవసరమైనట్లుగా రెండు దినపత్రికలలో మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసాధారణ గెజిట్ నెం.PIP/23/2025, తేది: 25.07.2025లో ప్రచురించబడింది.

**షెడ్యూలు**

జిల్లా: ఏలూరు | మండలం: జీలుగుమిల్లి | గ్రామం: బర్రింకలపాడు

| క్రమ సంఖ్య | ప్రాథమిక ప్రకటనలో క్రమ సంఖ్య | సర్వే నెంబరు | భూసేకరణ క్రింది విస్తీర్ణం (య.సెంట్లు) | భూమి తరగతి | సంబంధిత ఆసామి పేరు/భూమితో సంబంధం ఉన్న వ్యక్తి పేరు /ఆసక్తి గల వారు మరియు చిరునామా | సరిహద్దులు: తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు కట్టడములు ఇతరముల వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | | | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 10 | 8-4 | 1.66 | | ముక్కు యుగంధరరావు తండ్రి గంగరాజు | 6,7 | 3 | 9,10, 11 | 3,4,5 | కుంకుడు-1,బర్రింక-1, తాడి -26, మారేడు-1, తుమ్మ-1,వెలగ-1 |
| 2 | 11 | 12-1A | 0.03 | | కక్కిరాల ధనలక్ష్మి భర్త పాపారావు | 13 | ఆటియా కుల గొంది | ఆటియా కుల గొంది | 10 | |
| 3 | 12 | 12-1B | 0.03 | | కక్కిరాల లక్ష్మి కాంతం భర్త ఓం కారేశ్వరరావు | 13 | ఆటియా కుల గొంది | ఆటియా కుల గొంది | 10 | - |
| | | | 1.72 | | | | | | | |

Place: చింతూరు యూనిట్ - 1
Date : 10-06-2026

డి.చంద్రశేఖర్
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
చింతూరు యూనిట్ - 1,
చింతూరు.

వి.అభిషేక్ ఐ.ఎ.ఎస్
స్పెషల్ కలెక్టర్ (భూ.సే) (ఎఫ్.ఎ.సి),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

29-7pg4_29-7pg4.qxd 28/Jul/26 10:33 PM Page 1




వార్త

అంతరాత్మ నీకు మంచి స్నేహితుడు. కావున తరచుగా తన మాట వినవలసిందే!

న- గురజాడ


# ఓటు హక్కుపై నీలినీడలు !

ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితాపై ప్రజలకు నమ్మకం లేకపోతే ఎన్నికల ఫలితాలపై కూడా అనుమానాలు తలెత్తుతాయి. అందుకే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ వంటి ప్రక్రియలు అత్యంత పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా సాగాలి. ఇప్పటికే ఎన్నో రాష్ట్రాలలో 'సర్' ప్రక్రియ విమర్శలకు తలకెత్తుకుంది. కాగా ఆంధ్రప్రదేశ్లో ఎస్ఐఆర్ అమలుపై వెలువడుతున్న ఆరోపణలు ఎన్నికల నిర్వహణపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రతిపక్షాల ఆరోపణలు కొట్టేయదగినవి కావు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని, బూత్ లెవల్ అధికారులపై అసాధారణ ఒత్తిడి ఉందని, రాజకీయ ప్రభావంతో ధృవీకరణ జరుగుతోందని, ఫారాల పరిశీలన సజావుగా లేదనే ఆరోపణలున్నాయి. ఆ మేరకు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు కూడా అందాయి. నకిలీ నమోదులు, మరణించిన వారి పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన ఓటర్లను గుర్తించి జాబితాను సరి చేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమని ప్రకటించుకున్నా జరుగుతున్న కార్యాచరణ వేరేగా ధ్వనిస్తోంది. ప్రతి అభ్యంతరాన్ని స్వీకరించేందుకు, ప్రతి ఓటరుకి అవకాశం కల్పించేందుకు చట్టబద్ధ విధానాలు అమల్లో ఉన్నాకూడా అధికారయంత్రాంగం కొన్ని విధానాలు పట్టించుకుంటు న్నట్లు లేదు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఎంత ఎక్కువగా ఉంటే, రాజకీయ వివాదాలు అంత తక్కువగా ఉంటాయి. ప్రతి తొలగింపుకు స్పష్టమైన కారణం ఉండాలి. ప్రతి అభ్యంతరానికి వేగంగా పరిష్కారం లభించాలి. ప్రతి రాజకీయ పార్టీకి సమాన సమాచారం అందాలి. ఇదే ప్రజాస్వామ్యానికి సరైన మార్గం. ఆంధ్ర ప్రదేశ్లో ఓటరు జాబితాలపై వివాదాలు కొత్తవి కావు. గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలపై కూడాఇలాంటి ఆరోపణలు వచ్చాయి. అందువల్ల ఇది ఒక పార్టీకి సంబంధించిన అంశంగా కాకుండా, ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతకు సంబంధించిన సమస్యగా చూడాలి. కానీ ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే నష్టపోయేది ప్రజాస్వామ్యమే. ఎస్ఐఆర్ అమలులో బూత్ లెవల్ అధికారుల పాత్ర అత్యంత కీలకం. అధికార యంత్రాంగం వేగం కంటే నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలి.ఇంకో వైపు రాజకీయ పార్టీలకూ బాధ్యత ఉంది. ఆధారాలతో కూడిన అభ్యంతరాలు సమర్పించడం, వాటిని నిష్పాక్షికంగా విచారించడం ఈ రెండు సమాంతరంగా జరగాలి. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించబడకూడదు. అదే సమయంలో నకిలీ నమోదులకు కూడా స్థానం ఉండకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే ఎన్నికల సంఘం ముందున్న అసలు సవాలు. ఎస్ఐఆర్ వివాదం చివరికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీ తనం, ప్రజలతో నిరంతర సంభాషణ ఈ మూడు సూత్రాలు బలంగా అమలైతే ఆరోపణలకు తావుండదు. తెలంగాణలో మొత్తం ఓటర్లు 3.4 కోట్లు. తెలంగాణలో ఫ్లాగ్ చేసిన రికార్డులు సుమారు 88 లక్షలుంటాయి. సుమారు 30లక్షలు అని అధికారుల అంచనా. ఇది మొత్తం ఓటర్లలో దాదాపు 9శాతంగా చెప్పాలి.ఎమ్ఇఆర్ చెల్లుబాటైన డాక్యుమెంట్లు ఇస్తే పేరు తొలగించరాదని సుప్రీం కోర్టు తీర్పు స్పష్టం చేసింది కూడా. వలసదారు లు, డూప్లికేట్ ఐడీల కారణంగా హైదరాబాద్లో అత్యధిక తొలగింపులు ఉండే అవకాశం ఉంది. తెలంగాణలో 30 లక్షల వరకు తొలగిపోయే అవకాశం ఉందని అంచనా. ఇక ఆంధ్ర ప్రదేశ్లో మొత్తం ఓటర్లు 4.16కోట్లు కాగా ఒక్క తిరుపతి జిల్లాలోనే 2.88 లక్షల మంది ఆచూకీ తెలియని వారి జాబితాలో పెట్టారు. ఇప్పటికే 15.2 లక్షల మంది చనిపోయిన వారు, 14.4 లక్షల మంది చిన్న గాయాలు మారిన వారు, 7.3లక్షల డూప్లికేట్ వెరసి 37లక్షలకు పైగా ఓటర్లు తొలగింపు ప్రక్రియలో బాధితులుగా మారారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం రాజ్యాంగ హక్కు మాత్రమే కాదు, అది జన స్వరానికి ప్రతీక. అర్హు లైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగించబడకూడదు. అదే సమయంలో నకిలీ నమోదులకు కూడా స్థానం ఉండకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే ఎన్నికల సంఘం ముందున్న అసలు సవాలు. ఎస్ఐఆర్ వివాదంలో తేలిన విషయాలను బట్టి చివరికి ఒక స్పష్టమైన సందేశాన్ని గమనించవచ్చు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ప్రజలతో నిరంతర సంభాషణ. ఈ మూడు సూత్రాలు బలంగా అమలైతే ఆరోపణలకు తావు తగ్గుతుంది. ప్రజాస్వామ్యం బలపడేది రాజకీయ విజయాలతో కాదు. ప్రజలు ఎన్నికల ప్రక్రియను నమ్మినప్పుడే. ఆ నమ్మకాన్ని కాపాడడం ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు అందరి ఉమ్మడి బాధ్యత. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం. సాంకేతిక సరిదిద్దుబాట్లు లేదా అధికారిక ప్రక్షాళన పేరుతో ఏఒక్క నిజమైన పౌరుడూ ఓటు హక్కుకు దూరం కాకూడదు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత పెరగాలన్నా, ప్రజాస్వామ్య పునాదులు బలపడాలన్నా 'సర్' ప్రక్రియ నిష్పాక్షికంగా, పారదర్శకంగా జరగడం అత్యంత ఆవశ్యకం. తగినముందస్తు నోటీసులు లేదా క్షేత్రస్థాయి విచారణ లేకుండానే నిజమైన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొలగించడం క్షమార్హం కాదు. వలస కార్మికులు, పేదలు , అట్టడుగు వర్గాలు అవసరమైన ఆధార్, పుట్టిన తేదీ లేదా నివాస ధ్రువీకరణ పత్రాలను



ఆత్మవిశ్వాసం, స్వయం పోషకత్వం ఉత్తమ స్వభావానికి మూలస్తంభాలు వంటివి.

వినోబా భావే



కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.

కె. స్టానిస్లావ్స్కి

## ప్రజావాక్కు



### మద్రాస్ హైకోర్టు తీర్పు అభినందనీయం

ఏదైనా ప్రమాదంలో చనిపోయిన వారికి ప్రభుత్వంలో ఉద్యోగం ఇస్తాం, ఆదుకుంటాం అనడం మన నాయకులకు అలవాటైపోయింది. ఆదుకుంటాం అనడంలో అర్థముంది. ప్రభుత్వ ఉద్యోగం ఇస్తాం అనడం మాత్రం కరెక్ట్ కాదు. మనరాజ్యాంగం 14వ ఆర్టికల్లో స్పష్టంగా చట్టం ముందు అందరూ సమానులే అని ఉంది. భారత దేశంలోఎక్కడా ఏవ్యక్తికి చట్టపరమైన సమనత్వాన్ని, రక్షణలను కల్పించటంలో సమానత్వాన్ని రాజ్యం నిరాకరించరాదు.మరి ఇలా ఈకుటుంబలవారికిప్రభుత్వ ఉద్యోగం ఇస్తామనడం చట్ట విరుద్ధం.ఇదే విషయాన్ని మద్రాస్ హైకోర్టు స్పష్టంగాచెప్పింది.'గతంలో తమిళనాడు విజయ్ సభలో చనిపోయినవారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిస్తాము అన్న హామీలు రాజ్యాంగ విరుద్ధం, పరీక్షలు పెట్టి అర్హులకు ఇవ్వాలి'. మద్రాస్ హైకోర్టు తీర్పు అభినందనీయం. ఈతీర్పు అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుంది.మరి మన నాయకులు చనిపోయిన వారికుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం అనడం పరిపాటి అయిపోయింది. కనుక ఇక నుండి ఇలాంటి సందర్భాలలో అలాంటి చట్టవిరుద్ధమైన హామీలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### మీసేవ ద్వారా హాజరు కల్పించాలి

కూలీనాలీ చేసుకుని చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ బతుకువెళ్లతీసే ఎందరో ముద్దాయిలుగా ఆయా కేసులలో న్యాయ స్థానాలకుహాజరైన సందర్భాలలోఉపాధిని కోల్పోతుంటారు.తుదితీర్పు రోజు వెలువడే రోజు మినహా ప్రతి సారిమీసేవ వంటివాటి సహాయంతో వర్చువల్గా హాజరు నమోదుకల్పిస్తే నిజమైన నిర్దోషులకు సాయంగా ఉంటుంది. ఎందరో సెలబ్రెటీలు పొందుతున్న ఈ సౌకర్యం సామాన్యులకెందుకు వర్తింపచేయకూడదో ఆలోచించాలి.

- వి.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

### ఖాళీ సీట్లను భర్తీ చేయాలి

గురుకులాల్లో పని చేస్తున్న లెక్చరర్స్, టీచర్స్,నాన్ టీచింగ్ స్టాఫ్ వారి పిల్లలకు కూడా గురుకులాల్లో సీట్లు కల్పించాలి.ఖాళీగాఉన్న సీట్లను భర్తీచేయాలి. ప్రతి గురుకులం ప్రతి తరగతిలో సంవత్సరం మొత్తం సీట్లు మిగిలి ఉంటున్నాయి. వృధాగా ఉండే కంటే గురుకులాల్లో పని చేస్తున్న వారి పిల్లలకు ఇవ్వాలి.మొత్తం సీట్లు ఈ 2026 -2027 నూతన విద్య సంవత్సరంలో భర్తీ చేయాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

### ఫాస్ట్ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలి

పోటీపరీక్షలు లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తాయి. అలాంటి పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీ జరగడం వల్ల నిజాయితీగా శ్రమించిన అభ్యర్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల విచారణకోసం ఫాస్ట్ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఎంతో స్వాగతించదగ్గది. ఇలాంటి కేసుల్లో వేగవంతమైన విచారణ నిందితులకు త్వరగా శిక్ష పడేలా చేయడమే కాకుండా, పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. చాలా సందర్భాల్లో దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు సంవత్సరాల పాటు సాగుతుంటాయి.దీనివల్ల పరీక్షలురాసిన అర్హులైనఅభ్యర్థులుతీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారు. వారి విద్య, ఉద్యోగ అవకాశాలు ఆలస్యమవుతాయి. మరోవైపు నేరస్థులకు చట్టంపై భయం తగ్గే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల వేగవంతమైన న్యాయ ప్రక్రియఅవసరం. పరీక్షా నిర్వహణలో అత్యాధునిక భద్రతా వ్యవస్థలు,డిజిటల్ పర్యవేక్షణ, ప్రశ్నపత్రాల రవాణా, నిల్వప్రక్రియల్లో కట్టుదిట్టమైన రక్షణచర్యలుఅమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### సరైన ఎంపి!

వీవీఎస్ లక్ష్మణ్ను భారత క్రికెట్ జట్టు హెడ్కోచ్గా నియమించాలని అభిమానులు కోరుతున్నారు. తాత్కాలిక కోచ్గా 7 ద్వైపాక్షిక సిరీస్లలో 6 విజయాలు అందించడంతో పాటు ఆసియా క్రీడల్లో భారత్కు స్వర్ణ పతకం అందించారు. యువ ఆటగాళ్లను ఒత్తిడి లేకుండా ప్రోత్సహించి వారి ప్రతిభను వెలికితీయడంఆయన ప్రత్యేకత.సీనియర్లు,జూనియర్లు అందరినీ సమానంగా గౌరవిస్తూ జట్టులో ఐక్యతను పెంపొందిస్తారు. ఆయన కోచింగ్ విధానం జట్టుకు సానుకూల వాతావరణాన్ని తీసుకువస్తుందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి. గంభీర్ కంటే లక్ష్మణ్ మార్గదర్శకత్వంలో యువ ఆటగాళ్లు మెరుగ్గా రాణిస్తున్నారనే అభిప్రాయం క్రికెట్ వర్గాల్లో ఉంది.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### ఉద్యోగులు విధిగా విధులు నిర్వహించాలి

ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యేకంగా పంచాయతీ కార్యదర్శులు పని వేళలో సక్రమంగా సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలి. వాళ్లకు కేటాయించిన ఊర్లోనే ఉంటూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి. ఎక్కడ అందుబాటులో లేకపోయినాపై అధికారులకు ఫిర్యాదు చేయండి. విధుల నుండి తొలగించే అవకాశం లేకపోలేదు.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# బలమైన లక్ష్యమే 'కాక్రోచ్' విజయానికి నాంది!

**అహింసతో స్వాతంత్ర్యం సాధించుకున్న ఈ దేశం క్రమేపీ హింసకు అనేక ఘటనలల్లో స్థానం ఇవ్వటం శోచనీయం! విద్యార్థులు అదుపు తప్పితే అల్లరి చిల్లరి పనులు చేస్తారు! మన ఇండ్లలో గూడా పిల్లల అల్లరి చేష్టలు చూస్తునే వుంటాం! తల్లిదండ్రులు ఆ చేష్టలు శ్రుతిమించిన పుడు హద్దుల్లో పెట్టగలరు! ఆ నేర్పు ప్రభుత్వాలు నేర్చు కోవాలి! కరుడు గట్టిన అల్లరి మూకలను అణిచివేసే ధోరణి లోనే సహేతుకంగా ఆందోళనకు దిగిన యువతను విద్యార్థు లను, అదుపు చేయాలని ప్రయత్నించటం సరికాదు! ఆ విధంగా ఢిల్లీ పోలీసులు చేసారన్న ఆరోపణలు ఊపిరి పోసుకోవటం వల్ల, ఆందోళనకారులు ప్రతిఘటించారు. ఆ ప్రతిఘటనలకు సానుభూతి లభించింది. అందుకే మిడతల యుద్ధం విజయవంతంగా ముగిసింది! కాక్రోచ్ పార్టీ ఈ విజయాన్ని ఆధారం చేసుకొని రాజకీయాల్లో జొరబడితే దేశంలో వున్న అన్ని పార్టీల మాదిరే మిగులుతుంది. ప్రత్యే కత పేరుకు మాత్రమే కాదు లక్ష్యానికి వున్నప్పుడే విజయం చీమల దండుకైనా దక్కుతుంది.**



రావులపాటి సీతారాంరావు

మిడతల దండు ఉద్యమం విజయవంతంగా ముగియటానికి ముఖ్య కారణం పట్టుదల! విద్యార్థులలో యువతలో ఆ పట్టుదల లక్ష్యం సాధించాలన్న ఏకాగ్రత చాలా రోజుల తర్వాత ఈ ఉద్యమంలో చూడగలిగాం. సి.జె.పి (కాక్రోచ్ జనతా పార్టీ) స్థాపించిన అభిజిత్ దీప్కే స్వీయ నాయకత్వంతో ఈ విజయం సాధించాడా, వెనకవఎవరైనా వున్నారా అన్నది ప్రస్తుతంఅప్రస్తుతం! అది తర్వాత తేలాల్సిన విషయం! ప్రస్తుత పరిస్థితులలో, ఉద్యమం సద్దుమణిగిన వేళ కొన్ని అంశాలు ప్రస్ఫుటంగా విశ్లేషించుకోవాల్సిన అవసరం వుంది! జులై 19న జంతర్ మంతర్ నుంచి సోనమ్ వాంగ్ చుక్ను ఒక రోజు ముందు లేపేసిన రోజున వందల కొద్దీ యువత నిరసనకారులకు వత్తాసు పలికారు. బీహార్, యు.పి, రాజస్థాన్, హర్యానా, వెస్ట్ బెంగాల్ లాంటి రాష్ట్రాల నుండి తరలివచ్చి వారితో జత కలిపి ప్రొటెస్టు చేయసాగారు! మెట్రో స్టేషన్లు మూసి వేయబడినా, ఇంటర్నల్ సర్వీసులు పనిచేయకపోయినా, జనం విపరీతంగా ఎన్నో కిలోమీటర్లు నడుచుకుంటూ జంతర్ మంతర్ ప్రాంతానికి చేరుకోవటం విశేషమే! ఎవరిని అడిగినా జంతర్ మంతర్కు వెళ్తున్నాం అనే!జంతర్మంతర్ ప్రాంతంలో నిరాహార దీక్షలు చేస్తున్నవారు ఆకలిని తట్టుకొని ఎన్నో గంటలు కాక్రోచ్ ఉద్యమంలో పాల్గొనటం, విద్యార్థులకు మేమున్నాం అని చేయూతనివ్వటం ఈ మధ్య కాలంలో చూడని విషయంగా చెప్పుకోక తప్పదు! 21 రోజులు నిరాహార దీక్ష చేస్తూ గూడా చెక్కుచెదరని దీక్షతో విద్యార్థులు వుండటానికి కారణం వారు లక్ష్యాన్ని బలంగా నమ్మటం వల్లనే! అంతేగాదు ప్రశాంతంగా మౌనవ్రతంలో కూర్చోవటం గూడా అరుదైన విషయమే! ఆకలిని జయించి క్రమశిక్షణను ఆలంబనగా చేసుకొని విద్యార్థులు వారి శరీరాలను, మాటలనూ, ఓపికనూ అదుపులో నమ్మకంతో పెట్టుకోగలగటం వారి మొదటి విజయంగా చెప్పుకోవాలి!'విద్యార్థులలో తమకు జరుగుతున్న అన్యాయానికి లోలోపల కోపాగ్నిగా రగిలి బడబాగ్నిగా బయటకు ఉబికి ఉబికి వస్తున్నదని' అర్థతతో జంతర్మంతర్ ప్రాంతంలో అంతులేని విద్యార్థి లోకాన్ని చూసిన వృద్ధుడు అనటం అక్కడి వారిని కంటతడి పెట్టించింది. జులై 20 నాడు జంతర్ మంతర్లో చూసిన దృశ్యాలు విద్యార్థి లోకం మూకుమ్మడిగా తిరగబడటం, బారికేడ్లను విరిచేయటం, టియర్ గాస్, లాఠీ చార్జిలతో గాయాలు అయినా ఎదురొడ్డి నిల్చోవటం, అరెస్టులు కావటం పోలీసుల ఎఫ్.ఐ.ఆర్లను స్టేషన్లలో ఎదుర్కోవటం, ఇంకా ఆ ప్రాంతంలో నివసిస్తున్న జనానికి కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తూనే వున్నాయి! అయితే ఇన్ని జరిగినా వారిఓపిక తగ్గకుండా వుండటాన్ని ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటూనే వున్నారు! 'ప్రతిఘటన'ను విద్యార్థిలోకం ఆయుధంగా మల్చుకుంది! ఉద్రేకంతో చేసే ఆ ప్రతిఘటన వారి శరీరాల్లో ఇంకిపోయి పట్టుదలను మరింతగా పెంచినందువల్లేఅంతగా ప్రభుత్వాన్ని పాలనను ఎదిరించి పోరాడగలిగారు!వారి ప్రతిఘటనా శక్తిని అణిచివేయటానికి ప్రయత్నించినా మరింత వేగం పుంజుకొని వారిలో తిరగబడే నేర్పరితనాన్ని కలిగించటం వల్లనే, అంతమంది పోలీసులను ఎదురొడ్డి, దీక్షను సాగించగలిగారు! ప్రొటెస్ట్ వారికి ఆ క్షణంలో 'లైఫ్లైన్' గా





మారింది అన్న భ్రాంతిని చూపరులకు కలిగించింది! వేల కొద్దీ పార్లమెంటు వైపు పోలీసుల లాఠీచార్జీని, అణిచివేత ధోరణిని లెక్కచేయకుండా, ఆశ్చర్యపరిచే విధంగా సంయమనంతో ఓపికతో మార్చ్ చేస్తూ వెళ్ళటం వారి దృఢ సంకల్పాన్ని ప్రభుత్వానికి తెల్పినట్లయింది! వారే కాదు, మహిళలు, వృద్ధులు, పిల్లలు, బారికేడ్లను నెట్టేసుకుంటూ, లాఠీలు ఝుళిపిస్తున్న పోలీసులకు గులాబీ పుష్పాలు ఇస్తూ వెళ్తున్న వారిని చాలామందిని పోలీసులు అరెస్టు చేయటం అరుదైన దృశ్యంగా ఢిల్లీ వీధుల్లో ఆవిష్కరించబడింది! ఈ మధ్య కాలంలో యువత అంతగా బరితెగించి ప్రతిఘటించటం, చుట్టూ కమ్ముకుంటున్న నిరాశను, భవిష్యత్తు అయోమయంగా మారటాన్ని ప్రతిబింబించినట్లయింది. విద్యార్థుల చట్టోల్లంఘన పర్వం ప్రభుత్వానికి కొత్త పాఠాలను నేర్పినట్లయింది. 'నీట్' పరీక్షల ప్రహసనం కేవలం పెల్లుబుకుతున్న లావా పైకి రావటాన్ని మాత్రమే చూపించింది! ధర్మేంద్ర ప్రధాన్, మంత్రిగా రాజీనామా చేయటం వల్ల మొత్తం ప్రహసనానికి తెరపడ్డట్లు కాదేమో! ఉద్యోగాలు చాలా తక్కువ సంఖ్యలో వుంటున్న దశలో ఎంట్రెన్స్ పరీక్షలు తక్కువగా వున్న, ఆ ఉద్యోగాలు ఎంతమంది భవిష్యత్తులో కచ్చితంగా దక్కించుకోగలరో తేల్చటానికే! యువకులు ఆశాకిరణం 'పేపర్ల' లీక్తో 'టప్' ఆగినట్లయింది! ఆగిపోని రీతిలో అనేక లీక్లు దేశమంతటా సంభవిస్తుంటే దానికి కారణంగా అవినీతి కరాళనృత్యం కనపడింది. 20 లక్షల మంది (దాదాపు) నీట్ టెస్టును చాలా రోజులు కష్టపడి పగలనకా రేయనకా చదివి పరీక్ష రాసిన తర్వాత అది చెల్లదని అంటే విద్యార్థుల కడుపుల్లోంచి అగ్ని ఉబికి ఉబికి పైకొచ్చి ఉద్యమంగా మారింది! మళ్ళీ పరీక్ష రాయాలి! అదీ వారి స్కూల్ పరీక్షలు జరుగుతున్నప్పుడే అంటే విద్యార్థి లోకానికి ఆందోళన తప్ప మరో మార్గం ఏముంది? ఎంతో మంది విద్యార్థులు అపరిస్థితిని తట్టుకోలేకపోయారు! పోలీసులు సరియైన అవగాహన లేకుండా ప్రొటెస్టులు జరుగుతున్న ప్రాంతాలకు గుంపులుగా చేరకుండా వుండటానికి బలప్రయోగం చేయటం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది! ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణిచివేయటం సాధ్యం కాదని భావించిన తర్వాతనే క్రిందికి దిగివచ్చి దిద్దుబాటు చర్యలు మొదలు పెట్టింది. ఆ చర్యలు మొదటి దశలోనే 'లీక్' అని తెలిసినప్పుడే తీసుకున్నట్లయితే పరిస్థితి యింతదాకా వచ్చేది కాదు! కాక్రోచ్ పార్టీ భీష్మించుకొని కూర్చోవటంతో విధిలేక తలవంచే పరిస్థితి ప్రభుత్వం తెచ్చుకోవటం దయనీయంగా మారింది! రాజకీయ పార్టీలు ఈ అసాధారణ ఉద్యమాన్ని హైజాక్ చేయ ప్రయత్నించినా, వారికి సాధ్యం కాలేదు! 'సొమ్ము ఒకడిది సోకు ఒకడిది' అన్న రీతిలోఈ పార్టీలు 'క్రెడిట్' తీసుకోవాలని శతవిధాలా ప్రయత్నించినా విఫలం చెందక తప్పలేదు! కత్తి విడిచి సాము చేయటం ఈపార్టీలకు అలవాటయింది.సమస్యలను పరిష్కరించటం మానేసి నిప్పులను ఎగదోయటం అన్ని పార్టీలకు ఆనవాయితీగా మారటం దురదృష్టకరం! అహింసతో స్వాతంత్ర్యం సాధించుకున్న ఈ దేశం క్రమేపీ హింసకు అనేక ఘటనలల్లో స్థానం ఇవ్వటం శోచనీయం! విద్యార్థులు అదుపు తప్పితే అల్లరి చిల్లరి పనులు చేస్తారు! మన ఇండ్లలో గూడా పిల్లల అల్లరి చేష్టలు చూస్తునే వుంటాం! తల్లిదండ్రులు ఆ చేష్టలు శ్రుతిమించినప్పుడు హద్దుల్లో పెట్టగలరు! ఆ నేర్పు ప్రభుత్వాలు నేర్చుకోవాలి! కరుడుగట్టిన అల్లరి మూకలను అణిచివేసే ధోరణిలోనే సహేతుకంగా ఆందోళనకు దిగిన యువతను విద్యార్థులను, అదుపు చేయాలని ప్రయత్నించటం సరికాదు! ఆ విధంగా ఢిల్లీ పోలీసులు చేసారన్న ఆరోపణలు ఊపిరి పోసుకోవటం వల్ల, ఆందోళనకారులు ప్రతిఘటించారు. ఆ ప్రతిఘటనలకు సానుభూతి లభించింది. అందుకే మిడతల యుద్ధం విజయవంతంగా ముగిసింది! కాక్రోచ్ పార్టీ ఈ విజయాన్ని ఆధారం చేసుకొని రాజకీయాల్లో జొరబడితే దేశంలో వున్న అన్ని పార్టీల మాదిరే మిగులుతుంది. ప్రత్యేకత పేరుకు మాత్రమే కాదు లక్ష్యానికి వున్నప్పుడే విజయం

# సవాళ్లను అధిగమిస్తేనే సాంకేతికంగా ముందడుగు

వి. వీరప్ప

రక్షణ, టెలికాం, ఆటోమొబైల్స్, ఏఐ, ఆరోగ్య సంరక్షణ... ఇలా నేడు అన్నింటికీ సెమీకండక్టర్లు ప్రాణావసరాలుగా మారాయి. ఆధునిక సాంకేతిక జగత్తుకు మెదడుగా, 21వ శతాబ్దపు చమురుగా అవి గుర్తింపు పొందాయి. వాటి తయారీపై ఆలస్యంగా దృష్టిసారించిన ఫలితంగా ప్రస్తుతం దేశానికి కావాల్సిన చిప్లలో 90శాతానికి పైగా దిగుమతులే దిక్కవుతున్నాయి. కొవిడ్ సమయంలో సరఫరాలు స్తంభించి పరిశ్రమలు కుదేలయ్యాయి. ఈ దురవస్థను తప్పించేందుకు చిప్లను స్థానికంగానే డిజైన్ చేసుకోవడంతోపాటు తయారీ, ప్యాకేజింగ్, టెస్టింగ్ తదితరాల్లో స్వావలంబన సాధించేందుకు ఇండియా నడుం కట్టింది. అందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఆదిలోనే సంక్లిష్ట చిప్ల జోలికి వెళ్లకుండా దేశ విస్తృత ప్రయోజనాల రీత్యా వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని నీతి ఆయోగ్ రోడ్మ్యాప్ ఇటీవల సూచించింది. ఈ క్రమంలోనే గుజరాత్లోని సానంద్లో జపాన్, థాయ్లాండ్ సంస్థల సహకారంతో సిద్ధమైన కర్మాగారం.ఇది గడిచిన నాలుగు నెలల వ్యవధిలో పట్టాలకెక్కిన మూడో సెమీకండక్టర్ పరిశ్రమ కావడం విశేషం. ఏడాదికి 20కోట్ల చిప్లతో మొదలుపెట్టి, రాబోయే రోజుల్లో కొత్త ప్లాంటు తయారీ సామర్థ్యాన్ని 500 కోట్లకు తీసుకెళ్లాలన్నది లక్ష్యం. అన్నీ అను కున్నట్లుగా జరిగితే ఇక్కడి నుంచి విదేశాలకూఎగుమతులు సుసాధ్యమై 'మేకిన్ ఇండియా' ప్రస్థానం మరో మెట్టుకు చేరుతుంది! దేశీయంగా సెమీకండక్టర్ల వినియోగం ప్రస్తుతంతో పోలిస్తే, 2030 నాటికి రెట్టింపవుతుందని అంచనా.పీఎల్ఐ వంటి పథకాల కారణంగా మొబైళ్లతయా రీలో ఇండియా ప్రపంచంలోనే రెండోస్థానానికి చేరింది. ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి సైతం కొన్నేళ్లుగా జోరందు కుంది. దాంతో సెమీకండక్టర్ల



అవసరం అధికమైంది. వాటి కోసం చైనా, తైవాన్, హాంకాంగ్, దక్షిణ కొరియా, జపాన్ వంటి దేశాలపై ఆధారపడాల్సివస్తోంది. గడిచిన తొమ్మిదేళ్ల లో సెమీకండక్టర్ ఉత్పత్తులకు భారతావని 15వేల కోట్ల డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని ధారపోసింది. ఈ పరాధీ నతలోంచి బయటపడేందుకు ఇప్పటిదాకా రూ.1.64 లక్షల కోట్ల విలువైన 12 సెమీకండక్టర్ తయారీ ప్రాజె క్టులకు ఇండియా ఆమోదం తెలిపింది. డిజైన్ అనుసంధానిత ప్రోత్సాహక పథకం కింద 24 చిప్ రూపకల్పన ప్రాజెక్టులకూ ఊతమిస్తోంది. జపాన్, నెదర్లాండ్స్ వంటి దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలతో ముడిసరకులు, యంత్రాల సరఫరాలకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటోంది. అందులో భాగంగానే అమెరికా నేతృత్వంలోని భిప్యాక్స్ సిలికాఖిలోనూ భాగమైంది. ఇలా ఈ రంగంలో ఆత్మనిర్భరత కోసం ప్రణాళికాబద్ధంగా కృషి జరుగుతున్నప్పటికీ, ఇండియా అధిగమించాల్సిన సవాళ్లు కొన్ని ఉన్నాయి! మైక్రో చిప్ల తయారీకి నిరంతరం విద్యుత్, నీటి లభ్యత తప్పనిసరి. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దేశీయంగా మౌలిక వసతులు పాదుకొనాల్సి ఉంది. ప్రపంచవ్యాప్త చిప్ డిజైనర్లలో 20శాతం భారతీయులే అయినప్పటికీ వాటి తయారీలో పనిచేయగలిగిన సాంకేతిక నిపుణుల లేమి వేధిస్తోంది.సెమీకండక్టర్లకు అత్యవసరమైన ముడిసరకుల కోసమూ విదేశాల వైపు చూడాల్సి వస్తోంది. ఈ కీలక రంగాన్ని ఏలుతున్న దేశాలతో పోలిస్తే మన దగ్గర పరిశ్రమలకు ప్రోత్సాహకాలు తక్కువగా ఉంటున్నాయి. కండక్టర్ల సరఫరా గొలుసులో ప్రపంచానికి విశ్వసనీయ గమ్యస్థానంగా ఎదగాలన్న భారత్ కల నెరవేరాలంటే వీలైనంత వేగంగా సంబంధిత ఆవరణ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవాలి. 2032 నాటికి విశ్వవ్యాప్తంగా 10 లక్షల మంది సెమీకండక్టర్ నిపుణులకు కొరత ఏర్పడుతుందన్న విశ్లేషణలను గమనంలో ఉంచుకుంటూ ఆ మానవ వన

# జీవ వైవిధ్య పరిరక్షణతోనే మానవాళి మనుగడ

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ వ్యాప్తంగా జులై 29న అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహిస్తారు. పులుల ఆవాసాల రక్షణ, విస్తరణకు ప్రోత్సహించడానికి, పులుల పరిరక్షణపై అవగాహన ద్వారా పొందే మద్దతుకోసం 2010 నుండి ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు.2010లో రష్యాలోని సెయింట్ పీటర్స్బర్గ్ నగరంలో జరిగిన పులుల సంరక్షణ సమావేశంలో ఈ అంతర్జాతీయ పులుల దినోత్సవం ప్రకటించబడింది. పులుల సహజ ఆవాసాలను పరిరక్షించే విధంగా వ్యవస్థను ప్రోత్సహించడం, పులి సంరక్షణగురించి ప్రజలలో అవగాహన పెంచి వారినుండి సహాయాన్ని అందు కోవడం ఈ దినోత్సవ ముఖ్యోద్దేశ్యం. ఈ దినాన్ని పురస్కరించుకొని పులుల సంరక్షణ, వాటి సంతతి వృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాల గురించి ప్రణాళికలు ప్రభుత్వాలు సిద్ధం చేసుకుంటాయి. పులులు ఎక్కువ కాలం తమ తల్లిదండ్రులపై ఆధారపడవు. తమ కాళ్లపై తాము నిలబడటానికి ఇష్టపడతాయి. రెండేళ్లు కాగానే విడిగా వెళ్లిపోతాయి. మగ పులులకు మూడేళ్ల తర్వాత సెక్సువల్ మెచ్యూరిటీ వస్తుంది. ఆడ పులులకు నాలుగేళ్ల తర్వాత అది వస్తుంది. పులులు 20 ఏళ్ల దాకా బతుకుతాయి. పులి పిల్లలు పుట్టినప్పుడు వాటికి కళ్లుకనపడవు. తమ తల్లినుంచి వచ్చే వాసనను బట్టి తల్లిని అనుసరిస్తాయి. పులి పిల్లల్లో సగం ఆకలితో చనిపోతాయి. చలికి వాతావరణ పరిస్థితులకు తట్టుకోలేక చనిపోతాయి. ప్రతీ పులికీ చారలు వేర్వేరుగా ఉంటాయి. మనుషుల్లో ఏ ఇద్దరికీ ఒకేలాంటి వేలిముద్రలు ఉండనట్లే ఏ రెండు పులులకూ ఒకేరకమైనచారలు ఉండవు. పులులు బాగా ఈదగలవు. ఆహారం కోసం చాలా దూరం ఈదుతూ వెళ్లగలవు. సింహాలు గుంపులుగా జీవిస్తాయి. పులులు విడివిడిగా జీవిస్తాయి. ప్రతీ పులీ తన కంటూ ప్రత్యేక ప్రాంతాన్ని ఎంచుకుంటుంది. బాగా పెరిగిన పులి 140 కేజీల నుంచి 300 కేజీల దాకా ఉంటుంది. పులులు గంటకు 65 కిలోమీటర్ల వేగంతో పరుగెడతాయి. పులుల పాదాల కింద మెత్తగా ఉండి, నడిచేటప్పుడు శబ్దం రాదు. వేటాడేటప్పుడు నిశ్శబ్దంగా వచ్చి పరుగెడతాయి. పులిని, 1986 నుండి ఐయుసిఎన్ రెడ్ జాబితాలో అంతరించిపోతున్న జాబితాలో చేర్చారు. గత 100 సంవత్సరాలలో, 97 శాతం అడవి పులులను ప్రపంచం కోల్పోయింది. 20వ శతాబ్దపు ప్రారంభంలో పులి లెక్కింపులో లక్ష ఉన్నట్లు తెలగా, 2013లో 3274కు తరువాత 2014లో 3200 తగ్గిపోయాయి. మానవులు నగరాల విస్తరణ, వ్యవసాయం తదితర కారణాలవల్ల పులుల93శాతం మేర సహజ ఆవాసం కోల్పోయాయి. అంతేకాకుండా, మానవ వన్యప్రాణి సంఘర్షణ, వాతావరణ మార్పుకూడా పులులజనాభా క్షీణతకు, మనుగడ నష్టానికి కారణాలు. ప్రపంచ దేశాల్లో, అత్యధిక సంఖ్యలో 2226 పులులతో



భారత దేశం ఉంది. భారత దేశం తర్వాత 500పులులతో మలేషియా అనుసరి స్తున్నది. 2004 లో 440 పులులతో మూడో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్, టైగర్ సెన్సస్ 2015లో 106కు పులుల జనాభా క్షీణతను చవిచూసింది. పులులు అంతరించిపోకుండా రక్షించడానికి 2010లో రష్యాలోని సెయింట్పీటర్స్ బర్గ్ టైగర్ సమ్మిట్వద్ద పులుల దినోత్సవం నిర్వహించారు. జాతీయ పులుల సంరక్షణ ప్రాధికార సంస్థ (నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఎన్టీసీఏ) దేశవ్యాప్తంగా పులులను లెక్కిస్తుంది. రాష్ట్రాల్లోని అన్ని అడ వుల్లో నాలుగేళ్లకోసారి ఈ గణన జరుగుతుంది.వన్యప్రాణుల గణాంక సేకరణ దేశంలోని అన్ని అటవీ ప్రాంతాల్లో జరుగు తుంది. అటవీ సిబ్బంది రోజూ సుమారు నాలుగు కిలోమీ టర్లు నడుచుకుంటూ వెళ్లి, పులులతో పాటు ఇతర వన్యప్రా ణుల ఆధారాలను అన్వేషిస్తారు. 2014 నుండి ఎన్టీసీఏ వన్యప్రాణుల లెక్కింపులో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన కెమెరాలను వాడుతోంది. వీటిని వన్యప్రాణులు తిరిగే ప్రదేశాల్లో ఎదురెదురుగా చెట్లకు అమరుస్తారు. ఒకటి నుంచి రెండు అడుగుల ఎత్తులో ఉంచే ఈ కెమెరాలు 24 గంటలూ వాటంతటవే పనిచేస్తాయి. చిత్రాల్లోని జంతువుల ఎత్తు, చారలు, నడకను పరిగణనలోకి తీసుకొని వాటి సంఖ్యను లెక్కగడతారు. భారత దేశంలో దాదాపు 3వేల పులులున్నాయని లెక్కలు చెపుతున్నాయి. పులుల ఆవాసానికి ప్రపంచంలోనే భారతదేశం అనువైన ప్రాంతం. దేశంలో క్రమంగా పులుల జనాభా పెరిగిపోతోంది.2006లో1,411, 2010లో 1,726, 2014లో 2,226 పులులుండగా, 2018లో ఆసంఖ్య 2,967కు చేరుకుంది. ప్రతి నాలుగేండ్లకు ఒకసారి పులుల గణనచేపడుతారు.2014లోఅవిభాజ్య ఆంధ్రప్రదేశ్లో పులుల సంఖ్య 68కాగా, 2018 నాటికి ఏపీ, తెలంగాణల్లో కలిపి వీటి సంఖ్య74కు చేరింది.ఏపీలో 48, తెలంగాణలో 26పులులున్నట్లు రికార్డులు చెపుతున్నాయి. దేశంలోని అతిపెద్ద అభయారణ్యాల్లో ఒకటైన నాగార్జునసాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యంలో 2006లో 95 పులులుండేవి. 2010లో వీటి సంఖ్య 72కు, 2014 నాటికి 68కి తగ్గింది. అయితే, 2018 లెక్కల్లో ఈ సంఖ్య పెరిగింది. రాచఠీవికి పెట్టింది పేరైన పులి భారతదేశ జాతీయ జంతువు. 1972లోనే పులిని జాతీయ జంతువుగా ప్రకటించిన భారత్ మరుసటి ఏడాది టైగర్ ప్రాజెక్ట్ను ప్రారంభించింది. పులుల్ని వేటాడే వారికి కఠిన శిక్షలుపడేలా చట్టాలు తెచ్చింది. వాటి సంరక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తోంది. దేశంలో 48 పులి అభయారణ్యాలను ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఆలిండియా టైగర్ ఎస్టిమేషన్ రిపోర్ట్ ప్రకారం తెలంగాణ అడవుల్లో 26 పులులు ఉన్నట్లు తేలింది. గతంలో 20 పులులు ఉన్నట్లు ఓ అంచనా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం, అటవీశాఖ చేపట్టిన అటవీ రక్షణ చర్యలవల్లే పులుల సంఖ్య పెరిగేందుకు దోహద పడ్డాయి. తెలంగాణలో పులులసంఖ్య పెంచే కార్యక్రమాలను రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నారు. రాష్ట్రంలో కవ్వాల్, అమ్రాబాద్ రెండు అభయారణ్యాలున్నాయి. రాబోవు రోజుల్లో పులుల అభివృద్ధికి మరిన్ని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడమే కాకుండా వాటి రక్షణ కోసం వ్యవస్థను కట్టుదిట్టం చేయడానికి, చర్య

29MN 5 PG-GNT_29MN 5 PG-GNT.qxd 28-07-2026 PM 11:56 Page 1



గుంటూరు వార్త

## చిప్స్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

గుంటూరు విద్య జులై 28 (ప్రభాతవార్త): వేజెళ్ల హనుమయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సెలబ్రేషన్స్ జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ వ్యాసరచన పోటీలలో వివిధ ఫార్మసీ కళాశాల నుంచి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు పర్యావరణాన్ని పరిరక్షించడంలో యువత పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ముగింపు వేడుకలకు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్ విద్యాధర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు జీవాన్నిచ్చే భూమి, నీరు, గాలి మరియు అడవులను కాపాడుకోవడం మన అందరి బాధ్యత. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం, మొక్కలను నాటుదాం. మన రేపటి భవిష్యత్తు కోసం ప్రకృతిని రక్షిద్దాం అని పిలుపునిచ్చారు. ఈ పోటీలలో చిప్స్ కళాశాల విద్యార్థిని డి సౌజన్య మొదటి బహుమతి, సిమ్స్ కళాశాల రెండవ బహుమతి, ఏ ఎ ఏ ఎం కళాశాల మూడవ స్థానంలో నిలిచారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లు అందజేయడం జరిగింది. అంతే కాకుండా ఈ రోజు ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా బోడవరం గ్రామంలో హెపటైటిస్ మీద గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంచడంతోపాటు ర్యాలీ నిర్వహించడం జరిగింది.



## కంప్యూటేషనల్ క్లినికల్ న్యూరోసైన్స్ పై సదస్సు

గుంటూరు విద్య, జులై 28, ప్రభాతవార్త: విద్యార్థుల మానసిక వికాసం, అభ్యాస సామర్థ్యాల మెరుగుదలే ముఖ్య ఉద్దేశంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సూచనలతో వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ నందు సిఎస్ఎమ్ మరియు సిఎస్ఈ విభాగాల ఆధ్వర్యంలో "కంప్యూటేషనల్ క్లినికల్ న్యూరోసైన్స్" అనే అంశంపై సదస్సు నిర్వహించినట్లు వివిఐటియూ ప్రోఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐఐటి మద్రాస్ బయోటెక్నాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ వి. శ్రీనివాస చక్రవర్తి ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఈ సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, బయోటెక్నాలజీ మరియు డిగ్రీ కళాశాలల నుండి విద్యార్థులు, అధ్యాపకులు మరియు పరిశోధకులు హాజరయ్యారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ "ప్రతి విద్యార్థి మెదడు విభిన్నంగా స్పందిస్తుందని, కొందరు దృశ్యాల ద్వారా, మరికొందరు వినడం ద్వారా త్వరగా గ్రహిస్తారని తెలిపారు. న్యూరోసైన్స్ సహాయంతో విద్యార్థి సామర్థ్యానికి తగినట్లుగా బోధించవచ్చని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మరియు డేటా సైన్స్ సహకారంతో వైద్యరంగంలో సరికొత్త పరిష్కారాలు చూపవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా ఆల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి సంక్లిష్టమైన వ్యాధులను ముందస్తుగా గుర్తించే పద్ధతులను విద్యార్థులకు విపులంగా వివరించారు. అనంతరం, వివిఐటియూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తిని ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో వివిఐటియూ రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి, సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ వి. రామచంద్రన్, సిఎస్ఎమ్ విభాగాధిపతి డాక్టర్ జి. సంజయ్ గాంధీ, ఈసీఈ విభాగాధిపతి ఇన్నావుల్ హక్ అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



## ఇరువురు యువకులు అరెస్ట్

గుంటూరు క్రైమ్, జులై28, ప్రభాతవార్త: గుంటూరు జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతోపాత నేరస్తులపై నిఘా పెట్టి, ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ అటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకుఈస్ట్ డి.ఎస్పి టి. సీతారాం పర్యవేక్షణ లో పాత గుంటూరు పోలీస్ స్టేషన్ సీఐ వెంకట ప్రసాద్ తన పరిధిలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులుగా ఉన్న గంజాయి అమ్మే వారి పై నిఘా పెట్టి, వారి కదలికలను ఎప్పటికప్పుడు పసిగడుతూ ఎవరైనా గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తుంటే, వారిపై ఆకస్మిక దాడులు నిర్వహించి అరెస్ట్ చేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం పాత గుంటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ ఆపోజిట్ కరెంట్ ఆఫీసు ప్రక్కన పొలంలో గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని రాబడిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించి ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 1100 గ్రాముల గంజాయిని, తొమ్మిది షీట్స్ టాబ్లెట్స్, (1 షీట్ కు 10 టాబ్లెట్స్ ) ల్బి: 9000/ రూపాయలు స్వాధీనం చేసుకున్నారు.



నిందితులు పాత గుంటూరు ఆనంద్ పేటకు చెందిన షేక్ మస్తాన్, పాత గుంటూరు అల్లినగర్ 2వ లైన్ కు చెందిన షేక్ మస్తాన్ మున్నా ఇరువురు మద్యం త్రాగుటకు, పొగ త్రాగుటకు, చెడు వ్యసనాలకు అలవాటు పడి ఆర్థిక ఇబ్బందుల వలన ఎలాగైనా డబ్బులు సంపాదించాలని, మాచిరాజు వారికి వీధిలో ఉంటున్న బిలాల్ అనే అతను సంప్రదించగా, గంజాయి మత్తు బిళ్ళలు గోవా నుంచి తీసుకొస్తే ఎక్కువ లాభం వస్తుందని బిలాల్ తమతో చెప్పగా అందుకు మేము సరే అన్నాము. అంతట బిలాల్ గోవా వెళ్లి రెండు కేజీల గంజాయి, మత్తు టాబ్లెట్స్ రెండు బాక్సులు (అనగా 1 బాక్స్ కు 10 షీట్స్, 1 షీట్ కు 10 టాబ్లెట్స్ ) తీసుకొని వచ్చాడు. అందులో బిలాల్ 700 గ్రాములు గంజాయి, మత్తు టాబ్లెట్స్5 షీట్స్ తీసుకొన్నాడు. మస్తాన్ 700 గ్రాములు గంజాయి, మత్తు టాబ్లెట్స్8 షీట్స్ తీసుకొన్నాడు. మున్నా 600 గ్రాములు గంజాయి, 7 షీట్స్ టాబ్లెట్స్ తీసుకున్నాడు. గంజాయి 50 గ్రాములు ప్యాకెట్లు తయారు చేసి ఒక్కో ప్యాకెట్ నాలుగు వందలు చొప్పున అమ్ముకుంటూ సుమారు 100 గ్రాములు వరకు గంజాయిని, టాబ్లెట్స్ 1 ఒకటికి మూడు వందల రూపాయలు చొప్పున ఇరువురము అమ్ముతూ బయట పరిస్తితులు బాగాలేవు ఒక్కసారి ఇరువురము మాట్లాడుకొనుటకు ప్రగతి నగర్ కు వచ్చాము. అంతలో మీరు వచ్చి పట్టుకొన్నారు. అంతట మస్తాన్ నేను గంజాయి, టాబ్లెట్స్ అమ్మగా వచ్చిన డబ్బుల్లో నా ఖర్చులకు పోను 3000 రూపాయలు మిగిలినవి అని చెప్పాడు, నా వద్ద 600 గ్రాములు గంజాయి, 6 షీట్స్ టాబ్లెట్స్ ఉన్నవి అని చెప్పాడు. మున్నా తనవద్ద 500 గ్రాముల గంజాయి 3 షీట్స్ టాబ్లెట్స్, గంజాయి, టాబ్లెట్స్ అమ్మగా వచ్చిన డబ్బుల్లో నా ఖర్చులకు పోను 6000 రూపాయలు మిగిలినవి అని చెప్పాడు. మంగళవారం 12.15 గంటలకు ప్రగతినగర్ ఆపోజిట్ కరెంట్ ఆఫీసు పొలాల్లో మేము ఉండగా మా వద్ద మిగిలిన గంజాయి, టాబ్లెట్స్, డబ్బులు పోలీస్ వారు స్వాదీన పరచుకొని, నిందితులని అరెస్ట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఈస్ట్ డిఎస్పీ టి. సీతారాం మాట్లాడుతూ ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలుతో గుంటూరు జిల్లా ఈస్ట్ సబ్ డివిజన్ లో గంజాయి మహమ్మారిని కూకటివేళ్ళతో పెకలించి, నిర్మూలించడానికి పటిష్ట ప్రణాళికలు రూపొందించామని, పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక పోలీస్ బృందాలను నియమించి, ఈగల్ టీం వారితో సమన్వయం చేసుకుంటూ గంజాయి విక్రయం, వినియోగం, సరఫరా చేసే వారిని కనిపెట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి కేసుల్లోని పాత నేరస్తులపై నిఘా పెట్టి, వారి కదలికలు, వారు చేసే పనులు, వారి జీవన విధానం, వ్యవహార శైలి వంటివి పరిశీలిస్తూ ఎక్కడైనా ఏవైనా అనుమానాస్పద విషయాలు వారిలో కనిపిస్తే వెంటనే వారిని అరెస్ట్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాము. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన గుంటూరు ఈస్ట్ డి.ఎస్పి టి. సీతారాంని, పాత గుంటూరు సిఐ వెంకట ప్రసాద్ ని, సిబ్బంది రామరావు, రాధాకృష్ణ, నూరుద్దీన్, రామరావు ను గుంటూరు జిల్లా ఎస్పి వకుల్ జిందాల్ అభినందించారు.

## హెపటైటిస్ నిర్మూలనకు ప్రజల్లో చైతన్యమే లక్ష్యం..

### గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్

### ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా జీజీహెచ్‌లో అవగాహన ర్యాలీ

గుంటూరు మెడికల్ , జూలై 28:(ప్రభాతవార్త): ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలో మంగళవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలేయాన్ని తీవ్రంగా దెబ్బతీసే హెపటైటిస్ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడం, వ్యాధి నివారణ, ముందస్తు పరీక్షలు, టీకాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ సమగ్ర వైద్యశాల ప్రధాన కార్యాలయ గేటు ఎదురుగా ప్రారంభమైన ర్యాలీ ప్రభుత్వ వైద్య కళాశాల వరకు కొనసాగింది. ర్యాలీలో వైద్యులు, అధ్యాపకులు,




అవగాహన ర్యాలీ పాల్గొన్న ఎమ్మెల్యే నజీర్, డాక్టర్ నాగూర్ బాషా, డాక్టర్ కవిత, దుర్గా ప్రసాద్ తదితరులు..

వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, పారామెడికల్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని హెపటైటిస్ నివారణ, ముందస్తు నిర్ధారణ, టీకాల ప్రాముఖ్యత, పరిశుభ్రత వంటి అంశాలపై సందేశాలతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ మాట్లాడుతూ, హెపటైటిస్ బి, సి వంటి వైరల్ వ్యాధులను ముందస్తుగా గుర్తించి చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు అపోహలకు లోనుకాకుండా అవసరమైన పరీక్షలు చేయించుకోవడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యులు మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాధి కాలేయంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, నిర్లక్ష్యం చేస్తే సిరోసిస్, కాలేయ క్యాన్సర్ వంటి ప్రాణాంతక సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. హెపటైటిస్ బి, సి పరీక్షలు చేయించుకోవడం, అర్హులైన వారు టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధిని సమర్థవంతంగా నివారించవచ్చని వివరించారు. అలాగే వ్యాధి పట్ల సమాజంలో ఉన్న అపోహలు, వివక్షను తొలగించి బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. హెపటైటిస్ నివారణలో పరిశుభ్రమైన తాగునీరు, సురక్షితమైన ఆహారం తీసుకోవడం, పుట్టిన వెంటనే శిశువులకు హెపటైటిస్‌బి టీకా వేయించడం, సురక్షితమైన వైద్య విధానాలను పాటించడం, అవసరమైన సందర్భాల్లో రక్త పరీక్షలు చేయించుకోవడం వంటి చర్యలు అత్యంత కీలకమని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి, ప్రభుత్వ సమగ్ర వైద్యశాల పర్యవేక్షకుడు డాక్టర్ దుర్గాప్రసాద్, గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ కవిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగూర్ భాషా, వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పురావస్తు శాఖ కమీషనర్‌కు పీహెచ్‌డి ప్రదానం

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, జూలై28, ప్రభాతవార్త: ఏఎన్‌యులోని చరిత్ర, పురావస్తు శాఖ విభాగం ఆధ్వర్యంలో ఏపి పురావస్తు శాఖ, మ్యూజియంల శాఖ ఇన్‌చార్జ్ కమీషనర్ పీట సురేష్‌కు పీహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య పి.సుధాకర్ తెలిపారు. సురేష్ ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా-గోధావరి నదీలోయలో తవ్వకాలు జరిగిన బృహత్ శిలాయుగ స్థలాలపై పరిశోధన చేశారు. ఈయనకు పరిశోధనలో పర్యవేక్షకునిగా ఆచార్య ఎస్.మురళీమోహన్ వ్యవహరించారు. పురావస్తు శాఖలో సేవలందించడంతో పాటు వివిధ సర్వేలు చేశారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన వ్యాసాలు రాశారు.



# నిజాంపట్నం హార్బర్ అభివృద్ధితో ముడిపడిన మత్స్యకారుల సంక్షేమం





రేపల్లె-ప్రభాతవార్త

**-రూ.451 కోట్లు కేటాయించినా పూర్తికాని పనులు**
**-ఏటా రూ.125 కోట్ల మత్స్య సంపద ఎగుమతి**

నిజాంపట్నం హార్బర్ విస్తరణతోనే అభివృద్ధి ముడిపడి వుంది. హార్బర్ విస్తరణ కోసం రూ.451 కోట్లు నిధులు కేటాయించారు. 2022 సంవత్సరంలో విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి 2026 సంవత్సరం మార్చి మాసాంతానికి విస్తరణ పనులు పూర్తికావాల్సి ఉంది. మొదటి దశ నిర్మాణ పనులకు సంబంధించి రూ.228.98 కోట్లు ఖర్చు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నివేదించింది. జెట్టీ నిర్మాణం పూర్తికాలేదు. హార్బర్ విస్తరణకు అటవీ భూమి అనుమతులు అవసరం. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన జెట్టీ ప్రదేశంలో కేవలం 80 పడవలు నిలుపుకునేందుకు మాత్రమే అవకాశం ఉంది. ఇక్కడి నుండే సముద్రంలో వేటకు పడవల్లో మత్స్యకారులు బయల్దేరతారు. రెండు ఎకరాల్లో జెట్టీ నిర్మాణం అసంపూర్తిగానే నిలిచింది. జెట్టీ నిర్మాణం పూర్తి కావాలంటే ఇంకా 70 మీటర్ల పొడవున స్థలం అవసరమని అధికారులు నిర్ధారించారు. అప్పుడే 250 పెద్ద పడవలు, 1000 చిన్నపడవలు నిలుపుకునే అవకాశం ఉంటుంది. 90 ఎకరాల అటవీ శాఖ భూమి సమకూరితే సముద్రవేట పడవల తయారీ, మరమ్మతులకు డాక్‌యార్డు, వలల మరమ్మతులకు షెడ్డు, మత్స్యకారుల విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు, డ్రై ప్లాట్‌ఫామ్స్ నిర్మాణాలు పూర్తవుతాయి. నిజాంపట్నం హార్బర్‌కు సమీపంలో సేకరించిన 5 ఎకరాల భూమిలో డాక్‌యార్డు, భవనాల నిర్మాణం ప్రారంభించాలని మత్స్యశాఖ అధికారులు డిమాండ్ చేస్తున్నారు. అటవీశాఖ భూములకు అనమతివస్తే ఈ భూములకు బదులుగా పల్నాడు జిల్లాలోని దుర్గి ప్రాంతంలో 200 ఎకరాల భూములను అటవీశాఖకు కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం స్పందిస్తే నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి సాధ్యపడేలా ఉంది. తుంగభద్ర కాల్వ నుంచి బంగాళాఖాతంలోకి చేపల వేట పడవలు ప్రవేశించే మొగ వద్ద పూడిక పేరుకుపోయిన కారణంగా పెద్ద పడవలు బురదలో ఇరుక్కుపోతున్నాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొగ నుంచి సముద్రంలోకి చేపల వేటకు ఉపయోగించే పెద్ద పడవలు రాకపోకలు సాగించేందుకు జెట్టీ-తీర ప్రాంతం మధ్య 3 మీటర్ల లోతున డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక, బురద మేటలు తొలగించాలని మత్స్యకారులు కోరుతున్నారు. సాగర్‌మాల ప్రాజెక్ట్ కింద హార్బర్ విస్తరణ పనులు చేపట్టగా నిజాంపట్నం వద్ద సముద్రంలోకి 1.5 కి.మీ పొడవులో రిటైనింగ్‌వాల్ నిర్మాణం జరిగింది. సముద్రంలో చేపల వేట ప్రధానవృత్తి కాగా నిజాంపట్నానికి ఆర్థిక వ్యవస్థలో పర్యాటక రంగం ముడిపడి ఉందని అధికారులు గుర్తించారు. నిజాంపట్నంలోని లైట్ హౌస్, బ్యాక్ వాటర్స్, మడ అడవులు ఆకర్షణీయంగా పర్యాటకులకు ఆహ్లాదాన్ని అందిస్తాయి. అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు రూ.13 కోట్ల బిల్లులు బకాయిలు చెల్లింపుకు నోచుకోని పరిస్థితి నెలకొంది. జెట్టీ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడానికి ఇదొక కారణంగా మత్స్యకారులు భావిస్తున్నారు.

**నిజాంపట్నం చరిత్ర ఘనం..** హైద్రాబాద్ నిజాం పేరు మీద నిజాంపట్నం పేరు వచ్చింది. పెద్దపల్లి అని కూడా పిలుస్తారు. డచ్ వలసదారులు పెటపోలీ అని, బ్రిటీష్‌వారు పెట్టిపోలీ అని పిలిచేవారు. క్రీ.శ 12-13 శతాబ్ధంలో వెలనాటి చోళులు పరిపాలించారు. అనంతరం గోల్కొండ రాజ్యం పరిధిలోకి వెళ్ళింది. 1621లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నిజాంపట్నంలో ఒక ఫ్యాక్టరీని స్థాపించింది. పోర్ట్ సెయింట్ జార్జ్ కింద ఉన్న ఫ్యాక్టరీలను ఉపసంహరించుకున్నప్పుడు 1687లో నిజాంపట్నం ఫ్యాక్టరీని మూసివేశారు. వాణిజ్య కార్యకలాపాల కోసం 1606 నుండి 1668 వరకు డచ్ వారు నిజాంపట్నంను ఆక్రమించుకున్నారు.

**సముద్ర వేటలో దొరికే చేపలు ఇవే..** నిజాంపట్నం సముద్రం వేటలో లభించే మత్స్య సంపద వేలాది కుటుంబాలకు ఉపాధి చూపుతోంది. ఇక్కడి నుండి ఏటా రూ.125 కోట్ల విలువైన మత్స్య సంపద ఎగుమతులు ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతవుతున్నాయి. వాణిజ్య పరంగా డిమాండ్ ఉన్న రకరకాల రొయ్యలు, పంజరం, పండుగప్ప, సొరచేప, కోణెలు, నెత్తళ్ళు, పీతలు, స్క్విడ్ తదితర మత్స్య సంపద జాల్లర్ల వలలో చిక్కుకుని నిజాంపట్నం హార్బర్ ఒడ్డుకు చేరుతున్నాయి. బంగాళాఖాతం సముద్రం పక్కనే నిజాంపట్నం ఉంది. ఇక్కడ నివసించే మత్స్యకారులు, ప్రజలకు సముద్రం అంటే భయం లేదు. తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు సైతం ధైర్యంగానే జీవిస్తారు. తుఫాన్ తీవ్రతను బట్టి అధికారుల సూచన ప్రకారం సముద్రంలో వేటను మత్స్యకారులు నిలిపివేస్తారు. నిజాంపట్నం హార్బర్ వద్ద ప్రమాద సూచికలు మారుతూ ఉంటాయి. నిజాంపట్నం ప్రాంతంలో తుఫాన్ తీరం దాటుతుందనే సమాచారం వెలువడుతూ ఉంటుంది. ఇక్కడి ప్రజల ధైర్యానికి ప్రధాన కారణమేమంటే నిజాంపట్నం సముద్ర తీరం వంపుగా ఉన్నందున ఎట్టి పరిస్థితులలో తుఫాను తీరం దాటదనే నమ్మకం. చరిత్ర చూసుకుంటే ఇప్పటి వరకూ ఈ ప్రాంతంలో తుఫాన్ తీరం దాటలేదు.

**అభివృద్ధి పనులపై ప్రభుత్వం దృష్టి**

నిజాంపట్నం హార్బర్ విస్తరణ పనులకు సంబంధించి బకాయిలను చెల్లించి మిగిలిన అభివృద్ధి, మౌలిక వసతుల పనులను పిపిపి విధానంలో పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ కార్యాచరణకు నోచుకోవడంలేదు. నిజాంపట్నం హార్బర్‌ను రాజధాని రహదారితో 48 కి.మీ పొడవైన, 4 లేన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. భవిష్యత్‌లో విశాఖపట్నం-చెన్నై కారిడార్‌తో నిజాంపట్నం ప్రాంతాన్ని అనుసంధానించేలా ప్రణాళికను రూపొందించారు.

## మాజీ ఎమ్మెల్యే తనయుడిపై కిడ్నాప్ కేసు

**-పొగాకు వ్యాపారి, డ్రైవర్‌ను అపహరించినట్లు ఆరోపణలు**

**ఐదుగురు అనుచరులు అరెస్ట్.. ప్రధాన నిందితుడి కోసం ప్రత్యేక బృందాల గాలింపు**

**గుంటూరు, జూలై 28, ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కుమారుడు బషీర్‌పై నూజివీడు పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఏలూరు జిల్లాకు చెందిన ఓ పొగాకు వ్యాపారి, అతని డ్రైవర్‌ను అపహరించిన ఘటనలో బషీర్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, కోయిలగూడెం నుంచి గుంటూరు వైపు పొగాకు లోడుతో వెళ్తున్న వాహనాన్ని కొందరు వ్యక్తులు అడ్డుకున్నారని, అనంతరం వ్యాపారి, డ్రైవర్‌ను బలవంతంగా తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిని గుంటూరులోని ఓ గెస్ట్ హౌస్‌లో నిర్బంధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. సమాచారం అందుకున్న నూజివీడు పోలీసులు వేగంగా స్పందించి, నిర్బంధంలో ఉన్న ఇద్దరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి బషీర్ అనుచరులుగా గుర్తించిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొంటున్న బషీర్‌ను అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఘటనకు ముందు, తర్వాత జరిగిన ఫోన్ సంభాషణల కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు విస్తరించినట్లు సమాచారం. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే ముస్తఫాతో జరిగినట్లు భావిస్తున్న కాల్ వివరాలను (కాల్ డేటా రికార్డులు) కూడా సేకరించి పరిశీలిస్తున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. అపహరణకు గల కారణాలు, వ్యాపార లావాదేవీలు లేదా ఇతర వివాదాలేమైనా ఉన్నాయా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది

## ఉద్యమం మరింత ఉధృతం..!

**- కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ర్యాలీ**

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, జూలై28, ప్రభాతవార్త: కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించని పక్షంలో తాము చేస్తున్న శాంతియుత ర్యాలీ రాష్ట్రవ్యాప్తంగా ఉదృతం చేస్తామని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు పేర్కొంటున్నారు. వారి నిరసన కార్యక్రమం మంగళవారం 11వ రోజుకు వర్సిటీ మెయిన్‌గేట్ నుంచి గాంధీ విగ్రహం వద్దకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. విశ్వవిద్యాలయాల్లో బోదన



చేస్తున్న రాష్ట్రంలోని ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు చేస్తున్న శాంతియుత ఆందోళన నిర్వహిస్తున్నారు. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలి.. యూజిసి పే స్కేల్స్ అమలు చేయాలి..రాష్ట్ర ప్రభుత్వం 2023 జూన్‌లో ఇచ్చిన జీఓ ఎంఎస్.నెం.20ను రద్దుచేయాలని డాక్టర్ వి.బాలాజీ, డాక్టర్ ఎం.రమ్య ప్రశాంతి, డాక్టర్ ఎం.గాయత్రి రమ్యలు దీక్షల్లో పాల్గొన్నారు. వీరికి ఇతర అధ్యాపకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవలు క్రమబద్ధీకరణ, సమానపనికి సమానవేతనం, యూజిసి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేస్తున్నారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు వర్సిటీలో నిరంతరం సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించాలని విన్నవించారు. వర్సిటీ న్యాక్ అక్రిడిటేషన్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్, వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్, అకడమిక్ ఆడిట్‌లు, పరిశోధనలు వంటి అనేక విద్యావిషయక సంబంద విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వర్సిటీల్లో ఖాళీల భర్తీ ప్రక్రియను ప్రారంభించే ముందు రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీకి అనుగుణంగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని జీ.ఓ ఎంఎస్ నెం.114ను తక్షణమే అమలు చేయాలన్నారు. తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మాకు తగిన న్యాయం చేయాలని కోరుతున్నారు.

## విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

### 5వ అదనపు సివిల్ జడ్జి

గుంటూరు క్రైమ్, జులై28, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సాయి కళ్యాణ్ చక్రవర్తి ఆదేశాల మేరకు, విద్యార్థుల్లో న్యాయ అవగాహన పెంపొందించే లక్ష్యంతో మంగళవారం గుంటూరు జిల్లా లక్ష్మీపురంలోని ఎన్.ఆర్.ఐ. కళాశాలలో "న్యాయ విజ్ఞాన సదస్సు" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐదవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) లత ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు న్యాయ సంబంధిత అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి లత మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్ వంటి డిజిటల్ వేదికలను బాధ్యతాయుతంగా వినియోగించడంతో పాటు వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ పంచుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద లింకులు, నకిలీ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు తమ కుటుంబాలకు ఎంతో విలువైన వారని, బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ తమ భద్రతను కాపాడుకోవాలని ఆమె సూచించారు. జీవితంలో ధైర్యంగా ముందుకు సాగుతూ సురక్షితమైన వాతావరణంలో ఉంటూ తమను తాము రక్షించుకునే అవగాహనను పెంపొందించుకోవాలని తెలిపారు. నేరాలకు అవకాశమిచ్చే పరిస్థితులను నివారిస్తూ, సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా పోక్సో చట్టం-2012 గురించి వివరిస్తూ, 18 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను లైంగిక వేధింపులు, దుర్వినియోగం నుంచి రక్షించేందుకు ఈ చట్టం అమలులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కౌమారదశలో ఉన్న విద్యార్థులు అనుచిత ప్రవర్తనను గుర్తించడం, చట్టపరమైన సమ్మతి, నిబంధనలను అర్థం చేసుకోవడం, అవసరమైన సందర్భాల్లో ఫిర్యాదు చేసే మార్గాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మధ్య ఉన్న తేడాను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు ఉన్న వారు చట్టబద్ధంగా సమ్మతి ఇవ్వలేరని, మైనర్‌తో ఏ విధమైన లైంగిక కార్యకలాపమైనా శిక్షార్హమైన నేరమని స్పష్టం చేశారు. ఈ న్యాయ విజ్ఞాన సదస్సులో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని న్యాయ అవగాహనకు సంబంధించిన పలు అంశాలపై సమాచారం పొందారు.




## రక్తమోడిన రహదారి...

**ఎదురెదురుగా ఆటో మోటార్ సైకిల్ ఢీ.. వ్యక్తి మృతి**

రెంటచింతల, జూలై 28 ప్రభాతవార్త : మేజర్ పంచాయతీ రెంటచింతల పరిధిలోని 167 ఏడీ జాతీయ రహదారి లోని ఎర్రకాలువ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు గాయ పడిన సంఘటన జరిగింది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలిలా వున్నాయి. కంభంపాడు గ్రామానికి చెందిన షేక్ సైదా (45) సైకిల్ స్పేర్ పార్ట్స్ ను పిడుగురాళ్లలో కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు.. పాలువా యి గ్రామం నుంచి గోలి గ్రామానికి వెళ్తున్న ఆటో మోటార్ సైకిల్ బలంగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనా స్థలంలో షేక్ సైదా ప్రాణాలిడవగా ఆటోలో వున్న పరిమళ మరియబాబు గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిమళ అఖిల్ స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు మరియబాబు గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతునికి భార్య బేగం ఇద్దరు ఆడపిల్లలు... సైదా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద హెచ్చరికలు లేక ఇప్పటికి ముగ్గురు మృతి హైవేపై విపరీత వేగంతో వాహనాలు వెళ్ళడం ప్రమాద హెచ్చరికలు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నారు. నూతన రహదారి వాడుకలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఏప్రిల్ 8, 2025 న మిట్టగుడిపాడు గ్రామానికి చెందిన దూదేకుల షైదా, ఈ ఏడాది మార్చి 23న జెట్టిపాలెం గ్రామానికి చెందిన పల్లెర్ల జ్యోతి, మంగళవారం షేక్ సైదా మృత్యువాత పడ్డారు. ఇప్పటికైనా హైవే అధికారులు స్పందించి బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాలని పలువురు కోరుతున్నారు..



# పల్నాడు జిల్లా వార్త



## మాదల పెట్రోల్ బంక్ వద్ద కారు, ఆటో ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు





సత్తెనపల్లి, జూలై 28, ప్రభాతవార్త: నరసరావుపేట నుంచి సత్తెనపల్లి వస్తున్న మినీ ఆటోని హార్స్ వేగంతో ఎదురుగా వచ్చి ఆటోని ఢీ కొట్టింది ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులకు జోసెఫ్(18) ఏబెలు (22)తీవ్ర గాయాలు అవ్వడంతో అక్కడున్న స్థానికులు సత్తెనపల్లి సంజన హాస్పిటల్ కు తరలించారు ఈ సంఘటనపై ఇరువురు వ్యక్తులు ముప్పాళ్ల పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు కేసు నమోదు చేసుకున్నారు

## 9వ రోజుకు చేరిన దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్ నిరసన

సత్తెనపల్లి, జూలై28, ప్రభాతవార్త: దస్తావేజు లేఖర్ల పెన్డౌన్ కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద తమ నిరసన వ్యక్తం చేశారు అధ్యక్షులు పోతంశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ



ఒక పొలం గాని లేదా స్థలం కానీ కొనాలనుకున్నప్పుడు డాక్యుమెంట్ రైటర్ పాత రిజిస్ట్రేషన్ పేపర్లు సరిగ్గా ఉన్నావా లేదా ఈసీ నెంబర్లు చెక్ చేయటం 1బి అడంగులు సరిచూసుకోవటం ఆ స్థలం దగ్గరికి వెళ్లి కొలతలు సరి చూడటం ఆ స్థలం తాలుకు పాత వివాదాల ఏమన్నా ఉన్నా సరి చేయటం ఇవన్నీ డాక్యుమెంట్ రైటరు కరెక్ట్ గా చేస్తారు కానీ ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న పి పి పి విధానం వల్ల 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు తర్వాత తీవ్రమైన ఇబ్బంది గురికావాల్సి వస్తుందని కావున అమలు చేయబోతున్న ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలని అలాగే 396 జిఒ ని రద్దు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పొందూరు ఆంజనేయులు కార్యదర్శి బాలకృష్ణ కోశాధికారి శివ కేశవ గణపవరపు రంగారావు దమ్మాలపాటి గంగాధర్ వల్లూరి గౌరి పంచాక్షరి సౌజన్య హనుమంతరావు బండారుపల్లి రాఘవేంద్ర చింతపల్లి కోటేశ్వరరావు బత్తుల చింతయ్య మేకల శ్రీను వాసు గంటా నాగేశ్వరరావు బేబీ రాణిడిటిపి ఆపరేటర్లు దస్తావేజులేఖర్ల సహాయకులు తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**-ప్యానల్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు**

సత్తెనపల్లి, జూలై 28, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు మరియు సత్తెనపల్లి మండల న్యాయసేవధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్ ) సత్తెనపల్లి వి. విజయ్ కుమార్ రెడి సూచనల మేరకు సత్తెనపల్లి పట్టణంలోని మార్టిన్ పేటలో ఉన్న జ్యోతి ఫౌండేషన్ లో .. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం .. సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ప్రతి ఒక్కరు మెక్కలు నాటాలి అని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి అని అంతేకాకుండా ప్రకృతి ధర్మాన్ని అందరం కాపాడాలి అని వివిధ అంశాలను ప్యానెల్ న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బి. ఎల్. కోటేశ్వరరావు, మన్నెం వెంకటేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని మరియు జ్యోతి ఫౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి :కన్నా

సత్తెనపల్లి, జూలై 28, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం 20వ వార్డు నందు జరిగిన 2ఏళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన





కూటమి నాయకులు కార్యకర్తలు,నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం కన్నా మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కూటమి ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసి చూపించామన్నారు. .ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. .ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్ళి గర్వంగా వారికి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించగలు గుతున్నామని చెప్పారు. .కూటమి నాయకులు అందరూ ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలని నేతలకు కన్నా సూచించారు. ఈ కార్యక్రమంలోవివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా , నియోజకవర్గ, పట్టణ వార్డు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**కట్టావారి పాలెంలో ...**

సత్తెనపల్లి, జూలై 28, ప్రభాతవార్త: సత్తెనపల్లి రూరల్ మండలం కట్టావారి పాలెంలో మంగళవారం ' 2ఏళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి ఇంటింటి ప్రచార కార్యక్రమం' జరిపారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.కూటమి నాయకులు కార్యకర్తలు,నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు.విద్యార్థులతో కలిసి తల్లికి వందనం పథకం అమలవుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు.అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కూటమి ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేసి చూపించామని సిఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి జరుగుతోందని అన్నారు.

## మండల వ్యవసాయ అధికారులతో సమీక్ష

సత్తెనపల్లి, జూలై 28, ప్రభాతవార్త: సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి మండలం, ముప్పాళ్ల మండలం మరియు పెదకూరపాడు మండలాల వ్యవసాయ అధికారులతో పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఎం జగ్గారావు సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ప్రతి, మిరప మరియు వరి పంటలు సాగు చేస్తున్నటువంటి రైతుల ద్వారా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన మరియు వాతావరణ



ఆధారిత పంటల బీమా పథకంలో ప్రత్తి, మిరప,కంది మరియు వరి పంటలలో బీమా పొందేందుకు వ్యవసాయ శాఖ నిర్దేశించిన గడువులోగా రైతులు ద్వారా పంటలకు ఇన్సూరెన్స్ చేయించవలెనని తెలియజేశారు. ప్రతి పంట ఎకరాకు రూ.38,000/ బీమాకు రైతులు వాటాగా రూ.1900/ జూలై 31 వ తేదీ లోపు, మిరప పంట ఎకరాకు రూ.90,000/ బీమాకు రైతులు వాటాగా రూ.360/ జూలై 31 వ తేదీ లోగా, కంది పంట ఎకరాకు రూ.20,000/ బీమాకు రైతులు వాటాగా రూ.40/ జూలై 30 వ తేదీ లోగా, వరి పంట ఎకరాకు రూ.40,000/ బీమాకు రైతులు వాటాగా రూ.80/ ఆగస్టు 15 వ తేదీ లోగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ క్రాప్ నమోదు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ పాస్ పుస్తకం, వేసిన పంట ధ్రువీకరణ పత్రాలను తీసుకొని రైతు సేవ కేంద్రాలు వద్ద సంప్రదించి, కామన్ సర్వీస్ సెంటర్ ల ద్వారా లేదా మీసేవ కేంద్రాలలో కానీ లేదా ఇన్సూరెన్స్ ఏజెన్సీల ద్వారా గాని పంటలకు బీమా చేయించుకోవాలని తెలియజేశారు. కౌలు రైతులు కూడా బీమా కి అర్హులేనన్నారు. ఐచ్ఛిక పంటలైన పండ్ల తోటలు, ఆయిల్ పామ్ తోటలను 100 ఈ పంట నమోదు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి రవిబాబు పాల్గొన్నారు.

## 'పంటల బీమా పథకం నమోదు అయ్యేలా చూడాలి'

రాజుపాలెం, జూలై 28,ప్రభాతవార్త: రాజుపాలెం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో జిల్లా వ్యవసాయాధికారి ఎం.జగ్గారావు రాజుపాలెం, బెల్లంకొండ మండలాల గ్రామ వ్యవసాయ సహాయకుల సమీక్షా సమావేశం జరిపారు., పంటల బీమా పథకంలో నమోదు చాలా తక్కువగా ఉన్నందున గ్రామాల వారిగా రివ్యూ చేస్తూ జూలై 31 వ తేదీతో కంది, పత్తి పంటల గడువు ముగుస్తున్నందున గ్రామాలలో



రైతులకు తెలియజేసి ప్రతి రైతు పంటల బీమా పథకంలో నమోదు అయ్యే విధంగా చూడాలని తెలిపారు. అదేవిధంగా స్థానిక రైతులతో కలిసి రాజుపాలెం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ని సంప్రదించి పంట ఋణాలు ఇప్పించటమైనది రైతులకు తప్పకుండా పంటల బీమా పథకం చెయ్యాలని , కౌలు రైతులకు వ్యక్తిగతంగాని లేదా గ్రూప్ రూపంలో గానీ పంట ఋణాలు మంజూరు చెయ్యాలని తెలియజేయటం జరిగినది . ఈ కార్యక్రమంలో క్రోసూరు సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ, మండల వ్యవసాయాధికారి పి. వెంకట నరసయ్య , రాజుపాలెం, బెల్లంకొండ గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట, జూలై 28 ప్రభాతవార్త : కోటప్పకొండ పరిసర ప్రాంతంలోని గొనెపూడి కొండలో అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం సీడ్ బాల్స్ డిస్పర్సల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హాజరై, డ్రోన్ సాంకేతికత ద్వారా కొండ ప్రాంతంలో సీడ్ బాల్స్‌ను వెదజల్లి అనంతరం మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతి మనిషికి గాలి, నీరు, వర్షం, పండ్లు, ఆహారం వంటి అనేక వరాలను అందిస్తోందని, కానీ మనిషి మాత్రం చెట్లను నరికి కొండలను ధ్వంసం చేస్తూ పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాడని అన్నారు. పర్యావరణ మార్పుల ప్రభావంగా ఎల్‌నీనో పరిస్థితులు ఏర్పడి వర్షపాతం అస్థిరంగా మారుతోందని, అందువల్ల ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మన పండుగలు, సంస్కృతి అన్నీ ప్రకృతితో ముడిపడి ఉన్నాయని, ప్రకృతిని కాపాడుకోవడం అంటే భవిష్యత్ తరాలను రక్షించడమేనని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణప్రియ మాట్లాడుతూ అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు సీడ్ బాల్స్ డిస్పర్సల్ వంటి కార్యక్రమాలు సమర్థవంతంగా ఉపయోగపడతాయని చెప్పారు. ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని, మొక్కల సంరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు సీడ్ బాల్స్ తయారీ, వాటి వినియోగం, డ్రోన్ ద్వారా విత్తనాల పంపిణీ విధానంపై ఆసక్తి కనబరిచారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మధు, నాయకులు షేక్ రఫీ, వెంకటప్పయ్య, అటవీశాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆసియా జూనియర్ క్లాసిక్ ఈక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2026కు వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

రొంపిచర్ల,జూలై 27 ప్రభాతవార్త : వాగ్దేవి డిగ్రీ కళాశాల (అటానమస్) విద్యార్థి ఎస్.కౌశిక్ ఆసియా జూనియర్ క్లాసిక్ ఈక్విప్డ్ పవర్లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్2026కు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని కళాశాల ప్రిన్సిపల్ కపిలవాయి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. విద్యార్థి జాతీయ స్థాయిలో కనబరిచిన అత్యుత్తమ ప్రతిభఆధారంగా 2026 సెప్టెంబర్ 21 నుండి 25 వరకు టర్కీలోని ఇస్తాంబుల్ లో నిర్వహించనున్న ఆసియన్ జూనియర్ క్లాసిక్ ఈక్వయిప్డ్ పవరలిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2026లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని పొందినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రాయల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, విద్యార్థి కౌశిక్ అంత ర్జాతీయ వేదికపై అత్యుత్తమ ప్రతిభ కనబరిచి దేశానికి, రాష్ట్రానికి, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాట్ల రామకోటేశ్వరరావు, డైరెక్టర్లు ఒగురి నాగేశ్వరావు, మద్దుల కోటేశ్వరరావు, సోదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి కృష్ణ కిషోర్, ఫిజికల్ డైరెక్టర్లు రాజామెర్సీన్ మరియు కృష్ణంరాజు ఎంపికైన విద్యార్థిని అభినందించి, అంతర్జాతీయ పోటీల్లో విజయం సాధించి భారతదేశానికి కీర్తి తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు.



## మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా అశోక్ బాబు



నరసరావుపేట క్రైమ్, జులై 28 ప్రభాతవార్త : నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా టీ. అశోక్ బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అశోక్ బాబు గతంలో గురజాల, నరసరావు పేట 2వ పట్టణ పోలీస్ స్టేషన్, ముప్పాళ్ళ, సత్తెనపల్లి టౌన్, అచ్చంపేట, రాజుపాలెం ఎస్సై గా విధులు నిర్వర్తించారు. ఇటీవల నూతన సిఐగా పదోన్నతి పొంది విఆర్ నుండి నరసరావుపేట మహిళా పోలీస్ స్టేషన్ కు బదిలీపై వచ్చారు. సిఐ అశోక్ బాబుకు మహిళా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే అరవిందబాబుకి వినతిపత్రం అందించిన కార్మికులు

నరసరావుపేట, జూలై 28 ప్రభాతవార్త : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు తల్లికి వందనంతో పాటు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటినీ అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి సిలార్ మసూద్ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శిలార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు నైపుణ్యంతో పనులు చేస్తూ అతి తక్కువ వేతనాలు తీసుకుంటున్నారని ఇంత తక్కువ వేతనాలు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడం సోచనీయమన్నారు. అరాకొరా వేతనాలతో పిల్లలను చదివించుకోవడం చాలా కష్టంగా ఉంటుందని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులందరి పిల్లలకు షరతులు లేకుండా తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందుకున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు స్పందిస్తూ జిల్లా కలెక్టర్, రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని హామీ ఇచ్చారని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష కార్యదర్శులు షేక్. చిన్న అల్లా బక్షు, సోమశేఖర్, గూడా సామరాజ్యం, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, షేక్. ఖాదర్, రమణ, జి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



## డీఎస్సీ అక్రమాలకు నైతిక బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి.

**వైయస్సార్సీపి ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ గోపిరెడ్డి,బొల్లా బ్రహ్మనాయుడు,నంబూరు శంకర్రావు**

నరసరావుపేట, జూలై 28 ప్రభాతవార్త : విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని, డీఎస్సీలో అక్రమాలకు నైతిక బాధ్యత వహించి విద్యా శాఖ మంత్రి లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నిరసన ర్యాలీ జరిగింది. జిల్లా వైయస్సార్ పార్టీ విద్యార్థి,యువత విభాగాల నాయకులు కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. ర్యాలీ లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పి ఎ సి మెంబర్ బొల్లా బ్రహ్మనాయుడు, పెదకూరపాడు సమన్వయకర్త నంబూరి శంకర్రావు తో పాటు పార్టీ విభాగాల నాయకులు పాల్గొన్నారు. జిల్లా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని శక్తులలోకెల్లా గొప్ప శక్తి యువశక్తి అని,యువత తలుచుకుంటే ఏ ప్రభుత్వమైనా దిగి రావాల్సిందేనని ,దానికి ఉదాహరణే మొన్న ఢిల్లీలో జరిగిన ఉద్యమం అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో చేస్తున్న మోసాల్ని ఎండగట్టే కార్యక్రమం చేస్తున్నామని , డీఎస్సీలో జరిగిన





అవకతవకలకు బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదు అన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు ! ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చిరెండున్నర సంవత్సరాల కాలంలో ఫీజు రీయంబర్స్మెంట్ కింద విద్యార్థులకు కేవలం ఒక్క ఇన్స్టాల్మెంట్ మాత్రమే ఇచ్చారనీ గుర్తు చేశారు.రెండు లక్షల 56 వేల కోట్లు అప్పు తెచ్చాన విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఇవ్వలేదన్నారు. తల్లికి వందనం పథకంలో అర్హులైన విద్యార్థులు 84 లక్షల మంది ఉంటే కేవలం 64లక్షల మందికే ఇచ్చారన్నా రు. కరెంట్ బిల్లు ఎక్కువ వచ్చిందని కారణంతోనే వీరందరికీ తల్లికి వందనం ఎగ్గొట్టారని విమర్శించారు.తక్షణమే లోకేష్ రాజీనామా చేయాలని వైయస్సార్ పార్టీ తరఫున డిమాండ్ చేసారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని యువత నమ్మడం లేదు..

### జిల్లా టీడీపీ మీడియా కోఆర్డినేటర్ గంగిరెడ్డి



రొంపిచర్ల, జులై 28 ప్రభాతవార్త : రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో గొప్ప విజయాలు ప్రభుత్వం సాధించిందని జిల్లా పార్టీ మీడియా కోఆర్డినేటర్ గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు.మంగళవారం వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతకు భారీ ఎత్తున హామీలు ఇచ్చి చివరకు మాట తప్పిందన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి అమలు చేయకపోవడంతో లక్షలాది మంది యువత ఉద్యోగ అవకాశాలను కోల్పోయారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన వైసీపీ ఇప్పుడు విద్యార్థుల సంక్షేమం పేరుతో ధర్నాలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. అర్హత, ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ప్రస్తుతం యువత రాజకీయ ప్రచారాలను కాకుండా ప్రభుత్వ పనితీరును గమనిస్తోందని గంగిరెడ్డి పేర్కొన్నారు. వైకాపా ధర్నాలు, నిరసనలకు ప్రజల్లో స్పందన కనిపించడం లేదని జిల్లా కో ఆర్డినేటర్ గంగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

## డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్‌లో 110వ కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స విజయవంతం

నరసరావుపేట, జూలై 28 ప్రభాతవార్త : నరసరావుపేట డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్‌లో మరో అరుదైన వైద్య మైలురాయి నమోదైంది. ప్రముఖ ఈఎన్‌టీ మరియు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ రాజేష్ వేపూరి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించిన 110వ కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స అనంతరం, ఆ చిన్నారికి "స్విచ్ఆన్" (Implant Activation) కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలోని త్రిపురాంతకం మండలం, పాతకోటి గ్రామానికి చెందిన పాతకోటి శ్రీను వారి కుమారుడు పుట్టుకతోనే మూగచెవిటితనంతో బాధపడుతున్నాడు. చిన్నారి వినికిడి సమస్యను గుర్తించిన కుటుంబ సభ్యులు డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్‌లో డాక్టర్ రాజేష్ వేపూరిని సంప్రదించారు. వైద్య పరీక్షల అనంతరం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చిన్నారికి పూర్తిగా ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్స నిర్వహించారు. డాక్టర్ రాజేష్ వేపూరి మాట్లాడుతూ, గత నాలుగేళ్లుగా డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్‌లో కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.ఇప్పటివరకు 110 శస్త్రచికిత్సలను సుమారు 99 శాతం విజయవంతమైన ఫలితాలతో, ఎటువంటి ప్రధాన సమస్యలు లేకుండా పూర్తి చేశామని తెలిపారు.తాజాగా నిర్వహించిన 110వ శస్త్రచికిత్స అత్యంత క్లిష్టమైనదని ఆయన వివరించారు. చిన్నారి తండ్రి పాతకోటి శ్రీను మాట్లాడుతూ, తమ కుమారుడికి పుట్టుకతోనే వినికిడి సమస్య ఉందని, ఇతర ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సకు సుమారు ..6 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పారని తెలిపారు. అయితే డాక్టర్ రాజేష్ వేపూరిని సంప్రదించగా, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా విజయవంతంగా శస్త్రచికిత్స చేశారని ఆనందం వ్యక్తం చేశారు. డాక్టర్ రాజేష్ వేపూరికి, డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ లోకి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, లక్షల రూపాయల ఖర్చుతో కూడిన కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ, ఎన్టీఆర్ వైద్యసేవ, ఎల్ఓసీ, ఈఎస్ఐ/ఈహెచ్ఎస్ మరియు వివిధ ఆరోగ్య బీమా పథకాల ద్వారా అర్హులైన రోగులకు ఉచితంగా లేదా అతి తక్కువ ఖర్చుతో అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో హాస్పటల్ మేనేజర్ సత్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## పెదకొదమగండ్లలో ఇంటింటికీ టీడీపీ..!

### ఆకాశమే హద్దుగా సంక్షేమం, అభివృద్ధి..! ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, జూలై 28, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ఆకాశమే హద్దుగా సంక్షేమం, అభివృద్ధి రాష్ట్రంలో పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పెదకొదమగండ్ల గ్రామంలో ఖఇంటింటికీ తెలుగుదేశంఖ





ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా గ్రామంలోకి విచ్చేసిన ఎమ్మెల్యే జూలకంటికీ ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి.., ఘన స్వాగతం పలికారు. డీజే మోతలు, తీన్మార్ డప్పు వాయిద్యాలు నడుమ ప్రధాన వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామంలో కొలువుదీరిన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇంటింటికి ప్రచారం ప్రారంభించారు. గ్రామంలో రెండేళ్ల పాలనలో అందించిన సంక్షేమాన్ని, చేపట్టిన అభివృద్ధి పనుల గురించి డోర్ టు డోర్ తిరిగి వివరించారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు అందిస్తున్న సుపరిపాలన గురించి ముద్రించిన కరపత్రాలను గ్రామస్తులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ.. కారంపూడి మండలం సర్వతోముఖాభివృద్ధి కోసం గడిచిన రెండేళ్లలో రూ. 87.40 కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.116.28 కోట్లు ఖర్చు చేశామన్నారు. అలానే పెదకొదమగండ్ల గ్రామంలో రూ. 10.40 కోట్లు సంక్షేమానికి, రూ.2 కోట్లు అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాగునీటి పంపిణీ కమిటీ చైర్మన్ పగులూరు అంజయ్య, ఎంపీపీ బొల్నెడి శ్రీనివాసరావు, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ మధుసూదన్ యాదవ్, దుర్గి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మునుగోటి సత్యనారాయణ, పంగులూరు పుల్లయ్య, మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, శేషగిరిరావు,కోదటి ప్రభాకర్ , కందిమల్ల లక్ష్మయ్య, నల్లపోతుల గంగయ్య, జాస్తి గంగారావు, కోదాటి సీతయ్య, కోదాటి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమికి ముస్తాబైన సాయి మందిరాలు


కారంపూడి, జూలై 28, ప్రభాతవార్త: గురుపౌర్ణమి వేడుకలకు మండలంలోని సాయి మందిరాలు ముస్తాబయ్యాయి. కారంపూడి లోని దేవాలయాల వీధిలో ఉన్న శిరిడి సాయి మందిరం, ఆర్యవైశ్య వీధిలో ఉన్న సత్య సాయి మందిరం, ఎన్ఎస్పి కాలనీలో ఉన్న బాలనాగ సాయి మందిరం, గాదెవారిపల్లె గ్రామంలోని సాయిబాబా మందిరాలలో ఈనెల 29వ తేదీన జరగనున్న గురు పౌర్ణమి వేడుకలకు ఆయా దేవాలయాల కమిటీలు ఏర్పాట్లను చేశారు. దేవాలయాలలో ఉదయం నుండే పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. గురు పౌర్ణమి సందర్భంగా దేవాలయాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నామని. దేవాలయాల కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు, సాయి భక్తులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గురు పౌర్ణమి పండుగను జయప్రదం చేయవలసిందిగా కోరారు.



## రోడ్లపై అక్రమ షాపులపై చర్యలు:

### ఆక్రమణలు తొలగించాలి: ఎస్.ఐ. గోపాల్ హెచ్చరిక

దుర్గి, జూలై 28, ప్రభాతవార్త: దుర్గి పట్టణంలో రోడ్లపై అక్రమంగా షాపులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తున్న వారికి పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.మంగళవారం ఎస్.ఐ. బి. గోపాల్ పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో తనిఖీలు నిర్వహించారు. రహదారులపై ఆక్రమించి పెట్టిన చిన్న చిన్న షాపులు, బండ్ల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు.ఈ సందర్భంగా వ్యాపారులకు గడువు ఇస్తూ, వెంటనే ఆక్రమణలు తొలగించి రోడ్డుకు మార్జిన్ వదిలి షాపులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో పోలీసు చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.రోడ్లు ప్రజలందరికీ సంబంధించినవని, ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రాబోయే రోజుల్లో మళ్లీ తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు



## నిప్స్ ఆధ్వర్యంలో హెపటైటిస్ పై అవగాహన

రొంపిచర్ల,జూలై 28 ప్రభాతవార్త : ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా స్థానిక నరసరావుపేట ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెన్స్ (నిప్స్) కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం యల్లమంద గ్రామంలో హెపటైటిస్ పై ఉచిత అవగాహన కార్యక్రమం నిర్వహించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఎన్. సురేష్ కుమార్ తెలిపారు. స్థానిక విలేజ్ క్లినిక్ సహకారంతో యల్లమంద గ్రామ ప్రజలకు హెపటైటిస్ పై అవగాహన కొరకు ఇంటింటికి తిరిగి కర పత్రాలను అందజేశారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజి మరియు హెపటాలజి డాక్టర్ డాక్టర్ నికిలేష్ యండమూరిచే ఆధ్యాదునిక టెక్నాలజి డెవలప్మెంట్స్ గురించి విద్యార్థులకు పవర్పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారని తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రేటరీ మిట్టపల్లి రమేష్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ పి. లాజర్, ఫార్మడి అధ్యాపకులు డాక్టర్ ఎ.శ్వేత ప్రతీమ, డాక్టర్ లతశ్రీ, డాక్టర్ ముల్లా మోబిన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూటమి పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది..

**ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ విజయాలను వివరించిన ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు మాణిక్యరావు.**

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 28, ప్రభాతవార్త : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ప్రజలకు విశ్వాసం పెరిగిందని ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు, జిల్లా టిడిపి అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు పేర్కొన్నారు. మండలంలోని పుల్లడిగుంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు, స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హంద్రీ-నీవా ప్రాజెక్టును పూర్తి చేసి కుప్పంతో పాటు కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల చివరి ప్రాంతాల వరకు సాగు, తాగునీరు అందించిన ఘనత కూటమి



ప్రభుత్వానిదేనన్నారు. రూ.36 వేల కోట్లతో 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను ప్రణాళికాబద్ధంగా పూర్తిచేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రహదారుల్లో గుంతలు కూడా పూడ్చకుండా వెళ్లిపోయిందని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టి కోతలు లేని నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు, రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ట్రూఅప్‌కు బదులుగా ట్రూడౌన్ అమలు చేసి ప్రజలపై భారం తగ్గించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుంటే, వందలాది కేసులు వేసి అడ్డుకునేందుకు ప్రయత్నించారని విమర్శించారు. మెగా డీఎస్సీ పై బహిరంగ చర్చకు రావాలని మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్‌ను స్వీకరించాలని, వారానికోసారి ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు మానుకోవాలని సూచించారు. జగన్ పాలనలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, కూటమి ప్రభుత్వం ప్రజల ఆస్తులకు పూర్తి భరోసా కల్పించిందన్నారు. అమరావతి అభివృద్ధి వేగంగా జరుగుతోందని, ప్రతిష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు అమరావతిలో పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. వైసీపీ కుట్రలను అధిగమించి సీడ్ యాక్సిస్ రోడ్డు పనులను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఒకే రాజధాని - అభివృద్ధి వికేంద్రీకరణ కూటమి ప్రభుత్వ విధానమని, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రారంభంలో గ్రామములోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేసి, వివరించారు. బూత్ స్థాయి నేతలు గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

### అమరేశ్వరస్వామి దేవస్థాన అంతరాలయంలో సెల్ ఫోన్ నిషేధించాలని భక్తుల వినతి.

అమరావతి,జూలై 28, ప్రభాతవార్త : శ్రీ అమరేశ్వర స్వామివారి దేవస్థానం అంతరాలయంలో సెల్‌ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి, డ్రెస్ కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలని కోరుతూ



స్వామివారి భక్తులు మంగళవారం దేవస్థానం ఈవో, సహాయ కమిషనర్ పి. సైదమ్మబాయ్‌కు వినతిపత్రం సమర్పించారు. కొంతమంది భక్తులు, దేవస్థానం అర్చక స్వాములు, సిబ్బంది అంతరాలయంలో ఫోన్ మాట్లాడడం, వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్, రీల్స్ చూడడం, వీడియో కాల్స్ చేయడం, ఫోటోలు వీడియోలు తీయడం వల్ల ఇతర భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, దేవస్థానంలోని ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతింటోందని, ఆలయ పవిత్రతకు భంగం కలుగుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఈవో పి. సైదమ్మబాయ్ అంతరాలయంలో సెల్‌ఫోన్ నిషేధాన్ని తప్పకుండా అమలు చేసి, ఆలయ నిర్వహణను వాకీటాకీల ద్వారా కొనసాగిస్తామని, డ్రెస్ కోడ్ అమలుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది బెల్లపు సుబ్బారావు, అప్పికట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

### మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్

మంగళగిరి, జూలై 28, ప్రభాతవార్త: సమాజంలోని నిరుపేదలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సేవాభావంతో నిర్వహించే కార్యక్రమాలు మానవతా విలువలను పెంపొందిస్తాయని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ అన్నారు. మంగళవారం మంగళగిరి మండలం పెద్దవడ్లపూడి గ్రామంలోని పెద్దబావి సెంటర్‌లో 300 మంది నిరుపేద



కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బియ్యం, పప్పులు, నూనెతో పాటు ఇతర నిత్యావసర వస్తువులతో కూడిన కిట్లను అర్హులైన కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, మంగళగిరి గ్రామీణ సీఐ చిరుమామిళ్ల వెంకట్ హాజరై లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జవ్వాది కిరణ్ చంద్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. నిరుపేదల అవసరాలను గుర్తించి వారికి చేయూతనందించే స్వచ్ఛంద సంస్థలు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మంగళగిరి గ్రామీణ సీఐ చిరుమామిళ్ల వెంకట్ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. సమాజంలో సేవాభావం పెంపొందినప్పుడే పేద, బలహీన వర్గాలకు నిజమైన భరోసా లభిస్తుందని తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు తోడ్పాటునందిస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు వివిఎస్ఎన్ కుమార్, డాక్టర్ కె జీవన్, జీవముగల దేవుని ప్రార్థన సంఘం పాస్టర్ ఆమోస్, రాజేష్, నిర్వాహకులు, సంఘస్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శాంసన్. జ్యోతి పై దాడి చేసిన జిలాని ని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి: వైసిపి నాయకులు

క్రోసూరు( జూలై 28 ప్రభాతవార్త ): శాంసన్ .జ్యోతి పై దాడి చేసిన జిలాని నీ వెంటనే అరెస్టు చేసి అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ కార్యదర్శి గార్లపాటి దాసు మరియు క్రోసూరు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పెరుమళ్ళపల్లి కోటయ్య డిమాండ్ చేసినారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పల్నాడు జిల్లా కారంపూడి మండలం పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన శాంసన్. జ్యోతి భార్య భర్త బైకుపై హాస్పటల్ కు నరసరావుపేట వెళుతుండగా షేక్ జిలాని అనే రౌడీ వారి బైకును అడ్డగించి వారిపై



దాడి చేసి కులం పేరుతో దూషించిన జిలాని గతంలో వారి ఇంటి పై దాడి చేయడమే కాకుండా వారి మోటార్ సైకిల్ కూడా తగలబెట్టినాడు. అప్పుడే కనుక జిలనీ ని కఠినంగా శిక్షించి ఉంటే మరల వారిపై దాడి చేసేవాడు కాదు కులం పేరుతో దూషించేవాడు కాదు. ఇప్పటికైనా కారంపూడి ఎస్ హెచ్ ఓ జిలానిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురజాల డిఎస్పీ కి మరియు జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు నల్లగొండ వెంకయ్య. మేదర రోశయ్య పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

### ఏపీ ఎంఎస్ఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి, జూలై 28, ప్రభాతవార్త: జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళగిరి గౌతమ్ బుద్ధ రోడ్డులోని ఊర్వశి సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న చిల్లపల్లి కళ్యాణ మండపంలో దివ్యాంగులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఎంఎస్ఐడిసి చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తమకు నాయకత్వం వహించే బలమైన



నాయకుడు అవసరమని, జనసేన పార్టీలో ప్రత్యేకంగా దివ్యాంగుల వింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి, దివ్యాంగులకు ప్రత్యేక నాయకత్వాన్ని నియమించేలా విజ్ఞప్తి చేస్తామని చిల్లపల్లి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ఇంద్రధనస్సు" పథకం దివ్యాంగులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తికాకముందే ప్రతి నియోజకవర్గంలో దివ్యాంగులకు స్కూటీల పంపిణీ చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించి అర్హులైన ప్రతి దివ్యాంగుడికి స్కూటీలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో దివ్యాంగుల సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా జనసేన పార్టీ నిరంతరం కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడే దివ్యాంగులను ప్రోత్సహించేలా పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దివ్యాంగుల విభాగం ఏర్పాటు చేసే దిశగా సానుకూల నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, పొన్నూరు మాజీ శాసనసభ్యులు కిలారి రోశయ్య , పార్టీ నాయకులు మాజీ ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, చ రాష్ట్ర నలుమూలల నుంచి దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులే ప్రభుత్వ లక్ష్యం.!

### టిడిపి యువ నాయకులు గౌతమ్ జూలకంటి

మాచర్ల రూరల్, జూలై 28, ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు, టిడిపి యువ నాయకులు గౌతమ్ జూలకంటి అన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే జూలకంటి



బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలో రాయవరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం.. ప్రతి ఇంటికి జూలకంటి ప్రచార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గౌతమ్ జూలకంటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన గౌతమ్ ను గ్రామ ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు సాదరంగా ఆహ్వానించారు. గ్రామంలోని ప్రతి వీధిని కలయతిరుగుతూ.., ఇంటింటికి వెళ్లి.., కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాన్ని ప్రజలకు అందించి, వివరించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మౌలిక వసతులు పరిశీలించి, పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజా సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే జూలకంటి నిరంతరం పాటుపడుతున్నారని చెప్పారు. వేల కోట్ల అభివృద్ధి పనులు, వందల కోట్ల సంక్షేమాన్ని నియోజకవర్గానికి అందించిన ఘనత జూలకంటికే దక్కుతుందని వివరించారు. కొత్తపల్లి గ్రామంలో ఇంటింటికి.. మండల పరిధిలో కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి, గ్రామానికి అందించిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను యువ నాయకులు గౌతమ్ వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## పేటసన్నేగండ్లలో పలువురిని పరామర్శించిన పిన్నెల్లి

కారంపూడి , జూలై 28, ప్రభాతవార్త: మండలంలోని పేటసన్నేగండ్ల గ్రామంలో వైసీపీ నాయకులు అల్లడి. కొండా మంగళవారం మృతిచెండటంతో విషయం తెలుసుకున్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి కొండా మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం కొండా కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం పేటసన్నేగండ్ల





ఎస్సి కాలనీకి చేరుకొని ఇటీవల ప్రమాదంలో గాయపడిన వైసీపీ దళిత నాయకులు మామిడి. శేఖర్ నివాసానికి వెళ్లి శేఖర్ ను పరామర్శించారు. ఆరోగ్య సంబంధించి యోగక్షేమలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు కొంగర. సుబ్రహ్మణ్యం, పల్నాడు జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు కొమ్ము. చంద్రశేఖర్, కారంపూడి పట్టణ వైసీపీ అధ్యక్షులు బొమ్మిన. అల్లయ్య, పేటసన్నేగండ్ల వైసీపీ నాయకులు ఉన్నం. గిరి, యువజన విభాగం మండల అధ్యక్షులు చిలుకూరి. చంద్రశేఖర్ రెడ్డి, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు సయ్యద్. జిలాని, మైనారిటీ నాయకులు మస్తాన్, మండల మైనారిటీ ఉపాధ్యక్షులు దర్గా. సుభాని, యువజన విభాగం కార్యదర్శి ప్రభుకిషోర్, మారబత్తుల.శ్రీనివాసరావు, మాచర్ల ఏడుకొండలు, నెలపాటి. వీరయ్య, తోడేటి. సుబ్బారావు, నేలపాటి. నరసింహరావు, బెల్లంకొండ. రామారావు, ఉన్నం. గిరి, శ్యాంసన్, చిన్ని, చిరుమామిళ్ల. నరసింహరావు, శివరామకృష్ణ, అంజి, బత్తుల. భైరగి, బజాజ్ మీరా, మర్రి. శేషయ్య, జొన్నలగడ్డ. శ్రీను, లంక. నాగేశ్వరరావు, దినకర్, ప్రసాద్ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీచక్ర సిమెంట్ కార్మికుల హక్కుల కోసం ఐక్య పోరాటం

### ఏఐటీయూసీ సాధారణ సమావేశంలో రాధాకృష్ణమూర్తి పిలుపు

కారంపూడి, జూలై28, ప్రభాతవార్త: శ్రీచక్ర సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల సాధారణ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జాతీయ సమితి సభ్యుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పాల్గొని మాట్లాడుతూ,ఫ్యాక్టరీలో కార్మికులందరూ ఐక్యంగా ఉంటేనే హక్కులను కాపాడుకోవచ్చని



పిలుపునిచ్చారు. 107 సంవత్సరాలుగా ఏఐటీయూసీ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ, మూతపడిన ఫ్యాక్టరీలను తెరిపించడం, తొలగించిన కార్మికులకు న్యాయం చేయడం వంటి ఎన్నో విజయాలను సాధించిందన్నారు. దేశంలో కార్మికులకు రక్షణ కల్పించిన అనేక కార్మిక చట్టాల సాధనలో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించిందన్నారు. శ్రీచక్ర సిమెంట్ సంస్థ మార్కెట్‌లో లాభాల్లో ఉందనే ప్రచారం జరుగుతుండగా, కార్మికులకు మాత్రం నష్టాలను కారణంగా చూపడం సరైంది కాదన్నారు. చట్టప్రకారం రావాల్సిన ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను తొలగించి నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చిందని, అవి కార్మిక హక్కులను బలహీనపరిచే విధంగా ఉన్నాయని ఆరోపించారు. .సిమెంట్ ఫెడరేషన్ జాతీయ నాయకుడు మోహన్‌రావు మాట్లాడుతూ, లే ఆఫ్ ప్రకటించే ముందు యాజమాన్యం కార్మికులతో చర్చలు జరపాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు చర్చలకు పిలవలేదని తెలిపారు. ముఖ్యమంత్రి, లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశామని చెప్పారు. ఉద్యోగం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని, విడతలవారీగా కార్మికులను తొలగించి చివరకు ఫ్యాక్టరీని మూసివేయాలనే యాజమాన్యం ప్రణాళిక ఉన్నట్లు ఆరోపించారు. 1982 నుంచి 1989 వరకు సిమెంట్ పరిశ్రమలో వేజ్ బోర్డు వ్యవస్థ ఉండేదని, అనంతరం దానిని తొలగించారని గుర్తు చేశారు. ఆగస్టు 1 నుంచి లే ఆఫ్ ప్రకటించడం అన్యాయమన్నారు. కొత్త కార్మిక చట్టాలు కార్మికులకు అనుకూలంగా లేవని, బలమైన సంఘం ద్వారానే హక్కులను కాపాడుకోవచ్చన్నారు. పరిశ్రమలను నష్టాల్లోకి నెట్టివేసి యాజమాన్యాలు మాత్రం వ్యక్తిగతంగా లాభపడుతున్నాయని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ నాయకుడు వేముల వెంకటరెడ్డి మాట్లాడుతూ, యాజమాన్యాలు మారినా కార్మికులు మారరని, కార్మికులతో సంప్రదించకుండా యాజమాన్య మార్పులు చేయరాదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేడ హనుమంతరావు మాట్లాడుతూ, సంపద సృష్టికర్తలు కార్మికులేనని, ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న కార్పొరేట్ సంస్థలు నష్టాలను చూపించి ప్రభుత్వ రాయితీలు పొందుతున్నాయని విమర్శించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రావుల అంజిబాబు మాట్లాడుతూ, లే ఆఫ్ ప్రకటించడం దారుణమన్నారు. సిపిఐ నాయకుడు బాలయ్య మాట్లాడుతూ, కార్మికుల భవిష్యత్తు కోసం చేపట్టాల్సిన పోరాటాల విధి విధానాలను వివరించారు. షేక్ గాలి సాహెబ్ . కాటా శ్రీనివాసరావు, ఎన్. నరేంద్ర, ఎం. గోపినాయక్, ఎన్. వెంకట్రావు, ఎన్. సాంబశివరావు, ఓ. రాజారావుతో పాటు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), జూలై 28, ప్రభాతవార్త : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని కుర్నూతల ఐదో మైలు వద్ద ఉన్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం మెగా జాబ్ మేళాకు సంబంధించి పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రామాంజనేయులు హాజరై మాట్లాడుతూ..ఆగస్టు 5వ తేదీన ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో మూడో విడత మెగా జాబ్ మేళాను జిల్లా నైపుణ్యాభివృద్ధి



సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా 31 కంపెనీలు నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పేర్కొన్నారు. డీఎస్సీ అంశంపై వైసీపీ చేస్తున్న విమర్శలపై ఎమ్మెల్యే స్పందించారు మంత్రి నారా లోకేష్ ఇప్పటికే బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారని తెలిపారు. ఢిల్లీలో జరిగిన నీట్ పేపర్ లీకేజీకి, ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశంపై కూడా వైసీపీకి మాట్లాడే హక్కు లేదని గత ప్రభుత్వ కాలంలో విద్యార్థులకు రూ.4,500 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారని, ఆ బకాయిలను చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు. మంత్రి నారా లోకేష్ విసిరిన సవాల్‌ను స్వీకరించి వైసీపీ నేతలు చర్చకు రావాల న్నారు. గత వైసీపీ పాలనలో రివర్స్ పాలన జరిగిందని ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ..నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణనిస్తూ రాష్ట్రవ్యాప్తంగా మెగా జాబ్ మేళా ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. కళాశాల చైర్మన్ చందు రామారావు మాట్లాడుతూ..తమ కళాశాలలో మెగా జాబ్ మేళా ను నిర్వహించేందుకు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ చందు రోహిత్, ప్రిన్సిపల్ డాక్టర్ డివివిఎస్ ఫణికుమార్, వైస్ ప్రిన్సిపల్ కె.కిరణ్ కుమార్, ఎంబీఏ డైరెక్టర్ చందు రవికుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ చందు బాబురావు, వివిధ శాఖల హెచ్ఓడిలు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజారావు, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి కె. సంజీవరావు, ప్లేస్మెంట్ అధికారి రవికుమార్, జేబీఎం జె. రాంబాబు,మీడియా కోఆర్డినేటర్ గింజు పల్లి వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నార్నె బాబు, మన్నవ వంశీ, టిడిపి నేతలు కిరణ్ కుమార్ సాంబశివరావు, రంగారావు జాగర్లమూడి, పరిటాల హరిబాబు, తాటి వీరయ్య, దారా వెంకట్రావు, పార్టీ శ్రేణులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల టౌన్, జూలై 28, ప్రభాతవార్త:వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డి ని పల్నాడు జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం,పల్నాడు జిల్లా రాజకీయ పరిస్థితులు,పార్టీ కార్యక్రమాలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పార్టీ అధ్యక్షులు వై.యస్. జగన్మోహన్ రెడ్డి కి



శుభాకాంక్షలు తెలియజేసి,పార్టీ కార్యక్రమాలను జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

## పత్తి పంటలో చీడపీడల నివారణపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

మాచర్ల టౌన్, జూలై 28, ప్రభాతవార్త: మాచర్ల మండలం,రాయవరం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు ప్రత్తి పంటలో చీడపీడల నివారణపై అప్రమత్తంగా



ఉండాలని మండల వ్యవసాయ అధికారి డి.పావ కుమారి సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఆమె రైతులతో కలిసి ప్రత్తి పంట పొలాలను సందర్శించి,గులాబి రంగు పురుగు ఉద్భృతి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే తెల్లదోమ నివారణకు లీటరు నీటికి 1.25 గ్రాముల డిఫెంథురియన్, పచ్చదోమ నివారణకు లీటరు నీటికి 2 మి.లీ. ఫిప్రోనిల్, పిండి నల్లి నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. ప్రొఫెనోఫోస్, రసం పేల్చే పురుగుల నివారణకు లీటరు నీటికి 0.2 గ్రాముల ఎసిటమిప్రిడ్ మందులను పిచికారీ చేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు,ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు తప్పనిసరిగా పంటల బీమా నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. వరి పంటకు ఎకరానికి రూ.80, కంది పంటకు రూ.40, మిరప పంటకు రూ.360, ప్రత్తి పంటకు రూ.1,900 చెల్లించి బీమా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వరి పంటకు ఆగస్టు 15 వరకు, కంది, మిరప, ప్రత్తి పంటలకు జూలై 31 వరకు బీమా నమోదు గడువు ఉందని పేర్కొన్నారు. కౌలు రైతులు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి సీసీఆర్‌సీ కార్డులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి.చౌదర్ రెడ్డి,రైతు సేవా కేంద్రం సిబ్బంది ఎం. శివా నాయక్,రాయవరం గ్రామ రైతులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులు అమానుషం బాధితులకు న్యాయం చేయాలి: పులిమెల మాణిక్యం



మాచర్ల క్రైమ్ జూలై 28 ప్రభాతవార్త: కారంపూడి ప్రాంతంలో దళితులపై జరుగుతున్న దాడులు అమానుషమని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పులిమెల మాణిక్యం ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త పల్లపాటి సంసోను తన భార్య జ్యోతితో కలిసి పేటసన్నిగండ్ల గ్రామంలోని పోతురాజు గుట్ట నుంచి నరసరావుపేట వైద్యశాలకు వెళ్తుండగా,టీడీపీ కార్యకర్త జిలానీ వారి వాహనాన్ని అడ్డగించి,కులం పేరుతో దూషించడంతో పాటు దాడికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.ఈ ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ, కారంపూడి సీఐలకు విజ్ఞప్తి చేశారు. నిందితులపై ఎస్సీ,ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సంసోనుపై దాడి చేయడం,కులం పేరుతో అవమానించడం అత్యంత బాధాకరమని పేర్కొన్న పులిమెల మాణిక్యం, గతంలో కూడా బాధితుల ఇంటిపై దాడి జరిగినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తక్షణమే చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## ఉపాధ్యాయ అర్హత పరీక్ష సందేహాల నివృత్తికి 9052152920 , 9347310671 నంబర్లతో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

### గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష

గుంటూరు విద్య జులై 28 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్2026) కు సంబంధించి అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) కార్యాలయంలో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు గుంటూరు జిల్లాకా విద్యాశాఖాధికారి షేక్ . సలీమ్ బాషా తెలిపారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 5 నుండి 16వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. రోజుకు రెండు విడతలుగా (ఉదయం 09:30 నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు మరియు మధ్యాహ్నం 02:30 నుండి సాయంత్రం 05:00 గంటల వరకు) కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (సి బి టి) జరగనున్నాయని పేర్కొన్నారు.అభ్యర్థుల సౌకర్యార్థం గుంటూరు జిల్లా పరిధిలో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. చేబ్రోలు మండలం లోని ఆర్.వి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (చేబ్రోలు) వట్టిచెరుకూరు మండలం లోని ప్రియదర్శిని ఇన్స్టిట్యూట్ ఆఫర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ (కొర్నెపాడు) మేడికొండూరు మండలం లోని ఎన్ఆర్ఐ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నశాలజీ (పెరేచర్ల) .

## యలమంచిలి శివాజీ అపార రాజకీయ అనుభవం భావితరాలకు స్ఫూర్తిదాయకం



గుంటూరు విద్య జులై 28 ప్రభాతవార్త: మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ అపార రాజకీయ అనుభవం, పరిపాలనాదక్షత భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని భాష్యం విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు అన్నారు. మంగళవారం మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని ఆయన నివాసంలో భాష్యం హనుమంతరావు యలమంచిలిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యలమంచిలి భాష్యం హనుమంతరావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయి ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు.

## పేదవిద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ


గుంటూరు విద్య జులై 28 ప్రభాతవార్త : గుంటూరు స్థానిక సంగడిగుంట లోని చలమయ్య కాలేజీ నందు అవోపా అధ్యక్షులు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు, నిత్యవసర వస్తువుల పంపిణీ, విద్యార్థులకు 50 వేల రూపాయలు విలువచేసే నోటు పుస్తకాలు మరియు పేద విద్యార్థులకు మట్టుపల్లి రవికుమార్ సహకారంతో ఉపకార వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెటల్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్తూరి వెంకట నరసింహారావు, బాపూజి కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభు, అమరావతి వాసవి సత్రం అధ్యక్షులు తటవర్తి



రాంబాబు మరియు అవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు పాల్గొన్నారు. కొత్తూరి వెంకట నరసింహారావు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెల 108 మంది పేదలకు ఒక్కొక్కరికి 500 రూపాయలు చొప్పున పెన్షన్ , వెయ్యి రూపాయలు విలువ చేసే నిత్యవసర వస్తువులు,విద్యార్థులకు స్కాలర్షిప్లు ఇవ్వడం, మెడికల్ క్యాంపులు నిర్వహించి ఉచితముగా మందులు అందచేయడం అభినందనీయమని అవోప ద్వార నిర్వహించే కార్యక్రమాలకు తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపినారు. కర్పూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ పేదరికంతో చదువుకు ఎవరు దూరం కాకూడదని అనే ఉద్దేశంతో విద్యార్థులకు కోట్ల రూపాయల్లో స్కాలర్షిప్లు ఇచ్చే సంస్థ అవోప అని పేర్కొన్నారు. వాసవి సత్రం అధ్యక్షులు తటవర్తి రాంబాబు, అవోప రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచపూడి సుబ్బారావు లు మాట్లాడుతూ పేదల ఉన్నతికి వివిధ రకాల కార్యక్రమాలు చేయడం,అవోపా శాఖలు ద్వారా విద్య వైద్యము ఉపాధి ఈ మూడు అంశాలలో రాష్ట్రస్థాయిలో వివిధ పథకాలు చేపడుతున్నట్లు తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు నాగేశ్వరరావు, అవోప కార్యదర్శి రాధాకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, పెన్షన్ కన్వీనర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

## ఎల్ నీనో ప్రభావంతో వర్షపాతాలు తగ్గుతున్నాయి..

గుంటూరు, జూలై 28, ప్రభాతవార్త : ఎల్నీనో ప్రభావంతో వర్షపాతాలు తగ్గుతున్నాయని, రైతులు పంటల బీమాను త్వరగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడిఐ ఎన్.మోహన్రావు తెలిపారు. ఫిరంగిపురం మండలంలోని వేములూరిపాడు గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో



పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడిఏ మోహన్రావు పాల్గొని మాట్లాడుతూ..ఎల్నినో ప్రభావంతో గణనీయంగా వర్షపాతాలు తగ్గిపోతున్నాయని, ప్రత్తి వేసిన రైతులు పంటల భీమాను కచ్చితంగా చేయించుకోవాలన్నారు. ప్రత్తి పైరుకి రూ.1900లు, మిర్చి పైరుకు రూ.2700లు మండలంలోని కామన్ సర్వీస్ సెంటర్లలో చెల్లించి బీమా తీసుకోవాలని కోరారు. వర్షపాతం తగ్గిన బీమాతో కొంతవరకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందని వివరించారు. అలాగే వరి పైరుకు ఆగస్టు 15 వరకు పంటల భీమా చేసుకోవచ్చునని, వరి పైరుకు రూ.800లు చెల్లించాలని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి జె. వాసంతి మాట్లాడుతూ..ఈ ఖరీఫ్ సీజన్ నుండి రైతు సేవా కేంద్రాలలోనూ మరియు ప్రైవేటు డీలర్స్ వద్ద యూరియా, డిఏపి ఎరువుల కొనుగోలు ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారానే అని అందించబడుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ మండల ఇంచార్జ్ ఉమాదేవి వ్యవసాయ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఇరు గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

29MN 8 PG-GNT_29MN 8 PG-GNT.qxd 29-07-2026 AM 12:11 Page 1



## ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలి

కాకుమాను జూలై 28(ప్రభాతవార్త) : ప్రస్తుత వర్షా బావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలైన మినుము, పెసర పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి వి. సుధాకర్ రైతులకు తెలియపరిచారు. మంగళవారం మండలంలోని కె.బి పాలెం, కొల్లిమర్ల గ్రామాల్లోని రైతులకు మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులందరూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ కాలపరిమితి గల మినుము పెసర పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు కావలసిన ఎరువులు మండలంలోని ప్రతి ఒక్క రైతు సేవా కేంద్రంలో ఉన్నాయి. మరియు ప్రధానమంత్రి పంటల భీమా పథకంలో భాగంగా వరి పంట వేసుకునే రైతులు ఎకరానికి 800 రూపాయలు/మీ సేవ ద్వారా ఆగస్టు 15 లోపు కట్టుకోవచ్చని తెలియజేశారు/మినుము పంటకే పసల బీమా యోజన క్రింద 200/కట్టుకోవచ్చని రైతులు తెలియజేశారు. ఈ అవకాశం జూలై 31వ తేదీ వరకు ఉందని తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.



## ఇంటింటికి తెలుగుదేశం పార్టీ

చెరుకుపల్లి ,జూలై 28, ప్రభాతవార్త : గత రెండు సంవత్సరాలుగా కూటం ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా సంక్షేమ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే కార్యాచరణ పై మంగళవారం మండల కేంద్రమైన చెరుకుపల్లిలో పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండల పార్టీ అధ్యక్షుడు తాత ఏడుకొండలు అధ్యక్షత వహించి ఇంటింటికి కూటమి ప్రభుత్వ పథకాలను వివరించాలని కార్యకర్తలకు, ప్రజలకు భరోసా కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన అన్నారు. అదేవిధంగా కార్యచరణ ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి ఏ గ్రామాల్లో ఏ రోజు కా రోజు ఏ విధంగా నిర్వహించాలని విషయంపై పార్టీ సీనియర్ నాయకుడు రాధాకృష్ణమూర్తి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దీవి రాంబాబు ,పార్టీ మండల కార్యదర్శి డివి శ్రీనివాసరావు, మల్లాది రామకృష్ణ,పూషడపు కుమారస్వామి, సొంటి సుబ్బయ్య, నాగల పున్నారావు, ఉప్పాల సాంబశివరావు, గాదె సాంబశివరావు, దుర్గా రెడ్డి పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## ర్యాలీకి తరలివెళ్లిన వైసిపి పార్టీ శ్రేణులు

చెరుకుపల్లి, జూలై 28, ప్రభాతవార్త : డీఎస్సీ మరియు నీట్ పేపరు అక్రమాలపై వైసిపి నియోజకవర్గ కన్వీనర్ పీటర్ నాగమోహన్ కృష్ణ చేపట్టిన ర్యాలీకి మండలంలోని పార్టీ శ్రేణులు మంగళవారం మద్దతుగా తరలి వెళ్లారు.

## మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితుల సంక్షేమానికి మరో కీలక ముందడుగు

మంగళగిరి, జూలై 28, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్‌లో మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితుల సంక్షేమం కోసం మరో కీలక ముందడుగుగా, అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ (ఏ ఆర్ డి ఓ) వ్యవస్థాపకురాలు, మేనేజింగ్ ట్రస్టీ సుంకర శోభారాణి ఫిజియోథెరపిస్టు డా. ఎం.వి. పవన్ కళ్యాణ్ తో కలిసి ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎం ఎస్ ఐ డీసీ) ఛైర్మన్ జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు ను మంగళవారం మంగళగిరి తెనాలి ఫ్లైవర్ సమీపంలో ఉన్న వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 150 మంది మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితులకు 150 బ్యాటరీ ఆధారిత వీల్‌చైర్లను ఉచితంగా పంపిణీ చేయనున్న ఏ ఆర్ డి ఓ మెగా కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ని ముఖ్య అతిథిగా ఆహ్వానించేందుకు చిల్లపల్లి శ్రీనివాసరావు ని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితులు, ముఖ్యంగా చిన్నారులు, యువత వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఏ ఆర్ డి ఓ ప్రతినిధులు వివరించారు. అలాగే జన్యు పరీక్షలు, ఫిజియోథెరపీ సేవలు, విద్యా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, వీల్‌చైర్ల పంపిణీ వంటి పలు సేవలను రాష్ట్రవ్యాప్తంగా అందిస్తున్న విషయాన్ని వివరించారు. మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితులకు ..15,000 దివ్యాంగుల పెన్షన్ అందించాలనే అంశాన్ని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ బలంగా ప్రస్తావించిన నేపథ్యంలో, ఆయనను ఈ మెగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని నిర్ణయించినట్లు తెలియజేశారు. ఏ ఆర్ డి ఓ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించిన చిల్లపల్లి శ్రీనివాసరావు , ఈ కార్యక్రమానికి సానుకూలంగా స్పందించారు. అంతేకాకుండా, రాబోయే వారం రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితులకు శుభవార్త అందుతుందని హామీ ఇవ్వడం విశేషంగా నిలిచింది. ఈ స్పందన బాధిత కుటుంబాలకు కొత్త ఆశలను నింపిందని ఏ ఆర్ డి ఓ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమకు సమయం కేటాయించి, విలువైన ప్రోత్సాహం అందించిన చిల్లపల్లి శ్రీనివాసరావు కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితుల సంక్షేమం కోసం ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి నిరంతరం కృషి చేస్తామని సంస్థ స్పష్టం చేసింది. ఈ సమావేశంలో నూజివీడు నియోజకవర్గ జనసేన నాయకులు పాశం నాగబాబు, నందిగామ పిఏసిఎస్ చైర్మన్ కొట్టే హరికృష్ణ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రపంచ హెపటైటిస్ దినోత్సవ వేడుకలు

నగరం, జులై 28, ప్రభాతవార్త: హెపటైటిస్ బి నీ కనుగొని దాని వ్యాక్సిన్ అభివృద్ధి చేసిన నోబెల్ బహుమతి గ్రహీత బ్లం బెర్గ్ జన్మదినం పురస్కరించుకుని ప్రపంచం హెపటైటిస్ దినోత్సవం జరుపుకుంటారని శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. మంగళవారం శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలుషిత ఆహారం , అపరిశుభ్రమైన నీరు తీసుకోవడం వల్ల, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్, ప్రాసెస్ ఫుడ్ తీసుకోవడం వల్ల, సిగరెట్, మద్యం తీసుకోకుండా కాలేయం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, సైలెంట్ కిల్లర్ల ప్రారంభమై ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండా లోపల లోపలే కాలయాన్ని దెబ్బతీస్తుందని, ప్రజా ఆరోగ్యాన్ని ముప్పుగా ఉన్న హెపటైటిస్ ను పూర్తిగా నిర్మూలించాలని విద్యార్థిని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్యుఏసి కోఆర్డినేటర్ ఆర్. ప్రసన్న బాబు, జువాలజీ హెచ్ ఓ డి కే .సురేష్ బాబు, లక్ష్మీ ప్రసూన, సిహెచ్ సుధీర్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గస్థాయి ఆటలు పోటీలకు 95 మంది ఎంపిక

చెరుకుపల్లి, జూలై 28, ప్రభాతవార్త : శాప్ మరియు విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం గుల్లపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు ఘనంగా ప్రారంభించారు. కోకో, కబాడీ , హాకీ, ఆర్చరీ, బాస్కెట్బాల్ , బాక్సింగ్ విభాగాల్లో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలను మండల విద్యాశాఖ అధికారులు నవీన్ కుమార్ ,లాజర్లు ప్రారంభించారు. పోటీల్లో గుల్లపల్లి ,కావూరు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కవిత, వనజ పర్యవేక్షించారు. 470 మంది పాల్గొనగా వీరి నుండి 95 మంది నియోజవర్గ స్థాయికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల పి టి లు, పీఈటీలు పాల్గొన్నారు.



## కెఎల్ యూనివర్సిటీలో విద్యార్థినులకు ఆత్మరక్షణపై అవగాహన సదస్సు

తాడేపల్లి, జులై 28, ప్రభాతవార్త.కెఎల్ యూనివర్సిటీలో విద్యార్థినుల కోసం ఆత్మరక్షణపై అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, అత్యవసర పరిస్థితుల్లో ఆత్మరక్షణ నైపుణ్యాలు ప్రతి విద్యార్థినికి అవసరమని కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆత్మ రక్షణ శిక్షకురాలు పూజిత కోరాడ పేర్కొన్నారు. యూనివర్సిటీ లోని ఉమెన్ డెవలప్ మెంట్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థినులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య ఎంఎ అతిదిగా హాజరయిన ఆత్మ రక్షణ శిక్షకురాలు పూజిత కోరాడ మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా వ్యవహరించడంతో పాటు ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆత్మవిశ్వాసం, మానసిక ధైర్యం, సమయస్ఫూర్తి ఉంటే అనేక సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. అత్యవసర సమయాల్లో పోలీసుల సహాయం ఎలా పొందాలి, మహిళల భద్రత కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ సేవలను ఎలా వినియోగించుకోవాలి అనే అంశాలపై విద్యార్థినులకు వివరించారు.. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.ఐ.పవన్ కుమార్, విద్యార్థి సంక్షేమ విభాగం ఇంచార్జి డీన్ డాక్టర్ కెఆర్.ఎస్.ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, కెఎల్ ఉమెన్ డెవలప్ మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ కె.రూత్ రమ్య, కో కన్వీనర్ డాక్టర్ ఎన్. శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



# బాపట్ల జిల్లా వార్త



## నేడు గురుపౌర్ణమి వేడుక



పొన్నూరు, జూలై 28,ప్రభాతవార్త: పాత పొన్నూరు శివనగర్‌లో వేంచేసియున్న శ్రీ సద్గురు షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 29వ తేదీన గురుపౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9గంటలకు విఘ్నేశ్వరపూజతో ప్రారంభమై నిరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, వివిధ హారతులు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12గంటలకు అన్న సంతర్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు.రాత్రి 7గంటలకు బాబావారి పల్లకీసేవ జరుగుతుందన్నారు.భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాలని కమిటి సభ్యులు కోరారు.

## ప్రీమియం చెల్లించండి - లబ్ది పొందండి

**-జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకురాలు ముళ్ళపూడి**

పొన్నూరు, జూలై 28,ప్రభాతవార్త: పంటలు సాగుచేసే రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకురాలు ముళ్ళపూడి పద్మావతి సూచించారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని సూచనలు చేశారు. వరిపైరుకు ఎకరాకు రూ.8వందలు చెల్లించి రూ.40వేల వరకు బీమా సౌకర్యం పొందవచ్చన్నారు. వచ్చే నెల 15వ తేదీలోపు ప్రీమియాన్ని చెల్లించాలన్నారు.ఎడిఏ వి.రామకోటేశ్వరి మాట్లాడుతూ ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారానే రైతులు ఎరువులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ యాప్ గురించి ఇప్పటికే రైతుల్లో అవగాహన కల్పించినట్లు చెప్పారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు అయితేనే ఎరువులు పొందే వీలు ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు వరి వెదసాగు చేసిన భూమిలో మొలకశాతం వచ్చిన వెంటనే ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. రసాయన ఎరవులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, విఏఏలు వి.వాసవిశ్రీ, జాన్సన్, ఎంపీఈవో సింహాద్రి సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.



## ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ అమలు

**-ఎస్సీ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు**

పొన్నూరు, జూలై 28,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు సూపర్ సిక్స్ పథకాలను పూర్తిస్థాయిలోఅమలు చేసి ఇది మంచి ప్రభుత్వమని పేరు తెచ్చుకొందని రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు అన్నారు. రెండేళ్ళ నమ్మకం-అభివృద్ధి-సంక్షేమం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలో పర్యటించి ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. మండల పరిధిలోని చింతలపూడి, మాచవరం, నండూరు, చిన ఇటికంపాడు, వడ్డిముక్కల గ్రామాల్లో ఇంటింటికి పర్యటించి సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో విధ్వంసం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాత్రమే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సమపాళ్లలో అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాదల వెంకటేశ్వరావు, బొర్రు రామారావు, గణిపిశెట్టి రామకృష్ణ, చలమశెట్టి సీతారామయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఆర్మీలో అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**-పారా కమాండర్ కల్లం రజత్ సువర్ణ**

పొన్నూరు, జూలై 28,ప్రభాతవార్త: ఆర్మీలో అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని పారా కమాండర్ కల్లం రజత్ సువర్ణ సూచించారు. మండల కేంద్రమైన చేబ్రోలు ఆర్వీఐటీలో ఆర్మీ అవకాశాలపై జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. యువత ఇతర ఉద్యోగాలపై ఏ విధంగా మక్కువ పెంచుకొంటున్నారో, అదేవిధంగా ఆర్మీ ఉదో యగాలపై కూడా మక్కువ పెంచుకోవాలన్నారు. దేశ రక్షణలో కూడా యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భారత సైన్యంలో ఉన్న ఉద్యోగ అవకాశాలు, రాబోయే ఆర్మీ ర్యాలీలు, యువతకు అందుబాటులో ఉన్న కెరీర్ అవకాశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్, పరిసర ప్రాంతాల్లో త్వరలో నిర్వహించే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీల గురించి సమగ్ర సమాచారాన్ని అందించారు. దేశ రక్షణలో యువత పాత్ర ఎంత కీలకమైందో కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్వీఐటీ ఛైర్మన్ ఆర్.వంశీ కృష్ణ, ప్రిన్సిపాల్ ఆర్.వి.కృష్ణయ్య, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



## చదవడం-వ్రాయడం నేర్పించాలి

**-మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్**

పొన్నూరు, జూలై 28,ప్రభాతవార్త: ఐదవ తరగతి లోపే ప్రతి విద్యార్థికి చదవడం, వ్రాయడం నేర్పించాలని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ ఆదేశించారు. మండల పరిధిలోని పచ్చలతాడిపర్రు ఎంపిపిఎస్ స్కూల్, గోళ్ళమూడిపాడు ఎంపిపి పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులు ఏ మేరకు చదవడం, వ్రాయడం చేస్తున్నారో పరిశీలించారు. విద్యార్థులను దగ్గరకు పిలిపించుకొని వాచకాన్ని చూపించి చదివించారు. అదేవిధంగా చూడకుండా వ్రాయించడం కూడా చేశారు. కొంత మంది విద్యార్థులు చదవడం, వ్రాయడం చేశారు. అతి కొద్ది మాత్రం ఇంకా మెరుగు పడాల్సిన అవసరం ఉందని అక్కడి ఉపాధ్యాయులకు సూచించారు. కింది తరగతుల్లోనే ప్రతి విద్యార్థి చదవడం, వ్రాయడం పూర్తిస్థాయిలో చేస్తే ఉన్నత తరగతుల్లో మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కూర్చుకొని వారితోనే ఎంఈవో కూడా భోజనం చేశారు.



## పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**-మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని**

చేబ్రోలు(పొన్నూరు), జూలై 28,ప్రభాతవార్త: అర్హులైన రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.ప్రియదర్శిని కోరారు. చేబ్రోలు మండల పరిధిలోని సుద్ధపల్లి, శలపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియదర్శిని మాట్లాడుతూ వరి పంటకు ఎకరాకు రూ.800లు చెల్లించాలన్నారు. దీని ద్వారా రూ.40వేల బీమా వర్తిస్తుందన్నారు. మిర్చి పంటకు ఎకరాకు రూ.2700లు చెల్లిస్తే రూ.90వేలు బీమా పొందవచ్చన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవడం, ప్రధానమంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించడం వంటివి చేయాలన్నారు. రైతులు ఏపి ఎయిమ్స్ యాప్ ద్వారానే ఎరువులను తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జి.మోహన్, గ్రామ వ్యవసాయ సహాయకులు అఖిల, సూర్యప్రకాష్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఎన్జిఓ నేతల తీరుపై మున్సిపల్ సిబ్బంది నిరసన

తెనాలి మున్సిపాలిటీ జులై28(ప్రభాతవార్త): ఏపీ ఎన్జిఓ అసోసియేషన్ తెనాలి శాఖ వారు స్వర్ణ వార్డు సెక్రెటరీల తరుపున మున్సిపల్ కమీషనరు రామ అప్పలనాయుడుకి సమర్పించిన ఫిర్యాదులో మున్సిపల్ కమీషనరు, తెనాలి పురపాలక సంఘము వారిపై మోపిన అభియోగములు పూర్తిగా అవాస్తవాలు, ఏకపక్ష ఆరోపణలు మరియు ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించే విధముగా ఉన్నదని తెనాలి పురపాలక సంఘ ఉద్యోగులు మరియు వివిధ విభాగముల స్వర్ణ వార్డు సెక్రెటరీల ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయములో పురపాలక సంఘ కార్యాలయము నందు నిరసన కార్యక్రమము నిర్వహించారు.అనంతరం అసిస్టెంట్ సిటీ ప్లానరు శ్రీమతి వి.వాణి,మేనేజరు, జయకర్ ప్రెసిడెంట్, మరియు స్వర్ణ వార్డు సెక్రెటరీలు మాట్లాడుతూ, వార్డు సెక్రెటరీలతో పాటు ఏ ఇతర ఉద్యోగి కూడా సెలవులు మంజూరు విషయములో ఎటువంటి ఇబ్బందిని ఎదుర్కొనుటలేదని, పురపాలక సంఘము నందు ఉద్యోగుల సమస్యలు, సెలవులు, పరిపాలనా అంశాలు, ప్రభుత్వ నిబంధనలు మరియు సేవా నియమాలు అవసరాలకు అనుగుణంగా నిర్వహించబడుతున్నాయని మరియు సదరు ఫిర్యాదు నందు పేర్కొనిన విధముగా స్వర్ణ వార్డు సెక్రెటరీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని, ఇటువంటి నిరాధార అభియోగములు పురపాలక సంఘ ప్రతిష్ఠను దెబ్బతీయడంతో పాటు ఉద్యోగుల్లో అనవసర అపోహలు మరియు గందరగోళం సృష్టించేవిగా ఉన్నాయని పేర్కొనియున్నారు.ఈ నిరసన కార్యక్రమము నందు పురపాలక సంఘ మునిసిపల్ ఇంజనీర్, మునిసిపల్ హెల్త్ ఆఫీసరు, అకౌంట్స్ ఆఫీసరు మరియు శాఖాధిపతులు, అందరూ పురపాలక సంఘ ఉద్యోగులు మరియు స్వర్ణ వార్డు సెక్రెటరీలు,పురపాలక సంఘ ఉద్యోగులు మరియు స్వర్ణ వార్డు సిబ్బంది పాల్గొన్నారు.



## డెంగ్యూ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలి

**సహాయ మలేరియా అధికారి ప్రభాకర్‌రెడ్డి**

తెనాలి, జులై28(ప్రభాతవార్త): డెంగ్యూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండటం వల్ల వ్యాధులబారిన పడకుండా దూరంగా ఉండవచ్చని సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి తెలిపారు. పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో గల సహాయ మలేరియా అధికారి కార్యాలయంలో డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమం గురించి సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు .ఈ సమావేశంలో క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు, మలేరియా సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ డెంగ్యూ వ్యాధి లక్షణాలు వాటి నివారణ చర్యల గురించి కరపత్రములు, సమావేశముల ద్వారా అవగాహన కల్పిస్తూ ప్రజలలో ఈ వ్యాధిపై చైతన్యం తీసుకుని వచ్చి అందరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని తెలియజేశారు.తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, డెంగ్యూ వ్యాధి వైరస్ వలన వస్తుందని, కానీ ఒకరి నుంచి ఒకరికి దోమ కాటు వలన వ్యాప్తి చెందుతుందని తెలిపారు. డెంగ్యూని ప్రారంభ దశలో గుర్తించినట్లయితే సులువుగా చికిత్స చేసి పూర్తిగా నయం చేయవచ్చునని ప్రజల సొంత వైద్యము చేసుకొనుట ద్వారా ఈ వ్యాధి తీవ్రత పెరిగి ఆసుపత్రిలో చేరే పరిస్థితి వస్తుందని తెలిపారు. డెంగ్యూ వ్యాధిలో జ్వరము, తలనొప్పి, కండరాల నొప్పులు, కనుగుడ్లు నొప్పులు, ఒంటిపై దద్దురు ఒంటి లక్షణాలు కనబడతాయని అరుదుగా కొంతమందిలో చిగుళ్ల వెంట ముక్కు నుండి రక్తము కారుతుంటుందని,ఈ లక్షణాలు ఎవరికైనా



కనిపించినట్లయితే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో తగు పరీక్షలను చేయించుకొని వైద్యాధికారి గారి సలహా మేరకు తగు మందులను ఉచితంగా పొందవచ్చునని తెలిపారు . మలేరియా గ్రామీణ సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ, ఏడిస్ దోమ కాటు వలన ఈ వ్యాధి ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు . ఈ దోమ ఎక్కువగా మంచినీటిలోనూ,వర్షపు నీటిలోను గుడ్లు పెడుతుందని తద్వారా తన సంతతిని పెంచుకుంటుందని తెలిపారు.కనుక ప్రజలు వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఈ డెంగ్యూ మాసోత్సవములు ప్రజలలో అవగాహన కల్పించి, ప్రజలను భాగస్వాములను చేసి తద్వారా వ్యాధిని అరికట్టాలనే ఉద్దేశంతో ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. దోమలు ముఖ్యంగా ఇంటి బయట తొట్లు గాబులు, పూల కుండీలు, పనికిరాని ప్లాస్టిక్ సామాన్లు, మూతలు లేని ఓవర్ హెడ్ ట్యాంకులు,టైర్లు,కొబ్బరి బొండాలు వంటి ప్రదేశాలను ఇంటి లోపల ఫ్రిజలు , కూలర్లలో గల నీటిలో దోమలు గుడ్లను పెడతాయని తెలిపారు . దోమల నీటిలో గుడ్లు పెట్టిన దగ్గర నుంచి 8 నుంచి 10 రోజులలో పెద్ద దోమగా మారుతుందని, కనక ప్రజలు వారానికి ఒకసారి అనగా శుక్రవారం ను డ్రైడేగా పాటించాలని కోరారు. తెనాలి యుయల్ బి ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమోళి మాట్లాడుతూ, ప్రజల అవగాహన మరియు భాగస్వామ్యంతోనే దోమల ద్వారా వ్యాపించే అన్ని వ్యాధుల వ్యాప్తిని అరికట్టుటకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ప్రజలు దోమకాటుకు గురికాకుండా సాయంత్రం సమయాలలో తలుపులు కిటికీలు వేసుకొని ఉండుట , దోమతెరలు వాడుట , పూర్తి వస్త్రధారణ ధరించుట వంటి జాగ్రత్తలను తీసుకోవాలని, నీటి నిలవలపై తప్పక మూతలు పెట్టి ఉంచాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఫైలేరియా సీనియర్ హెల్త్ ఇన్స్పెక్టర్ గుద్దంటి రవికుమార్, మలేరియా సూపర్వైజర్లు దీపాల శ్రీనివాసరావు దాసరి శివ నాగమల్లేశ్వరరావు , తిరువీధులశివరామ ప్రసాద్ , మలేరియా ఆరోగ్య కార్యకర్తలు నవీద్ ,రషీద్ , శరత్ వేణుగోపాల్ , శ్రీనివాసరావు, భాషిద్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**-విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య**

పొన్నూరు, జూలై 28,ప్రభాతవార్త: విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తే తాను ఎక్కువగా సంతోషిస్తానని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో విద్యార్థుల ఆధ్వర్యంలో రత్తయ్య జన్మదిన



వేడులకను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులతో తనకున్న అనుబంధం మాటల్లో వర్ణించలేనిదన్నారు. అందుకోసమే ప్రతి ఏటా నా పుట్టిన రోజును విద్యార్థుల మధ్య జరుపుకోవడానికి ఇష్టపడతానన్నారు. సాధారణ ఆలోచనలతో కాకుండా క్రియేటివ్‌గా ఆలోచిస్తేనే విజయం సాధించగలరని విద్యార్థులకు సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలోనే విద్యార్థులు సరైన దివగా ఎదగ గలరనే సిద్ధాంతాన్ని తాను మొదటి నుంచి నమ్ముతున్నానని చెప్పారు. అదే సూత్రాన్ని తాము ప్రతి పాఠశాల, కళాశాలల్లో అమలు చేస్తున్నామన్నారు. కాబట్టే తమ విద్యార్థులు ఎన్నో అద్భుతాలు చేయగలుగుతున్నారని పేర్కొన్నారు. తమ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విజ్ఞాన్ సిబ్బంది కురిపిస్తున్న అభిమానం వల్లనే తాను మరింత ఉత్సాహంగా శ్రమించడానికి కావాల్సినంత శారీరక శక్తిని, మానసిక శక్తిని ఇస్తున్నాయన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్‌లోని ప్రతిమా క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ టీ.అవినాష్, విజ్ఞాన్స్ వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్‌పర్సన్ ఎల్.రాణి రుద్రమదేవి, వర్సిటీ వీసి కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, అడ్వైజర్ డాక్టర్ మాలకొండయ్య, సమన్వయకర్త గుదిమెళ్ళ శ్రీకూర్మనాథ్, లారా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జే.మోహనరావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సహస్ర ఘటాభిషేకం



పొన్నూరు, జూలై 28,ప్రభాతవార్త: ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఉండడంతో దేవాదాయధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక సహస్రలింగేశ్వరస్వామివారి దేవాలయంలో వరుణ జపం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు సహస్ర ఘటాభిషేకంలో పాల్గొని కలశాలతో స్వామివారికి అభిషేక జలాన్ని అందజేశారు. భగవంతుడు కరుణ చూపి వర్షాన్ని కురిపించాలని వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి ఆరికాటి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ జిఎంఎస్ గుప్తా, సభ్యులు కత్తుల రవికిరణ్, కలపాల విజయలక్ష్మి, రాంబాబు, వాసంతి తదితరులున్నారు.

29-7Pg5_29-7Pg5.qxd 28/Jul/26 10:30 PM Page 1



# విద్యార్థుల నిరసనల హింసపై సిట్




## రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో విచారణ: సుప్రీం కోర్టు

### కేంద్రం, ఢిల్లీ, బీహార్, బెంగాల్, అసోం, కేరళం రాష్ట్రాలకు నోటీసులు

### నేర చరిత్ర లేని నిర్బంధిత మైనర్ల విడుదలకు ధర్మాసనం ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 28:** గతవారం దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా విద్యార్థులు, పోలీసు అధికారులు గాయపడ్డారన్న ఆరోపణలపై నిష్పక్షపాతమైన, స్వతంత్ర విచారణ జరగాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఈ విచారణ కోసం సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని కోర్టు సూచించింది. ఈ విషయంపై తమ స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వంతో పాటు ఢిల్లీ, అసోం, బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. నిరసనలలో పాల్గొన్నందుకు అరెస్టు చేయబడిన లేదా నిర్బంధించబడిన, ఎలాంటి నేర చరిత్రలేని 18 యేళ్ల లోపు పిల్లల విడుదలకు సంబంధించి కోర్టు ముఖ్యంగా పలు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అన్ని సిసిటివి ఫుటేజ్, డ్రోన్ ఫుటేజ్, బాడీవోర్న్ కెమెరా రికార్డింగ్‌లు, వైర్‌లెస్ కమ్యూనికేషన్, పిసిఆర్ లాగ్‌లను భద్రపరచాలని కోర్టు ఆదేశించింది. అంతేకాకుండా, నిరసనకారుల వ్యక్తిగత సమాచారం, డిజిటల్ డేటాను భద్రపరచాలని, ప్రస్తుతానికివాటిని బహిరంగంగా వెల్లడించకూడదని రాష్ట్రాలను కోర్టు ఆదేశించింది. నిరసనకారుల వ్యక్తిగత డేటా లేదా వివరాలను ప్రచురించకూడదు. విద్యార్థులకు ఎలాంటి నేర చరిత్ర లేనంత వరకు, నిరసనల విషయంలో వారిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని కూడా కోర్టు ఆదేశించింది. జులై 20నుంచి దేశవ్యాప్తంగా పరీక్షాపత్రాల లీకేజీలు, ఇతర వ్యవస్థాగత అవకతవకలకు వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న విద్యార్థులపై పోలీసులు క్రూరంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ దాఖలైన పలు పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచా రించింది. గాయపడిన పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధుల తరఫున దాఖలైన పిటిషన్లను కూడా కోర్టు విచారించింది. "పిటిషనర్లు చేసిన ఆరోపణలు ప్రాథమికంగా స్వతంత్ర, నిష్పక్షపాత విచారణకు ఆస్కారం కల్పిస్తున్నాయి. అటువంటి విచారణ ఆరోపణలను సమంర్థవంతంగా పరిష్కరిస్తుంది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్లను తదుపరి విచారణ ఆగస్టు 3కు వాయిదా వేసింది.

## నీట్ ఇడబ్ల్యుఎస్ కోటాపై సుప్రీం కీలక ఆదేశాలు

### వార్షిక కుటుంబ ఆదాయం సహేతుకంగా లేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ, జులై 28:** నీట్ ప్రవేశాల కోసం ఆల్ ఇండియా కోటా (ఎఐక్యూ)లో ఆర్థికంగా బలహీన వర్గాల (ఇడబ్ల్యుఎస్) రిజర్వేషన్ కింద అర్హతను నిర్ణయించడానికి నిర్దేశించిన రూ.8 లక్షల వార్షిక కుటుంబ ఆదాయ ప్రమాణాన్ని సవాలు చేయడాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ పరిమితి ప్రాథమికంగా సహేతుకమైన ప్రమాణంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. పాండే కమిటీ సిఫార్సుల మేరకు రూపొందించిన రూ.8 లక్షల వార్షిక ఆదాయ పరిమితి, ప్రమాణాల రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను మంగళవారం జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం విచారించింది. విచారణ సందర్భంగా నీట్ ఈడబ్ల్యూఎస్ కోటా ఆదాయ పరిమితిపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నీట్ ఆలిండియా కోటాలో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల అర్హతకు నిర్దేశించిన రూ.8 లక్షల వార్షిక కుటుంబ ఆదాయ పరిమితి ప్రాథమికంగా సమంజసంగానే ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏ ప్రాతిపదికన మీరు దీన్ని సవాలు చేస్తున్నారు?' అని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. పాండే కమిటీ సిఫార్సు చేసిన మార్పులను కేంద్ర ప్రభుత్వం ఇంకా పూర్తిగా అమలు చేయలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది తన్వీ దూబే కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దేశవ్యాప్తంగా దాఖలైన ఇలాంటి పిటిషన్లన్నింటినీ క్రోడీకరించి, వాటిలోని ప్రధానాంశాలతో ఒక సమగ్రమైన చార్ట్ తయారు చేయాలని ధర్మాసనం తన్వీ దూబేను ఆదేశించింది. తదుపరి విచారణను కోర్టు ఆగస్టు 11వ తేదీకి వాయిదా వేసింది.

## కోర్టు విచారణ విడియోలను అనుమతి లేకుండా సోషల్ మీడియాలో పోస్టు చేస్తే కఠిన చర్యలు: సుప్రీంకోర్టు హెచ్చరిక

**న్యూఢిల్లీ, జులై 28:** సుప్రీంకోర్టు లేదా సంబంధిత హైకోర్టు నుండి ముందస్తు అనుమతి లేకుండా, కోర్టు విచారణల ఆడియో, వీడియో రికార్డింగ్‌లను సోషల్ మీడియా, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో పోస్ట్ చేయడం, రీపోస్ట్ చేయడం, అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం లేదా నిల్వ చేయడాన్ని సుప్రీంకోర్టు నిషేధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వును జారీ చేసింది. అయితే, ఈ ఉత్తర్వు న్యాయపరమైన విచారణల నిష్పక్షపాతమైన, కచ్చితమైన వార్తా నివేదనను ప్రభావితం చేయదని కోర్టు స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో ఎడిట్ చేసి, కత్తిరించిన వీడియోలను ప్రచారం చేయడం ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయబడిన కోర్టు విచారణలను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలకు సంబంధించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై విచారణ జరుపుతూ, భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చి మరియు వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేసింది. ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వంతోపాటు ప్రతివాదులకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. అయితే, మీడియా సంస్థలకు మాత్రం కోర్టు కేసులపై రిపోర్టింగ్ చేయడంపై ఎలాంటి ఆంక్షలు ఉండవని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

## ఎక్కువ కెఫిన్ ఉన్న పానీయాలు ఎనర్జీడ్రింక్స్‌గా బ్రాండింగ్ చేయొద్దు: ఎఫ్ఎస్ఎస్ఎఐ హెచ్చరికలు

**న్యూఢిల్లీ,జులై 28:** అధిక కెఫిన్ కలిగిన పానీయాలను ఎనర్జీ డ్రింక్స్‌గా ప్రచారం చేయవద్దని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. పెప్సీ, రెడ్ బుల్, మాన్‌స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల లేబుళ్ల నుంచి ఎనర్జీ డ్రింక్ అనే పదాన్ని, దానికి సంబంధించిన వర్ణనలను 90రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. భారత్‌లో ఎనర్జీ డ్రింక్స్ పేరిట విక్రయిస్తున్న ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రమాణాలు లేవని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ఇటీవల పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈఓ రజిత్ పున్హానీ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఈ క్రమంలో నిబంధనలకు కట్టుబడి ఉంటామని కంపెనీలు అంగీకరించడంతో, లేబుళ్ల మార్పునకు సంబంధించి ప్రభుత్వం 90 రోజుల గడువు ఇచ్చింది.

# విద్యాశాఖ బాధ్యతలు జోషికి ఎలా ఇస్తారు?

### అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తికి ఆపదవి ఇవ్వడమా?: రాహుల్ ఫైర్

### విద్యార్థులపై గన్స్ పేల్చమని ఆదేశించిందెవరు: ప్రియాంక



**న్యూఢిల్లీ,జులై 28:** నూతన కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తిని విద్యాశాఖ మంత్రిగా నియమించడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు విద్యార్థుల నిరసనల నేపథ్యంలో ప్రధాని మోడీ ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ బాధ్యతలు అప్పగించిన నిర్ణయాన్ని ప్రశ్నించారు. దేశంలో యువత విద్యా వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేస్తోంది. ఎంతో మంది విద్యార్థినులు ఆందోళనల్లో పాల్గొన్నారు. వారిపై దాడులు జరిగాయి. అలాంటి సమయంలో అత్యాచార నిందితులను సమర్థించే వ్యక్తిని బీజేపీ విద్యాశాఖ మంత్రిగా నియమించింది. అలాంటి వ్యక్తి కంటే నీచమైన వ్యక్తి మరొకరు ఉండరు. అత్యాచార నిందితులకు రక్షణ కల్పించాలనే వ్యక్తే ఇప్పుడు భారత విద్యాశాఖ మంత్రి అని రాహుల్ గాంధీ ఆరోపించారు. అంతేకాకుండా ప్రధాని మోడీ నిర్ణయంపై కూడా విమర్శలు చేశారు. ప్రధాని స్పందన చాలా విచిత్రంగా ఉంది. ఆయన మంత్రి వర్గంలో ఎంతో మంది మంత్రులు ఉన్నారు. వారిలో ఎవరినైనా ఎంపిక చేసుకోవచ్చు. కానీ అత్యాచార నిందితులను రక్షించే వ్యక్తినే ఎంపిక చేశారు. ఇది నిజంగా ఆశ్చర్యకరమైన విషయమని అన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం లేదా ప్రహ్లాద్ జోషి నుంచి అధికారిక స్పందన వెలువడలేదు.

**పార్లమెంటులో జోషిపై ప్రియాంక సంచలన విమర్శలు:** ఇదిలా ఉంటే పార్లమెంటులో నీట్ అక్రమాల కట్టడి బిల్లుపై జరుగుతున్న చర్చలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ, విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. గర్భవతిపై అత్యాచారం చేసిన నిందితుల్ని ఆయన సమర్థించారని ఆరోపించారు. అత్యాచార నిందితులకు బెయిల్ వస్తే ఆయన ఆనందించారన్నారు. ఈ వ్యాఖ్యల్ని కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు తీవ్రంగా ఖండించారు. ప్రియాంకా గాంధీ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇదిలాఉంటే, ప్రధానిపై కూడా ప్రియాంకాగాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని కెమెరా యాంగిల్‌కాదు, మనసు యాంగిల్ మార్చుకోవాల న్నారు. ఇన్‌స్టాగ్రామ్ క్లిప్ కోసం కెమెరా యాంగిల్ మార్చినంత మాత్రాన జెన్ జీ నమ్మకాన్ని గెలుచుకోలేరని అన్నారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే 47, పెల్లెట్ గన్స్ కాల్చుమని ఎవరు ఆదేశించారని ప్రధాని మోడీని, అమిత్ షాను ప్రశ్నించారు.

# బీహార్, అసోంలో నీట్ అల్లర్లకేసులు ఎత్తివేత

### ఢిల్లీ నిరసనలపై ఎన్‌హెచ్ఆర్‌సి సీరియస్



**పాట్నా,గువాహతి,జులై 28:** పరీక్షా పత్రం లీకేజీ అవకతవకలపై ఆందోళనలు చేపట్టిన విద్యార్థులకు ఊరట లభించింది. నిరసనకారులపై నమోదైన కేసులను బీహార్, అస్సాం ప్రభుత్వాలు ఉపసంహరించుకున్నాయి. అరెస్టయిన వారిని విడుదల చేయాలని, భవిష్యత్తులో ఎలాంటి చర్యలు ఉండవని నిర్ణయించాయి. నీట్ ఆందోళనలకు సంబంధించి నిరసనకారులపై నమోదు చేసిన కేసులన్నింటినీ ఉపసంహరించుకుంటామని, వివిధ ఆరోపణల కింద జైలు పాలైన వారిని విడుదల చేస్తామని బీహార్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈనెల 26న సాయంత్రం 6 గంటలకు ముందు జరిగిన నిరసనల్లో పాల్గొన్న ఏ వ్యక్తిపైనా ప్రభుత్వం ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోదని పేర్కొంది. అలాగే అస్సాంలో 26 నాటికి నమోదైన 5 కేసుల్లో అరెస్టైన 13 మందితో పాటు, ఇరు రాష్ట్రాల్లో అదుపు లోకి తీసుకున్న నిరసనకారులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. ఈ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులతో చర్చించిన కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు స్పష్టమైన హామీ ఇచ్చారు. అస్సాం, బీహార్ తరహాలోనే రాజస్థాన్‌లోనూ విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకుంటామని తెలిపినట్లు సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ వెల్లడించారు.

**ఎన్‌హెచ్ఆర్‌సీ సీరియస్:** నీట్‌యూజీ పరీక్ష పేపర్ లీకేజీపై ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో విద్యార్థులు చేపట్టిన నిరసనలో విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడం పట్ల జాతీయ మానవహక్కుల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు లాఠీచార్జ్ ఘటనను సుమోటోగా స్వీకరించింది. ఘటన సమయంలో సీసీటీవీ ఫుటేజ్ అందజేయాలని సంబంధింత అధికారులను ఆదేశించిది. రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసింది.


# ప్రధాని కోసం ధర్మేంద్ర ప్రధాన్ బలయ్యారు

### లోక్‌సభలో ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్



**న్యూఢిల్లీ,జులై 28:** పార్లమెంట్‌లో మంగళవారం యాంటీ పేపర్ లీక్ బిల్లుపై వాడీవేడి చర్చ నడుస్తోంది. ప్రతిపక్షాలు బీజేపీని విమర్శిస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రధాన్‌ను తొలగించి ప్రధాన మంత్రిని కాపాడారు అంటూ సెటైర్లు వేశారు. ప్రధాని కోసం ధర్మేంద్ర ప్రధాన్‌ను బలిపశువు చేసినట్లు ఆరోపించారు. విద్యార్థి ఉద్యమం ప్రభుత్వం మెడలు వచ్చిందని అన్నారు. రాజీనామా తర్వాత ధర్మేంద్ర ప్రధాన్ పార్లమెంట్‌కు వచ్చినప్పుడు బీజేపీ ఎంపీలు ఘనంగా స్వాగతించాయని, ఆయన తొలగింపు ఎంత పెద్ద సంక్షోభం నుంచి బయపడేసిందో ఊహించండి అని అఖిలేష్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని తల వంచేలా చేసిన యువత ధైర్యసాహసాలను అఖిలేష్ ప్రశంసించారు. ప్రపంచం వంగుతుంది, దానిని వంచే వ్యక్తి ఉండాలి. ప్రభుత్వం ఎప్పటికీ తలవంచదనను కుంది, కానీ యువత ఐక్యత ముందు ప్రభుత్వం వెనక్కి తగ్గి మంత్రితో రాజీనామా చేయించింది అని అన్నారు. తల్లిదండ్రుల మద్దతు పొందిన తొలివిద్యార్థి ఉద్యమం ఇదే అని ఆయన అన్నారు. ప్రభుత్వం భయపడినప్పుడే డిమాండ్లను అంగీకరిస్తుందని, రైతుల ఉద్యమ సమయంలో ఎన్నికలు సమీపించడంతో మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని గుర్తు చేశారు. బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థ,యూనివర్సిటీలనను దెబ్బతీసిం దని ఆయన ఆరోపించారు. విద్యావ్యవస్థకు ఒకే రంగు వేయాలని బీజేపీ ప్రయత్నించిందని, అందుకే విద్యార్థుల్లో ఆగ్రహం పెరిగిందని, భారీ ఉద్యమంగా మారిందని,చివరకు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీ కూడా వెనక్కి తగ్గాల్సి వచ్చిందని అన్నారు. దళితులు, వెనకబడిన వర్గాల ఉద్యోగ హక్కుల్ని ప్రభుత్వం హరిస్తుందని ఆరోపించారు.

# కృత్రిమ సూర్యుడి కోసం అతిపెద్ద అయస్కాంతం ఆవిష్కరించిన చైనా



**బీజింగ్, జులై 28:** సమస్త జీవకోటికి ఆధారం, గ్రహాల్లో ప్రధానం సూర్యుడు. అలాంటి సూర్యుడిని కృత్రిమంగా సృషించాలని చైనా భావిస్తున్నది. దీనిలో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ ఫ్యూజన్ అయ స్కాంతాన్ని రూపొందించింది. విజయవంతంగా పరీక్షించింది. దీనిలో ఉన్న టెక్నాలజీ ప్రపం చంలోని విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ఉప యోగపడుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు. చైనా కృత్రిమ సూర్యుడి ప్రాజెక్టులో భాగంగా 2030 నాటికి ఫ్యూజన్ ద్వారా విద్యుత్ అవసరాలను తీర్చేందుకు ప్రపంచంలోనే అతిపెద్ద 582 టన్నులు గల అయస్కాంతాన్ని రూపొం దించింది. అణు సంలీనం ద్వారా అపరిమితమైన శక్తిని ఉత్పత్తి చేయడానికి ఈ అతిపెద్ద అయ స్కాంతం కీలకం. దీన్ని విజయవంతంగా పరీక్షించి కృత్రిమ సూర్యుడిని సృష్టించాలనుకున్న చైనా లక్ష్యానికి ముందడుగు పడినట్లు అయ్యింది. 21 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు గల 'డి' ఆకారంతో ఈ అయస్కాంతాన్ని చైనీస్‌అకాడమీకి చెందిన ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ అభివృద్ధి చేసింది.

**కృత్రిమ సూర్యుడు అంటే?** అచ్చం సూర్యుడి లాగే పనిచేసే న్యూక్లియర్ ఫ్యూజన్ రియాక్టర్‌ను కృత్రిమంగా నిర్మించడం. సూర్యుడిలో 100 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత వద్ద ప్రతి క్షణం కొన్ని కోట్ల హైడ్రోజన్ అణువులు సంలీనం చెంది కార్బన్ డయాక్సైడ్ రహిత అపారమైన శక్తి విడుదలవుతుంది. ఇలాంటి ప్రక్రియనే భూమిపై సృష్టించి విద్యుత్‌గా మారిస్తే స్వచ్ఛమైన, సురక్షితమైన, పర్యావరణహితమైన శక్తిని పొందవచ్చు.

# భార్యను హత్యచేసి అత్తమామలకు విడియో కాల్‌లో చూపించిన భర్త



**భాగల్‌కోట్,జులై 28:** కర్ణాటకలో ఒక కిరాతక ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్యను అతి దారుణంగా హత్య చేయడమే కాకుండా, ఆమె ప్రాణాలు విడుస్తున్న దృశ్యాలను నిందితుడు వీడియో కాల్ ద్వారా అత్తమామలకు చూపించాడు. బాగల్‌కోట్ జిల్లాలో వెలుగుచూసిన ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. వివరాల్లోకి వెళితే, బిళగి పోలీస్ స్టేషన్ పరిధిలోని గలగలి గ్రామానికి చెందిన ప్రవీణ్ జిగలూర్, భాగ్యశ్రీ (23) దంపతులు. భార్యపై అనుమానంతో ప్రవీణ్ తరచూ గొడవ పడేవాడు. భర్త వేధింపుల తాళలేక భాగ్యశ్రీ రెండు నెలల క్రితమే పుట్టింటికి వెళ్లిపోయింది. గతాన్ని మర్చిపోయి అన్యోన్యంగా ఉందామని నమ్మబలికిన ప్రవీణ్ ఆదివారం ఆమెను తిరిగి తన ఇంటికి తీసుకువచ్చాడు. ఇంటికి వచ్చిన అదే రోజు సాయంత్రం ఆమెపై దాడి చేసి అత్యంత దారుణంగా హత్య చేశాడు. అంతటితో ఆగకుండా, ఆమె మరణిస్తున్న చివరి క్షణాలను మొబైల్‌లో రికార్డ్ చేయడమే కాకుండా, నేరుగా ఆమె తల్లిదండ్రులకు వీడియో కాల్ చేసి చూపించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆ వీడియోను మరికొందరికి కూడా షేర్ చేసినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకితీసుకున్నారు. తల్లిదండ్రులు ఆవేదన చూసి స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




# ఐరోపాను నవంబరు దాకా దహించనున్న కార్చిచ్చు

### స్పెయిన్‌లో లక్షా 25 వేల ఎకరాలకుపైగా అటవీప్రాంతం అగ్నికి ఆహుతి

**ప్యారిస్, జులై 28:** ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఫ్రాన్స్‌లో 420 చదరపు కిలోమీటర్లకు పైగా,స్పెయిన్‌లో 1,25,000 ఎకరాలకు పైగా అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. గిరాండ్ ప్రాంతంలో కోట్ల విలువ చేసే 240కిపైగా విలాసవంతమైన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఫ్రాన్స్‌లో ఈ భారీ కార్చిచ్చు నవంబరు మొదటి వారం వరకూ కొనసాగవచ్చని యూరోపియన్ యూనియన్ అధికారులు హెచ్చరించారు. ఐరోపాలో అగ్నికీలల వల్ల ఈ యేడాది అత్యంత ఘోరమైన సంవత్సరాలలో ఒకటిగా నిలిచిపోతుందన్నారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతుండడంతో ఫ్రాన్స్, స్పెయిన్, గ్రీస్‌లలో కార్చిచ్చుల ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

**అగ్ని సుడిగుండాలు వచ్చే ప్రమాదం**

శుక్రవారం సాయంత్రం ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లో ప్రారంభమైన ఈ అగ్నికీలలు పలు నగరాలకు వేగంగా వ్యాపిస్తున్నాయి. దీంతో ఫ్రాన్స్‌పై భారీ పొగ మేఘాలు కమ్ముకున్నాయి. దీంతో వీటిని ఆర్పడం సవాలుగా మారింది. కార్చిచ్చును ఎదుర్కోవడానికి యూరోపియన్ కమిషన్ సమన్వయంతో ఫ్రాన్స్‌కు ఏడు అగ్నిమాపక విమానాలు, నాలుగు హెలికాప్టర్లు, స్పెయిన్‌కు ఆరు విమానాలు, మూడు అగ్నిమాపక బృందాలను పంపారు. భారీగాలులు, ఉరుములు, మెరుపులతో ఇవి అగ్ని సుడిగుండాలుగా మారే ప్రమాముందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

**రోడ్లపైకి జంతువులు :** మంటలు వేగంగా వ్యాపిస్తుండడంతో ఫ్రాన్స్‌లో సుమారు 2లక్షల మంది, స్పెయిన్‌లో లక్ష మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అడవుల్లోని జంతువులు మంటల వేడిని తాళలేక రోడ్లపైకి పరుగులు తీస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పెంపుడు జంతువులను కూడా ప్రజలు బయటకు వదిలేస్తున్నారు. రాబోయే రెండు వారాల్లో పరిస్థితులు మరింత కఠినంగా ఉంటాయని వీటిని కలిసికట్టుగా ఎదుర్కోవాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేట్ మెక్రాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. అగ్నికీలలు ఆర్పడానికి వేలమంది సిబ్బంది పనిచేస్తున్నారని, వందల సంఖ్యలో హెలికాప్టర్లతో నీళ్ల వెదజల్లుతున్నారని తెలిపారు. దేశంలోని అనేకప్రాంతాల్లో ప్రజలు గాలి కాలుష్యం సమస్యను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

# రూ.52,676 కోట్ల పరిహారానికి అంగీకారం



**న్యూయార్క్, జులై 28:** తమ బేబీ పౌడర్, ఇతర టాల్క్ ఉత్పత్తులు అండాశయ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయని ఆరోపిస్తూ దాఖలైన పదివేల వ్యాజ్యాలను పరిష్కరించేందుకు 5.5 బిలియన్ డాలర్ల (రూ.52,676 కోట్లు) పరిష్కారానికి చేరుకున్నట్లు జాన్సన్ అండ్ జాన్సన్ తెలిపింది. ఈ పరిష్కారం ఫెడరల్ కోర్టులో ఏకీకృతం చేయబడిన సుమారు 69,000 కేసులను, రాష్ట్ర కోర్టులోని సంబంధిత కేసులను పరిష్కరిస్తుందని, ఇది మిగిలిన టాల్క్ క్లెయిమ్‌లలో 99.75శాతానికి సమానమని జె అండ్ జె తెలిపింది. దశాబ్దకాలంగా సాగిన కోర్టు పోరాటం తర్వాత ఇది ఒక మంచి పరిష్కారమని పేర్కొంటూ, వాదుల న్యాయ సంస్థలు ఈ ఒప్పందాన్ని ధ్రువీకరించాయి. టాల్క్ ప్రత్యేకంగా తమ అండాశయ క్యాన్సర్‌కు కారణమైందని నిరూపించగల వ్యక్తిగత వాదుల సామర్థ్యంపై ఒక ఫెడరల్ న్యాయమూర్తి సందేహం వ్యక్తం చేయడంతో, సుదీర్ఘకాలంగా సాగుతున్న ఈ న్యాయ పోరాటంలో గత వారం జె అండ్ జె కోర్టు విజయాన్ని సాధించింది. టాల్క్ సురక్షితమైనదని,అందులో ఆస్బెస్టాస్ లేదని చెబుతూ, తమ టాల్క్ ఉత్ప త్తుల వల్ల క్యాన్సర్ వస్తుందన్న ఆరోపణలను జె అండ్ జె ఖండించింది. ఈ కంపెనీ 2020లో అమెరికాలో టాల్క్ ఆధారిత బేబీ పౌడర్ అమ్మ కాలను నిలిపివేసి, కార్న్‌స్టార్చ్ ఉత్పత్తికి మా రింది. ఒక షెల్ కంపెనీ దివాలా ద్వారా వ్యాజ్యా లను పరిష్కరించడానికి జె అండ్ జె పదేపదే ప్రయత్నించగా, మూడేళ్లకు పైగా నిలిపివేసిన ఈ

# సంక్షిప్త వార్తలు

## కేసుల భయంతో మాస్కులతో పాల్గొన్న విద్యార్థులు..




**న్యూఢిల్లీ,జులై 28:** నీట్‌యూజీ పేపర్ లీక్ వ్యవహారంతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో కొత్త ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసు కేసులకు భయపడి చాలా మంది విద్యార్థులు మాస్కులు, కళ్లద్దాలతో తమ గుర్తింపును దాచుకుంటున్నారు. పోలీసులు ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల నిఘానే దీనికి ప్రధాన కారణం. నిరసనలో పాల్గొన్న తమపై ఎఫ్ఐఆర్ నమోదైతే భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, పాస పోర్ట్‌జారీ, విదేశీ విద్యఅవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

## మోడీ ఇన్‌స్టా విడియోలకు 105 మిలియన్ల ఫాలోయర్లు..



**న్యూఢిల్లీ,జులై 28:** ప్రధాని నరేంద్రమోడీ ఇన్‌స్టాగ్రామ్‌లో రికార్డులు సృష్టిస్తున్నారు. ఇటీవల, నీట్ పేపర్‌లీక్ వివాదం, నిరసనల సమయంలో ఆయన పోస్ట్ చేసిన వీడియో ఏకంగా మిలియన్ల కొద్దీ వ్యూస్ వచ్చాయి. ఈ వీడియో తర్వాత ప్రధానికి ఏకంగా 40 లక్షల మంది కొత్త ఫాలోవర్లు పెరిగారు. ఇప్పుడు మొత్తం ఆయన ఇన్‌స్టా ఫాలోవర్లు 105 మిలియన్లు (10.5కోట్లు)కు చేరుకుంది. కేవలం గత వారంరోజుల్లోనే నాలుగు మిలియన్ల మంది ఆయనను ఫాలో అవుతున్నారు. వారం క్రితం మోడీకి 101 మిలియన్ల(10.1కోట్ల) మంది ఫాలోవర్లు ఉండగా, ప్రస్తుతం ఇది 105 మిలియన్లను అధిగమించింది.

## విస్కాన్సిన్ రాష్ట్రాన్ని వణికించిన టోర్నడో..



**వాషింగ్టన్, జులై 28:** అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రాన్ని సోమవారం తీవ్రమైన టోర్నడో వణికించింది. ఈ టోర్నడో ధాటికి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి.దాంతో విస్కాన్సిన్‌తోపాటు అమెరికా మధ్య పశ్చిమప్రాంతంలోని పలు రాష్ట్రాల్లో 3.9లక్షల ఇళ్లకుపైగా విద్యుత్ సరఫరా కోల్పోయి నట్లు అధికారులు వెల్లడించారు. మెనాషా, యాపిల్‌టన్ నగరాలపై ఇది తీవ్ర ప్రభావాన్ని చూపిందని తెలిపారు. టోర్నడో ధాటికి ఇళ్ల పైకప్పులు ఎగిరిపో యాయి. భారీ వృక్షాలు నేలకూలాయి. మరోవైపు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 20 నిమిషాలపాటు టోర్నడో విధ్వంసం సృష్టించిందని అధికారులు తెలిపారు.

## అంతర్జాతీయ విద్యార్థులకు పిజి వర్క్ పర్మిట్లు తిరస్కరణ

**వాంకోవర్,జులై 28:** కెనడాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులతో సహా పలువురు అంతర్జాతీయ విద్యార్థుల పోస్ట్‌గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్లు తిరస్కరణకు గురికావడం, దానికి నిరసనగా విద్యార్థులు ఆందోళనలు చేపట్టడంపై ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా స్పందించింది. విద్యార్థులు చదువుకునే సమయంలో పనిచేయడానికి వర్తించే నిబంధనలపై కీలక స్పష్టతనిస్తూ తీవ్ర హెచ్చరికలు జారీచేసింది. స్టడీపర్మిట్ నిబంధనలను అతిక్రమించి అను మతి లేకుండా పనిచేయడం ఇమ్మిగ్రేషన్ చట్టాలను ఉల్లంఘించడమేనని ఐఆర్‌సీసీ స్పష్టం చేసింది.

## మైన్మార్‌లో సైబర్ నేరాలకు పాల్పడితే ఇక మరణశిక్షే..

**నాయ్‌పైథా,జులై 28:** మయన్మార్ పార్లమెంట్ ఆన్‌లైన్ స్కామ్ మోసాలపై ఉక్కుపాదం మోపేందుకు మంగళవారం ఒక నూతన చట్టాన్ని ఆమోదించింది. ఈ 'యాంటీ ఆన్‌లైన్ స్కామ్ బిల్లు' ప్రకారం సైబర్ స్కామ్ సెంటర్లలో ప్రజలను అక్రమంగా బంధించినా, హింసించినా లేదా బలవంతంగా పనిచేయించినా మరణశిక్ష లేదా జీవిత ఖైదు విధించేలా కఠిన నిబంధనలను పొందుపరిచారు. రాజధాని నేపిడాలో ఉభయ సభల సంయుక్త సమావేశంలో ఈ బిల్లుకు పార్లమెంట్ ఆమోదముద్ర వేసినట్లు స్పీకర్ ఆంగ్ లిన్ ద్వే తెలిపారు.

## జమ్ముకాశ్మీర్‌లో ఇంటిపై పడిన బస్సు: 39 మందికి తీవ్ర గాయాలు

**శ్రీనగర్,జులై 28:** జమ్మూ కాశ్మీర్‌లోని గందర్‌బాల్ జిల్లా కంగన్ ప్రాంతంలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న అమర్‌నాథ్ యాత్రికుల బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి నేరుగా ఓ ఇంటిపై పడిపోయింది. ఈ దుర్ఘటనలో కనీసం 39 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.ఘటన జరిగిన సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడం వల్ల పెద్ద ఉపద్రవం తొలిగిపోయింది. బస్సు ఆ ఇంటిపై పడి ఆగిపోవడం వల్లే పక్కనే ప్రవహిస్తున్న సింధు నదిలోకి జారిపడకుండా ఉండిపోయిందని, ఒకవేళ నదిలో పడి ఉంటే ఊహించని రీతిలో నష్టం జరిగేదని అధికారులు భావిస్తున్నారు.

## అంగన్వాడీల పేరుతో విషప్రచారం

- వైసిపి నాయకులపై మంత్రి నారా లోకేష్ మండిపాటు
- 'ఫేక్ వర్సెస్ రియల్' పేరుతో విడియో విడుదల

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** అంగన్వాడీల విషయంలో వైసిపి తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి నారా లోకేష్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే అంగన్వాడీలకు అమ్మఒడి పథకం అందలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లికి వందనం అమలు చేసిందని తెలిపారు. పెనమలూరు నియోజకవర్గంలో తనకు మద్దతుగా అంగన్వాడీలు నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీని వైసిపి నేతలు కావాలనే నిరసన కార్యక్రమంగా చూపుతున్నారని మండిపడ్డారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ "ఫేక్ వర్సెస్ రియల్" పేరుతో వీడియోను విడుదల చేశారు. అంగన్వాడీల పేరుతో విషప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని మంత్రి తెలిపారు. వైసిపి హయాంలో అంగన్వాడీ కార్యకర్తలకు అమ్మఒడి ఇవ్వకుండా గొడ్డలి పార్టీ అన్యాయం చేసిందని మంత్రి మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయడంతో సంతోషంతో నా పెనమలూరు నియోజకవర్గ పర్యటనలో కృతజ్ఞతలు తెలిపారు. గొడ్డలిపోటును గుండెపోటుగా ప్రచారం చేసిన గొడ్డలి పార్టీ అంగన్వాడీల ఈ కృతజ్ఞత ర్యాలీని, నిరసన ర్యాలీ అంటూ విషప్రచారం చేస్తోంది' అని మంత్రి పోస్ట్ చేశారు.

## డిఎస్సీలో భారీ అక్రమాలు: పేర్ని నాని

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయని, అందుకు ఆధారాలున్నాయని వైసిపి నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఆరోపించారు. డిఎస్సీ అవకతవకలపై బహిరంగ చర్చకు రావాలసిందిగా ఆయన లోకేశ్‌కు సవాల్ విసిరారు. ఒకవేళ చర్చకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తే వైసిపి నుంచి జగన్ వస్తారని, లోకేశ్ వస్తే స్వయంగా తానే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. డిఎస్సీ 'పేరుతో' నిరుద్యోగ యువత జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం దీనిని 'మెగా డిఎస్సీ' అని ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, లోపల జరిగిన అక్రమాల వల్ల ఇది దగా డిఎస్సీగా మారిందని మండిపడ్డారు. మంత్రిగా లోకేశ్ విద్యాశాఖ బాధ్యతలను పక్కనబెట్టి మిగిలిన అన్ని శాఖల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. కొంచెమైనా నైతికత ఉంటే ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు, డిఎస్సీ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి మంత్రి పదవికి లోకేశ్ రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం తమ సొంత ప్రచార సాధనాలు, పత్రికల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో లోకేశ్ బోండా ఉమ మంత్రి పదవి కోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారంటూ పేర్కొన్నారు.

## శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన విభాగంలో పద్మావతి వర్సిటీకి అత్యుత్తమ ర్యాంకు



**తిరుపతి, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత ప్రభుత్వ శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన విభాగం న్యూఢిల్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన టెక్నాలజీ ఇన్నోవేషన్ సపోర్ట్ సెంటర్ వార్షిక కార్యకలాపాల సమావేశం జరిగింది. తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అత్యుత్తమ పనితీరుకు ఎక్సలెంట్ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన సమాచార నిర్వహణ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమకి సమన్వయకర్త ఆచార్య పి.జ్యోత్స్న, సహసమన్వయకర్త డాక్టర్ డి.సుజాత అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఆర్.ఉష పాల్గొన్నారు. టిఐఎస్సి ద్వారా నూతన ఆవిష్కరణలతో ముందుకు వచ్చే వ్యక్తులు, స్టార్టప్‌లు సంస్థలకు వారి ప్రాజెక్టుల స్వభావాన్ని బట్టి రూ.2 లక్షల నుండి 10 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని సమన్వయకర్త తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య ఉమ టిఐఎస్సి బృందాన్ని అభినందించి, విశ్వవిద్యాలయానికి ఈ గుర్తింపు తీసుకువచ్చినందుకు ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా వినూత్న ఆవిష్కరణలు, స్టార్టప్‌లు యువఆవిష్కర్తలకు మరింత అవకాశాలను అందించాలని ఆకాంక్షించారు.

**ఎస్వీ ఆయుర్వేద కళాశాల హాస్టల్‌లో వికటించిన భోజనం**

## 28మంది విద్యార్థులకు అస్వస్థత

**తిరుమల, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర (ఎస్వీ) ఆయుర్వేద కళాశాల హాస్టల్‌లో భోజనం వికటించింది. సోమవారం మధ్యాహ్నం ఈ భోజనం తిన్న హాస్టల్ విద్యార్థులు రాత్రి వాంతులు, విరేచనాలతో 28మంది అస్వస్థత గురయ్యారు. వారిని తొలుత టిటిడి కేంద్రీయ వైద్యశాలకు తరలించి వైద్యచికిత్స చేయించారు. వారి ఆరోగ్యం కొంత కుదుటపడిన వారిలో మరికొందరు 11మంది వరకు రాత్రివేళ తీవ్రస్థాయిలో అనారోగ్యానికి గురయ్యారు. వెంటనే అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో 20 మంది బాలికలు, 8 మంది బాలురు ఉన్నారు. వీరిలో 17 మంది బాలికలు, ముగ్గురు బాలురను అంబులెన్స్ ద్వారా మంగళవారం ఉదయం టిటిడి స్విమ్స్‌కు, కేంద్రీయ వైద్యశాలకు తరలించారు. విరేచనాలు, వికారం, స్వల్ప కడుపు నొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్న 20 మంది విద్యార్థులకు ముఖ్య వైద్యాధికారి పర్యవేక్షణలో తక్షణమే అవసరమైన వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుదీక్షిత్, అధ్యాపకులు ఆస్పత్రులకు చేరుకుని వైద్యులతో మాట్లాడారు. చికిత్స పొందుతున్న విద్యార్థులందరూ సానుకూలంగా స్పందించడంతో వారి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగా ఉండటంతో వైద్యులు డిశ్చార్జ్ చేశారు. అనంతరం వారు తిరిగి వసతి గృహాలకు చేరుకుని మధ్యాహ్న భోజనం చేశారు. తుది వైద్య నివేదిక ప్రకారం అస్వస్థతకు గురైన విద్యార్థులందరూ ప్రస్తుతం సురక్షితంగా, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. హాస్టల్‌కు అందించిన భోజనం నాణ్యత లోపించడంతోనే వికటించిందని ప్రాథమికంగా

## షర్మిల ఆరోగ్యం కోసం కాంగ్రెస్ శ్రేణుల పూజలు



**తిరుపతి, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి త్వరగా కోలుకోవాలని అలిపిరి పాదాల మండపం వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలు పూజలు చేశారు. మంగళవారం తిరుపతి అర్బన్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చేర్చుకున్నారు. అనంతరం గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి కోలుకోవాలని ఆ దేవుని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిత్తూరు శివశంకర్, జ్యోతీశ్వర్ నాయక్, వేమూరి కృష్ణమూర్తి, బోయన నరేంద్రబాబు, గౌతం తదితరులు పాల్గొన్నారు.

# గాజువాకలో రూ.2000 కోట్ల విలువైన భూమిని జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తాం

- ఉప సభాపతి, అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణ రాజు



**విజయ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజక వర్గంలో దాదాపు రూ.2000 కోట్ల విలువ చేసే 174.43 ఎకరాల భూమిని బ్యాంకుల జప్తు నుంచి కాపాడేందుకు కృషి చేస్తామని ఉప సభాపతి, అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కె.రఘురామకృష్ణరాజు వెల్లడించారు. మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో రఘురామ అధ్యక్షతన ఫిర్యాదుల కమిటీ సమావేశం జరిగింది. అనంతరం అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు మాట్లాడుతూ ఎపి రిఫ్రాక్టరీస్ సంస్థ పరిశ్రమ నెలకొల్పేందుకు 1981లో రాష్ట్ర ప్రభుత్వం 174.43 ఎకరాల భూమిని కేటాయించగా చేయగా ఆ సంస్థ దివాలా తీయడంతో ప్రస్తుతం ఆ భూమి జప్తునకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఏపి రిఫ్రాక్టరీస్ సంస్థ భూములు విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆర్‌కార్డులు (రీహాబిలిటేషన్ కార్డులు) అంశాలపై అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన ఫిర్యాదుల కమిటీ సమావేశంలో సభ్యులందరితో కలిసి చర్చించామని పేర్కొన్నారు. దీనిపై ఆగస్టు మొదటి వారంలో ఉన్నతాధికారులు, బ్యాంకర్లతో మరోసారి ఫిర్యాదుల కమిటీ సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామనన్నారు. ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, గురజాల జగన్ మోహన్, విష్ణుకుమార్ రాజుతో కలిసి అసెంబ్లీ భవనంలోని ఆయన చాంబరులో మీడియా నిర్వహించారు. ఈ మీడియా సమావేశంలో అసెంబ్లీ ఫిర్యాదుల కమిటీ సభ్యులు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏపీ రిఫ్రాక్టరీస్ సంస్థ దివాలా తీయడంతో జాతీయ రహదారి16కి ఆనుకుని ఉన్న విలువైన భూములు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం ఇచ్చిన భూమిని జప్తు చేసుకునేందుకు చేపడుతున్న ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామన్నారు. అదేవిధంగా స్టీల్ ప్లాంట్‌కు భూములిచ్చిన వారి పునరావాసం కోసం ఇచ్చిన ఆర్‌కార్డులకు సంబంధించి 1203 మందికి రెగ్యులరైజేషన్ పెండింగ్‌లో ఉంచారని వారందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నామని శ్రీనివాసరావు చెప్పారు.

## తమ్మినేని సీతారాంకు ముందస్తు బెయిల్

**విచారణాధికారి ఎదుట హాజరు కావాలని హైకోర్టు ఆదేశం**

**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** డాక్యుమెంట్ల ఫోర్జరీ, భూకబ్జా కేసులో అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆయన భార్య వాణిలకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనకు చెందిన సుమారు రూ.4 కోట్ల విలువైన స్థలాన్ని ఫోర్జరీ పత్రాలతో కబ్జా చేశారని శ్రీకాకుళానికి చెందిన కట్టా జయకిశోర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఐదో నిందితుడిగా (ఏ5) ఉన్న చిరంజీవి నాగ్, అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ వై. లక్ష్మణరావు, నాగ్ అభ్యర్థనను తిరస్కరించారు. ఆయనపై ఉన్న ఆరోపణలు తీవ్రమైనవని, తాను కొనుగోలు చేసినట్లు చెబుతున్న మూడు ప్లాట్లకు సంబంధించి నగదు చెల్లింపుల ఆధారాలను సమర్పించడంలో ఆయన విఫలమయ్యారని న్యాయస్థానం ఈ సందర్భంగా అభిప్రాయపడింది. ఇదే కేసులో హైకోర్టు తాజా సమాచారాన్ని అనుసరించి ఆరో, ఏడో నిందితులుగా (ఏ6, ఏ7) ఉన్న తమ్మినేని సీతారాం, వాణిశ్రీలకు హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. వీరిపై నిర్దిష్టమైన ఆరోపణలు లేకపోవడంతో పాటు, గతంలో దాఖలైన సివిల్ దావాలో వీరిని ప్రతివాదులుగా చేర్చని అంశాలను పరిగణనలోకి తీసుకుని కోర్టు ఈ నిర్ణయం వెలువరించింది. ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని తమ్మినేని సీతారాంను ఆదేశించిన న్యాయస్థానం, విచారణకు సహకరించని పక్షంలో బెయిల్ రద్దు చేస్తామని స్పష్టం చేసింది. ప్రధాన బెయిల్ పిటిషన్లపై తదుపరి విచారణను ఆగస్టు 17కు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో తమ్మినేని స్పందిస్తూ.. తాము ఎప్పుడూ చట్టాన్ని ఉల్లంఘించలేదని, మధ్యవర్తులు చూపించిన పత్రాల ఆధారంగానే సబ్‌రిజిస్ట్రార్ పరిశీలన తర్వాత భూమి కొనుగోలు చేశామని తెలిపారు. ఈ వ్యవహారంలో తాము కూడా బాధితులమేనని, దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తామని పేర్కొన్నారు.



## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా శుచిగా నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తున్న ట్రస్ట్‌కు దాతలు తమవంతు విరాళాలు అందిస్తున్నారు. తాజాగా మంగళవారం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన వెంకట గణేష్ గంగాధర్ దాసిక వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళమిచ్చారు. దాత విరాళాల డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడుకు క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

**'సుస్థిర అభివృద్ధి కోసం మహిళల డిజిటల్ సమ్మిళితతకు జీవితాంత విద్య - సమస్యలు వ్యూహాలు'పై**

# 40 మంది పరిశోధనా పత్రాల సమర్పణ



**తిరుపతి, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం, ఇండియన్ అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల సదస్సు మంగళవారం ముగిసింది. "సుస్థిర అభివృద్ధి కోసం మహిళల డిజిటల్ సమ్మిళితతకు జీవితాంత విద్య - సమస్యలు వ్యూహాలు' అనే అంశంపై పద్మావతి విశ్వవిద్యాలయంలోని సావేరి సెమినార్ హాల్‌లో ఈ సదస్సులో మొత్తం 7 సెషన్స్‌లలో 40 మందికి పైగా పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఒకప్లీనరీ సమావేశం 3 ప్యానెల్ చర్చలు నిర్వహించారు. మహిళల డిజిటల్ సమ్మిళితత, డిజిటల్ అంతరం, మహిళా సాధికారత, కృత్రిమ మేధస్సు, సైబర్ నేరాలు, జీవితాంత విద్య పాత్ర తదితర అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ఈ చర్చల ఆధారంగా మహిళలకు డిజిటల్ అక్షరాస్యత పెంపొందించడం, గ్రామీణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ సాంకేతిక శిక్షణ, మహిళా అధ్యయన కేంద్రాలు-సాంకేతిక విభాగాల మధ్య సమన్వయం, సైబర్ నేరాల నివారణపై ప్రచారం, అసంఘటిత గిరిజన మహిళలకు ప్రత్యేక శిక్షణ, డిజిటల్ వేదిక ఏర్పాటు, చట్టపరమైన అవగాహన, మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి.ఉమాదేవి, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్ మేనేజ్మెంట్ డీన్, మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ పి.విజయలక్ష్మి పరిశోధనా పత్రాలను సమర్పించిన ప్రతినిధులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ పి.ఆదినారాయణ రెడ్డి, ఇండియన్ అడల్ట్ ఎడ్యుకేషన్ అసోసియేషన్, న్యూఢిల్లీ ప్రతినిధులు, సర్వోదయ మహిళా సంక్షేమ సంఘం సభ్యులు, మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# మాతృభూమికి సేవ చేయడం బాధ్యత




**కుప్పం, జులై 28 ప్రభాతవార్త:** మాతృభూమికి సేవ చేయడం మన బాధ్యత అని సమాజానికి సేవ చేసేందుకు అందరూ ముందుండాలని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో నారా భువనేశ్వరి విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థుల క్రీడలను వీక్షించి క్విజ్ పోటీల్లో పలు ప్రశ్నలను అడిగారు. లిటిల్ ఛాంప్స్ రైజ్ షైన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె ప్రసంగించారు. జాతిపిత మహాత్మా గాంధీ, ప్రధాని మోడీ వంటి వారి నుంచి విద్యార్థులు, యువత స్ఫూర్తి పొందాలని సూచించారు. మహాత్ముడిలా సమాజానికి సేవచేసే గుణం ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. విద్యార్థుల చదువులకు చేయూత అందించేందుకే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద చదువుకునే ప్రతి బిడ్డకు 15వేల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కృషితో ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల నుండి 1.06 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం గొప్ప విశేషం అన్నారు. ఒక్కరోజులో ఏ విజయమో రాదని నిరంతర కృషితోనే అది సాధ్యమవుతుందన్నారు. తెల్లవారుజామున లేవడం, పనిలో తల్లిదండ్రులకు సాయం చేయడం వంటివి విద్యార్థులు అలవాటు చేసుకోవాలని సూచించారు. తల్లి తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమన్నారు. గురువులు మార్గదర్శకులని వారిని గౌరవించాలని సూచించారు. తాను చెన్నైలోనే చర్చి పార్క్ ప్రజెంటేషన్ కాన్వెంట్‌లో చదివానని విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ అలవర్చుకోవడం వల్లే ఎంచుకున్న రంగంలో విజయం సాధించినట్లు నారా భువనేశ్వరి పేర్కొన్నారు. యువత అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తనకు ఎదురైన ఇబ్బందులను అవకాశాలుగా మార్చుకొని ఎదిగినట్లు పేర్కొన్నారు. హెరిటేజ్ సంస్థ నిర్వహణలో తనకు వచ్చే సందేహాలను అడిగేందుకు తాను వెనకాడనని పేర్కొన్నారు .మంచి వ్యక్తులతో స్నేహం ఉన్నతికి దోహదపడుతుందన్నారు. పుస్తకాలు చదవడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్, ట్యాబ్‌లను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. తన మనవడు నారా దేవాన్ష్ పుస్తకాలు బాగా చదువుతాడని టీవీ, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటాడని పేర్కొన్నారు. విద్యార్థులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు విజ్ఞానం పెంపొందించుకోవడానికి టెక్నాలజీని వినియోగించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు,యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ తో జీవితాలు నాశనమవుతాయన్నారు. వ్యసనాల నుంచి బయటపడడం చాలా కష్టమని పేర్కొన్నారు. పరీక్షల్లో విఫలమైతే జీవితానికి అది ముగింపు కాదన్నారు. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోరాదని అలాంటి చర్యలతో తల్లిదండ్రులు కృంగిపోతారని పేర్కొన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని భువనేశ్వరి సూచించారు.

**మా ఇంట్లో నేను కుప్పం పార్టీ:** తమ కుటుంబంలో రెండు పార్టీలు ఉన్నాయని, అందులో తాను కుప్పం పార్టీ అని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం గుడుపల్లె మండలం అగరం గ్రామంలో మహిళలతో ముఖాముఖిలో నారా భువనేశ్వరి ఆసక్తికరంగా మాట్లాడారు. మా ఇంట్లో ఒకటి కుప్పం పార్టీ, రెండోది మంగళగిరి పార్టీ అన్నారు. మంగళగిరి పార్టీలో మంత్రి లోకేష్, బ్రాహ్మణి, దేవాన్ష్ ఉంటారన్నారు. తాను మాత్రం కుప్పం పార్టీ అని చెప్పారు. తాను ఇంట్లో కుప్పానికి ఏం తెచ్చారు, ఏం ఇచ్చారు అని సిఎం చంద్రబాబును ప్రశ్నిస్తుంటానని పేర్కొన్నారు. చేసిన మంచి పనులు శాశ్వతం కావాలని, కుప్పంలో మనపేరు మిగలాలి అనేది తమ ఆలోచన అన్నారు. సిఎం చంద్రబాబుతో పోరాడి, కొట్లాడి కుప్పం ప్రజలకు మంచి చేస్తానన్నారు. కుప్పం ప్రజలు సిఎం చంద్రబాబును గుర్తుంచుకోవాలని 40 ఏళ్లగా ఆయనపై కుప్పం ప్రజలు చూపుతున్న అభిమానానికి పాదాభివందనాలు చేస్తున్నానని భువనేశ్వరి పేర్కొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖలో సంస్కరణలకు కేంద్రం ప్రశంస

## మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖలో చేపడుతున్న సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం ప్రశంసించిందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడలో ప్రజా పంపిణీ వ్యవస్థ(పిడిఎస్)లో స్టీమ్ రైస్ పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. అదనంగా 20 వేల మెట్రిక్ టన్నుల పార్బాయిల్డ్ ధాన్యం సేకరణకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. రేషన్ దుకాణాల ద్వారా 'మీ మార్ట్' కాన్సెప్ట్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. రైతు బజార్లలో తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యాన్ని విక్రయించే కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఎపి వ్యాప్తంగా స్వర్ణ వెరైటీ బియ్యాన్ని కిలో రూ.40కు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రేషన్ కార్డుదారులకు 500 గ్రాముల కందిపప్పు అందించే ప్రతిపాదనను కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.281 కోట్ల నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందన్నారు. ధాన్యం ట్రాకింగ్‌కు ఆర్ఎఫ్ఐడి టెక్నాలజీని అమలు చేస్తున్నామని అన్నారు. డిజిటల్ వాలెట్ విధానం ద్వారా సబ్సిడీల పంపిణీకి పైలట్ ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెప్పారు. ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్ల కమిషన్ పెంపునకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 29 వేల రేషన్ దుకాణాలను మరింత బలోపేతం చేస్తామన్నారు. రాష్ట్రంలో బియ్యం ధరల స్థిరీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. మిల్లర్లతో చర్చలు జరిపామని, ప్రస్తుతం కిలో రైస్ ధర రూ.52 వద్ద ఉండేలా నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ వెరైటీ రైస్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# గ్రామస్థాయిలోనూ శ్రీవారి సేవ విస్తరణ

**సేవకుల పనితీరు ఆధారంగా రేటింగ్ - టిటిడి ఇఒ రవిచంద్ర**



**తిరుమల, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కీలకంగా ఉన్న శ్రీవారి సేవకులు స్వామివారికి సేవ చేయడానికి తిరుమలకు రావడంతో బాటు తమ ప్రాంతాలు, గ్రామాల్లోని స్థానిక ఆలయాల్లో సేవలందించేలా ప్రోత్సాహించాలని టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర చెప్పారు. శ్రీవారి సేవకులకు వారి పనితీరు ఆధారంగా సిబిల్ స్కోర్ తరహాలో రేటింగ్ ఇచ్చి, ఆ రేటింగ్ ఆధారంగా విధులు కేటాయించే విధానంపై ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను గ్రామస్థాయిలో కూడా విస్తరించేందుకు టిటిడి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. తిరుమల శ్రీవారి సేవా సదన్‌లో గ్రూప్ సూపర్వైజర్లకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణా కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఇఒ రవిచంద్ర మాట్లాడుతూ శ్రీవారి సేవను మరింత విస్తరించేందుకు గ్రూప్ సూపర్వైజర్లు అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 50 వేల ఆలయాలు ఉన్నాయని, ఆయా దేవాలయాల్లో శ్రీవారి సేవ ద్వారా భక్తులకు సేవలందించేందుకు ఉన్న అవకాశాలను శ్రీవారి సేవకుల ద్వారా టిటిడి దృష్టికి తీసుకు రావాలని సూచించారు. గ్రూప్ సూపర్వైజర్ల శిక్షణా కార్యక్రమం ద్వారా నేర్చుకున్న అంశాలను తమ ప్రాంతాల నుండి శ్రీవారి సేవకు విచ్చేసే ముందు సేవకులకు శిక్షణ ఇవ్వడం వల్ల వారు తిరుమలకు వచ్చి నాణ్యమైన సేవలు అందించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. అనంతరం గ్రూప్ సూపర్వైజర్ల శిక్షణా కార్యక్రమం, శ్రీవారి సేవను గ్రామస్థాయిలో విస్తరించడం, భక్తులకు టిటిడి అందిస్తున్న సేవలను మరింత మెరుగు పరచడం వంటి అంశాలపై గ్రూప్ సూపర్వైజర్ల నుండి సలహాలు, సూచనలు స్వీకరించారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని భక్తులకు నాణ్యమైన సేవలందించేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. శిక్షణా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఎస్.ఎల్.ఎన్.టి. శ్రీనివాస్, చెన్నైకు చెందిన శరత్‌లను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ, శ్రీవారి సేవా సదన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి: వైకాపా

**చిత్తూరు, జులై 28 ప్రభాతవార్త:** డిఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో జరిగిన అక్రమాలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరం రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రం చిత్తూరులో మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువత ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. డిఎస్సీ అక్రమాలపై బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి పదవికి నారా లోకేష్ సత్వరం రాజీనామా చేయాలని ప్రధాన డిమాండ్‌తో మంగళవారం గాంధీ సర్కిల్ వద్దకు చేరుకున్న వైకాపా నాయకులు, పార్టీ శ్రేణులు గాంధీ విగ్రహం నుండి ఎంఎస్ఆర్ సర్కిల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించిన అనంతరం మళ్ళీ గాంధీ సర్కిల్ వరకు వచ్చి కూటమి ప్రభుత్వ ఆరాచాకాలపై నాయకులు ధ్వజమెత్తారు. చిత్తూరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ్ ఎంసి విజయానందరెడ్డి, పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ్ డాక్టర్ సునీల్‌కుమార్, వైకాపా రాష్ట్ర యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ భాగ్యరాజ్ ప్రభంజన్‌ల ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు



రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సత్వరం రాజీనామా చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డిఎస్సీలో అన్యాయానికి గురైన నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం సాగిస్తుందని పేర్కొన్నారు.



## మళ్లీ చిరుత సంచారం

**తిరుమల, జులై 28 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతంలో మంగళం తిరుమలనగర్ ప్రాంతంలో చిరుతపులి సంచారం జనంలో భయం గొల్పిస్తోంది. మొన్నటివరకు తిరుమల కాలినడక మార్గాల్లో, తాజాగా మంగళం ఉపాధ్యాయ నగర్‌లో ఏకంగా ఓ ఇంటి ప్రహరీగోడపై సంచరించడం ఆందోళనకరంగా మారింది. ఒక్కసారిగా ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా ఆందోళనకరంగా మారింది. అటవీప్రాంతాన్ని ఆనుకుని వున్న కాలనీల్లో, అలిపిరి నడకమార్గాల్లో చిరుతపులుల సంచారంతో జనం మాత్రం నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. అటవీశాఖ మాత్రం ఒంటరిగా బయటకు వెళ్ళవద్దని సూచిస్తున్నారు.

29MN 11 final PG-GNT_29MN 11 final PG-GNT.qxd 29-07-2026 AM 01:01 Page 1



## ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం

చిలకలూరిపేట, జూలై28, ప్రభాతవార్త రోటరీ క్లబ్ చిలకలూరిపేట మరియు ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వికాస్ స్కూల్ నందు ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. రొటేరియన్ దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణ మన అందరి బాధ్యతని అందులో భాగంగానే ప్రతి విద్యార్థి మొక్కలను పెంచే కార్యక్రమంలో



పాలుపంచుకొని, చెట్లు నీరు వన్యప్రాణులు భూమి,ఖనిజ సంపదలను సంరక్షించాలని, గాలి నీరు భూమి కాలుష్యం కాకుండా ప్లాస్టిక్ వినియోగం, పారిశ్రామిక వ్యర్థాలను తగ్గించి భవిష్యత్తు తరాలకు మంచి ప్రకృతి అందించాలని విద్యార్థులను కోరారు. వికాస్ స్కూల్లో ఉన్న 400 మంది విద్యార్థి విద్యార్థులకు ఎర్ర మట్టితో ఉన్న రెండు బాగ్స్ మరియు విత్తనాలను అందజేసి వారు ఇంటి వద్ద వాటిని జాగ్రత్తగా పెంచి తీసుకుని వచ్చి స్కూలు యాజమాన్యానికి ఇచ్చినట్లయితే ఈ మొక్కలన్నింటినీ ఐదు ఎకరాలు విస్తరణములో ఉన్న సామాజిక వనాన్ని అభివృద్ధి చేస్తామని తెలియజేశారు. తోటకూర వెంకటనారాయణ గారు మాట్లాడుతూ విత్తును నాటండి మొక్కను పెంచండి అని అందరు విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షులు రామ సుబ్బారావు ప్రకృతి పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి మొక్కలను పెంచి సామాజిక సేవ చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు తోటకూర రామసేత నార్ని జయలక్ష్మి వికాస్ డైరెక్టర్ దండారోజశ్రీ,, రోటరీ క్లబ్ అధ్యక్షులు బి రామ సుబ్బారావు కార్యదర్శి డాక్టర్ మానం శ్రీనివాసరావు క్లబ్ డైరెక్టర్స్ తోటకూర వెంకటనారాయణ, అడుసుమల్లి మోహన్ రావు షేక్ రషీద్, ఓ. సాంబశివరావు, స్కూల్ ప్రిన్సిపల్, టీచర్స్ విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు . ఈమేరకు బి రామ సుబ్బారావు అధ్యక్షులు, డాక్టర్ మానం శ్రీనివాసరావు కార్యదర్శి తెలిపారు.

## గ్రామాల్లో పొలం పిలుస్తోంది.

చిలకలూరిపేట, జూలై 28, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలంలోని పోతవరం మరియు మరియు మద్దిరాల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ సరిత,ప్రధాన శాస్త్రవేత్త అయిన డా.పి.వి సత్యగోపాల్ గారు,జిల్లా వనరుల కేంద్రం నుండి ఏ.ఓ లీ. అరుణ మరియు మట్టి పరీక్షా



కేంద్రం ఏ.ఓ యాకోబు గారు పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. ప్రధాన శాస్త్రవేత్త సత్యగోపాల్ , జిల్లా వనరుల కేంద్రం ఏవో ఎం అరుణ,మట్టి నమూనా పరీక్షా కేంద్రం ఏవో యాకోబు, , చిలకలూరిపేట మండల వ్యవసాయ అధికారితోపాటు ఏఈఓ ప్రతాప్ పోతవరం మరియు మద్దిరాల గ్రామ రైతులు,రైతు సేవా కేంద్ర సిబ్బంది శ్రీ హర్ష తదితరులు పాల్గొన్నారు.

## 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమం

చిలకలూరిపేట, జూలై 28, ప్రభాతవార్త: చిలకలూరిపేట:కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయవంతమైన పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేట పట్టణంలోని 9వ వార్డులో సోమవారం ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.ముందుగా వార్డులోని శ్రీ



ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ప్రజలకు అందించిన సేవలు, సంక్షేమ ఫలాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కూటమి పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. నియోజకవర్గ పరిశీలకులు ఆడక స్వాములు , నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు , పార్టీ సీనియర్ నాయకులు తెల్ల సుబ్బారావు , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుభాని , పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్ , పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి , క్లస్టర్ ఇన్చార్జి ముల్లా కరీముల్లా , మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల రమణ , పార్లమెంట్ కార్యదర్శి అమర రమాదేవి , పోపురి లక్ష్మీ గారు, 9వ వార్డు పార్టీ అధ్యక్షులు గోపిదేశి వెంకటేశ్వర్లు , ప్రధాన కార్యదర్శి దాసు , రాయుని పద్మ , కొనిదన సీత, పుల్లగొర ఝాన్సీ , కంచర్ల రాజ్యలక్ష్మి , చావల అనూష తదితరులు పాల్గొన్నారు.

## 3 సెల్‌ఫోన్లు రికవరీ.. బాధితులకు అప్పగించిన అర్బన్ సీఐ రమేష్



చిలకలూరిపేట, జూలై 28, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోయిన మూడు సెల్‌ఫోన్లను పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి రికవరీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం చిలకలూరిపేట అర్బన్ సీఐ పి. రమేష్ గారు సెల్‌ఫోన్లను సంబంధిత బాధితులకు అందజేశారు. సెల్‌ఫోన్లు పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడం వల్ల వాటిని గుర్తించి తిరిగి అప్పగించడం సాధ్యమైందని సీఐ తెలిపారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోయిన సందర్భంలో వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఆయన సూచించారు.

## పోతవరం, మద్దిరాల గ్రామాల్లో "రెండేళ్ల పాలన" అభివృద్ధి సంక్షేమం... కార్యక్రమం

చిలకలూరిపేట, జూలై 28, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలం లోని పోతవరం మరియు మద్దిరాల గ్రామాల్లో కూటమి ప్రభుత్వ "రెండేళ్ల పాలన – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్ గారు, క్లస్టర్ ఇంచార్జ్ గంజి శ్రీనివాసరావు ,పోతవరం గ్రామ పార్టీ నాయకులు



పఠాన్ బాజీ , హజరత్ , మద్దిరాల గ్రామ పార్టీ నాయకులు పయ్యావుల సాంబశివరావు ,మాలెంపాటి సుబ్బారావు , గోరంట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.నాయకులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ, గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవలను వివరించారు.

## నకరికల్లులో ఇద్దరు విద్యార్థినులు అదృశ్యం... చిలకలూరిపేటలో గుర్తింపు

చిలకలూరిపేట, జూలై 28, ప్రభాతవార్త: నకరికల్లు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు చదువు ఇష్టం లేక గోడ దూకి బయటకు వెళ్లారు. త్రిపురాపురం గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదుతో పోలీసులు గాలింపు చేపట్టి చిలకలూరిపేటలో వారిని సురక్షితంగా గుర్తించి, నకరికల్లుకు తరలిస్తున్నారు.

## నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెంపుదల


చిలకలూరిపేట, జూలై 28, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 242 నుంచి 278కి పెంపు దల జరిగినట్టు ఎన్నికల అధికారి బి.లీలా రాణి తెలిపారు.



నియోజకవర్గంలో 36 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అని తెలిపారు. మొత్తం 2,26,959 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. చిలకలూరిపేట అర్బన్‌లో 28, రూరల్‌లో 4, నాదెండ్లలో 3, యడ్లపాడులో 1 కొత్త కేంద్రం నాదెండ్ల, చిలకలూరిపేట అర్బన్, కావూరు పరిధిలో 5 పోలింగ్ కేంద్రాల స్థానాల మార్పుజరిగిందని, కొత్త కేంద్రాలకు త్వరలోనే బిఎల్‌ఓలు సూపర్‌వైజర్ల నియామకం జరుగుతుందన్నారు.

## పేద విద్యార్థినికి కస్తూర్బా పాఠశాలలో ప్రవేశం

చిలకలూరిపేట, జూలై 28, ప్రభాతవార్త: ఉపాధ్యాయుని చొరవతో విద్యార్థిని ఉన్నత చదువులకు చేయూత. పల్నాడు జిల్లా యల్లమంద గ్రామంలోని ఎంపీపీ(ఎస్‌సీ) పాఠశాలలో ఈ నెల 24వ తేదీన నిర్వహించిన మెగా పీటీఎం సమావేశంలో పాఠశాల పూర్వ విద్యార్థిని పెళ్లూరి యమున పదో తరగతిలో 527 మార్కులు సాధించినప్పటికీ కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా పై చదువును కొనసాగించలేని పరిస్థితి ఉన్నట్లు గుర్తించిన పాఠశాల ఉపాధ్యాయుడు కామినేని పెద్దబ్బాయి ఆ



విద్యార్థిని ఇంటర్మీడియట్ విద్య పూర్తయ్యే వరకు అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా విద్యాశాఖ అధికారి పి.వి.జే. రామారావు , అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యాంప్రసాద్ వెంటనే స్పందించి విద్యార్థినిని కెజీబీవీ నాదెండ్లలో ఇంటర్‌లో చేర్పించాలని ఆదేశించారు. దీంతో మంగళవారం ఉపాధ్యాయుడు కామినేని పెద్దబ్బాయి విద్యార్థినికి హాస్టల్‌లో అవసరమైన వస్తువులను సమకూర్చి ఆమె తల్లిదండ్రులతో కలసి కేజీబీవి నాదెండ్లలో ఇంటర్‌లో చేర్పించారు. విద్యార్థిని, తల్లిదండ్రులు జిల్లా విద్యాశాఖాధికారి, రామారావు, ఎపిసి శ్యాంప్రసాద్, ఉపాధ్యాయుడు చిన్నబ్బాయిలకు ధన్యవాదాలు తెలిపారు.

## రామాయణం మార్గంలోనే పురోగతి...

రేపల్లె, జూలై 26, ప్రభాతవార్త:భారతీయ హిందూ జీవన విధానానికి ప్రతీకగా రామాయణం నిలుస్తుందని జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు అన్నారు. మంగళవారం రేపల్లె పురపాలక సంఘంలోని ఒకటో వార్డు శ్రీరామ్‌నగర్ ఎస్టీ కాలనీ సీతారామాలయంలో శుక్రవారం వరకు కొనసాగే ధార్మిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలకు భక్తుల ఆదరణ లభిస్తున్నదని చెప్పారు. రామాయణం అన్నదమ్ముల, తండ్రీ కొడుకుల అనుబంధాలను, భార్యాభర్తల ఏకపత్నీ విధానాన్ని తేటతెల్లం చేసిందని గుర్తుచేశారు. ఆంజనేయుడు, సుగ్రీవుడు, విభీషణుడు వంటి పాత్రలు నేటి కుటుంబ వ్యవస్థలోనూ కన్పిస్తుంటాయని తెలిపారు టిటిడి ధార్మిక సేవా సంఘం సభ్యులు పొన్నపల్లి సత్యనారాయణ, పేరం కోటేశ్వరరావు, జంగం శా య్యంప్రసాద్, శొంఠి బాబూరావు ,రమాదేవి, వెంకటేశ్వరరావు, నంబూరు వేణు తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీ బూర్గులమ్మ దేవతకు అభిషేకం



రేపల్లె, జూలై 28, ప్రభాతవార్త:పట్టణంలోని శ్రీ బూర్గులమ్మ దేవత ఆషాడ గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 8 గంటలకు 108 బిందెలతో పంచామృత ఫలరసాలతో అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు ఎన్. భాను సుధాకర్ మంగళవారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శాకాంబరీ దేవిగా శ్రీ బూరుగులమ్మ దర్శనమిస్తారని భక్తులు దర్శించుకుని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆయన కోరారు.

## దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె, జూలై 28, ప్రభాతవార్త:దస్తావేజు లేఖర్ల సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకా పూర్ణచంద్రరావు కోరారు. మంగళవారం రేపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్



కార్యక్రమం 9వ రోజుకు చేరిన సందర్భంగా రేపల్లె బార్ అసోసియేషన్ మద్దుతు ప్రకటించింది. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేట్ సంస్థలకు అప్పచెప్పేందుకు ప్రభుత్వం 396 జీవోను విడుదల చేయడం సరికాదన్నారు. ఈ విధానం వలన ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని చెప్పారు. ప్రైవేటీకరణ విధానం వలన లక్షలాది కుటుంబాల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతుందని పూర్ణచంద్రరావు ఆందోళన వెలుబుచ్చారు. యువగళం పాదయాత్రలో డాక్యుమెంట్ రైటర్స్‌కు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నెరవేర్చాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె బార్ అసోసియేషన్ కార్యదర్శి పెద్దపల్లి హనూక్, మాజీ అధ్యక్షుడు జి. వెంకట గిరిధర్, పి. వాసుదేవరావు, శేరు శ్రీనివాసరావు, కేసన అంకనాగదేవి, దస్తావేజు లేఖరి మొగసాటి రవీంద్ర, దస్తావేజు లేఖర్లు, స్టాంప్ వెండర్లు, డిటిపి ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది..లో రైతులకు అవగాహన



రేపల్లె, జూలై 28, ప్రభాతవార్త:మండలంలోని ఉప్పూడి, సింగుపాలెం గ్రామాలలో మంగళవారం వ్యవసాయ శాఖ నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. నూతన సాంకేతిక విధానాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. నూతన ఎరువుల పంపిణీ విధానం, ఏపిఏఐఎంఎస్, పిఎంఎఫ్‌బివై యాప్ ద్వారా పంట బీమా నమోదు, క్లెయిమ్ ప్రక్రియలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె మండల వ్యవసాయ శాఖ అధికారి ఎ. మహేష్‌బాబు, వ్యవసాయ విస్తరణాధికారి సుమంత్, పావని, గంగా భవాని, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## షిర్డీసాయిబాబా గ్రామోత్సవం





రేపల్లె, జూలై 28, ప్రభాతవార్త: వేమూరు నియోజకవర్గంలోని భట్టి ప్రోలులో శ్రీ షిర్డీసాయి దత్తాత్రేయ స్వామి దేవాలయంలో గురు పౌర్ణమి సందర్భంగా మంగళవారం భట్టి ప్రోలు, అద్దేపల్లి పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు బిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం. సాంబశివరావు, కోశాధికారి బి. కిరణ్‌కుమార్, సిహెచ్. పాపారావు, బి. రమేష్‌బాబు, కె. రవికుమార్, ఎం. నారాయణ, ఎం. జగన్నాథం, టి. అర్ధనారీశ్వరుడు, చందలూరి రామకోటేశ్వరరావు, జి. వెంకటేశ్వర్లు, సిహెచ్. బాబు, వి. సిహెచ్. కొండయ్య, పంచుమర్తి వెంకట పద్మావతి, నందం పద్మావతి, పి. గౌరీ, జి. శివపార్వతి, ఎం. శైలజ కుమారి, వి. వి. పద్మజ, డి. భూలక్ష్మి, శిరం మాధురి, టి. మాధవి, ఎం. శశికళ, ఎం. చంద్రలక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## రావు శ్రీకృష్ణదేవరాయలును అభినందించిన పట్టణ సీఐ

చిలకలూరిపేట, జూలై 28, ప్రభాతవార్త: చిలకలూరిపేట రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో చిలకలూరిపేట నుండి షావోలిన్ ఊషు ఆర్గనైజేషన్ గ్రాండ్ మాస్టర్ కమాల్ భాషా ఆధ్వర్యంలో డౌన్ సింద్రోమ్ బాలుడు రావు శ్రీకృష్ణదేవరాయలు(బ్లాక్ బెల్ట్)కటా విభాగంలో ప్రత్యేక ప్రదర్శన ఇచ్చిన



సందర్భంగా గోల్డ్ మెడల్ సాధించాడు. చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐ పి రమేష్ బాబు గోల్డ్ మెడల్ మెడలోవేసి శ్రీకృష్ణ దేవరాయలును అభినందించారు. ప్రత్యేక అవసరాలు గల ఇటువంటి వారికి సమాజం అండగా నిలవాలిఅన్నారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, ఏపీఐడీసీ ఛైర్మన్ వేగుళ్ళ లీలా కృష్ణ పాల్గొని రావు శ్రీకృష్ణదేవరాయలుకు బంగారు పతకాన్ని ప్రధానం చేయడం చిలకలూరిపేటకు గర్వకారణం అన్నారు. తూర్పు గోదావరి జిల్లా మండపేట పట్టణంలో మదర్ థెరిసా సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్ గ్రాండ్ మాస్టర్ టి అబ్బులు మరియు వైవీఎన్ మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం 26072026 స్థానిక శ్రీవత్స కన్వెన్షన్ హాల్ లో రాష్ట్ర స్థాయిలో కుంగ్ ఫు, కరాటే, తైక్వాండో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు .

## జంతర్‌మంతర్‌వద్ద బీసీల మహాధర్నా

### ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి ...పల్నాడు జిల్లా అధ్యక్షులు పృథ్విరాజ్ సాయి

చిలకలూరిపేట, జూలై 28, ప్రభాతవార్త: కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో డిమాండ్ చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు



మాదాసు పృథ్వీరాజ్ సాయి తెలిపారు. రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో జరిగిన ఈ ధర్నాకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వందలాది మంది బీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. జడి వానను సైతం లెక్కచేయకుండా బీసీ నాయకులు ధర్నాను కొనసాగించడం ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న కులగణనను స్వాగతిస్తూ, జనాభా ప్రాతిపదికన బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో సముచిత వాటా కల్పించాలని కోరినట్లు చెప్పారు. అలాగే బీసీలకు ప్రత్యేక బడ్జెట్, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీతో పాటు బీసీల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలని డిమాండ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు మాదాసు పృథ్వీరాజ్ సాయి తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా నుంచి గంజినబోయిన సందీప్ కుమార్, వల్లూరి పృధ్వి , మాదాసు సాయి తేజ, పల్లపు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి వేడుకలకు బాబా మందిరం ముస్తాబు

### -భక్తుల తాకిడికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేసిన కమిటి

### -శ్రీ షిరిడి సాయి సేవా మండలి ఛైర్మన్ సర్రాజు

పొన్నూరు, జూలై 28,ప్రభాతవార్త: పట్టణంలోని సాయినగర్‌లో కొలువై ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో ఈ నెల 29వ తేదీ గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు శ్రీ షిరిడి సాయి సేవా మండలి ఛైర్మన్ సర్రాజు మధుసూధనరావు తెలిపారు. బాబా మందిరాన్ని పూరి_స్థాయిలో ఆధునీకరించామన్నారు. షిరిడిలోని మందిరం ఏ విధంగా ఉందో అదేవిధంగా ఇక్కడ కూడా ఉండేవిధంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. భక్తుల రాకకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు కూడా కమిటివారికి సహకరించి శ్రీ బాబావారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకోవాలని కోరారు. ఉదయం బాబావారికి అభిషేకాలు, వివిధ రకాల హారతులు, వివిధ రకాల సేవలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు రావాలి :

### ప్రాజెక్ట్ మేనేజర్ కె. అమల కుమారి

యడ్లపాడు, జూలై 28, ప్రభాతవార్త : ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న బెట్ట వాతావరణ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాలను తప్పనిసరిగా అవలంబించాలని పల్నాడు జిల్లా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె అమల కుమారి పిలుపునిచ్చారు. మంగళవారం యడ్లపాడు మండలం చెంఘీస్కాన్‌పేట గ్రామంలో రైతు గుర్రం జ్యోతి



సాగుచేస్తున్న పత్తి పొలాన్ని ఆమె సందర్శించి పంట పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు కీలక సూచనలు చేశారు. పత్తి సాగులో తప్పనిసరిగా అంతర పంటలు వేయాలని సూచించారు. గోరు చిక్కుడు, బెండ, సజ్జ వంటి అంతర పంటల సాగు ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు భూమి సారవంతత పెరుగుతుందని తెలిపారు. అలాగే మిత్ర పురుగుల సంఖ్య పెరగడం వల్ల రసాయన పురుగుమందుల వినియోగం తగ్గి సాగు ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని వివరించారు. ప్రస్తుతం జీవామృతాన్ని 100 లీటర్ల నీటికి 10 లీటర్ల చొప్పున కలిపి సాయంత్రం వేళ మొక్క పూర్తిగా తడిచే విధంగా పిచికారీ చేయాలని సూచించారు. దీని వల్ల మొక్కలకు అవసరమైన పోషకాలు సమృద్ధిగా అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరిగి వాతావరణ ఒడిదుడుకులను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. అదేవిధంగా ప్రతి ఎకరానికి 20 జిగురు పూసిన పసుపు రంగు అట్టలను ఏర్పాటు చేయాలని సూచించారు. వాటి ద్వారా రసం పీల్చే పురుగుల ఉధృతిని ముందుగానే గుర్తించవచ్చని తెలిపారు. నివారణ చర్యగా నీమాస్త్రం లేదా ఐదు శాతం వేపగింజల కషాయాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా పత్తి సాగులో పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు స్థిరమైన దిగుబడులు, అదనపు ఆదాయం సాధ్యమవుతుందని అమల కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట డివిజన్ ఎన్ఎఫ్ఏ సౌజన్య లక్షి ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సొలసలో రోడ్డు ప్రమాదం..



యడ్లపాడు, జూలై 28, ప్రభాతవార్త 1: మండల పరిధిలోని లింగారావుపాలెం గ్రామ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 25వ తేదీ రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో సొలస గ్రామానికి చెందిన బాపతు రామలీలారెడ్డి రహదారి అంచున నడుచుకుంటూ వెళ్తుండగా, ఏపి40హెచ్ఎఫ్0091 నంబరు గల మోటార్‌సైకిల్‌ను నడిపిన వ్యక్తి నిరక్ష ్యంగా, అతివేగంగా, మద్యం మత్తులో వచ్చి వెనుక నుంచి ఢీకొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో రామలీలారెడ్డికి కుడికాలుతో పాటు ముఖానికి గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో గుంటూరులోని ఉదయ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి కుమారుడు బాపతు సందీప్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై టి శివరామకృష్ణ తెలిపారు.

## వ్యవసాయ కూలీకి నిత్యావసర సరుకుల అందజేత

యడ్లపాడు, జూలై 28, ప్రభాతవార్త : మండల పరిధిలోని తిమ్మాపురం కొత్తపాలెం కాలనీకి చెందిన కత్తి రాఘవేంద్ర వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అదుపుతప్పి గోడపై నుంచి కిందపడటంతో ఆయన రెండు కాళ్లు విరిగాయి. గ్రామ పెద్దల సహకారంతో శస్త్రచికిత్స చేయించగా, ప్రస్తుతం ఆయన పనిచేయలేని పరిస్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న నరేంద్ర–సువర్ణ కుమారి ఫౌండేషన్ ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 5 కిలోల గోధుమపిండి, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో



ఫౌండేషన్ అధ్యక్షురాలు, ఉపాధ్యక్షుడు వై ప్రసాదరావు పాల్గొని, రాఘవేంద్ర త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. కుటుంబానికి అవసరమైన మేర సహాయ సహకారాలు అందించేందుకు ఫౌండేషన్ కట్టుబడి ఉంటుందని తెలిపారు.

## పచ్చిరొట్ట పైర్లను పెంచితే..కర్బనం శాతం పెరుగుతుంది

### -వ్యవసాయ విధాన సృష్టికర్త రాజశేఖర్‌రెడ్డి

కొల్లిపర, జూలై 28 ప్రభాతవార్త: భూమిలో కర్బనం శాతం పెంచాలంటే జీలుగ..జనుము...పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పైర్లను పెంచి 50 రోజుల వ్యవధిలో భూమిలో కలియదున్నటం శ్రేష్టమని..ఆ



తరువాత 20 రోజులు కుళ్ళ చెట్టాలని వ్యవసాయ విధాన సృష్టికర్త రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాల ఉత్పత్తిదారుల కళ్యాణ మండపంలో ప్రతిభ బయోటెక్ మరియు ఆర్. ఎం. కిసాన్ సెంటర్ వారి నిర్వహణలో రైతులకు సేంద్రియ మరియు పోషక పదార్థాల సమతుల్య వ్యవసాయ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ విధాన సృష్టికర్త రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భూమి కోసం సేంద్రియ పదార్ధం, మొక్కల కోసం పోషకాలు అనే అంశాన్ని వివరిస్తూ అనేక విషయాలు వెల్లడించారు. ప్రతి రైతు భూమి ఖాళీగా ఉంటే 70 రోజుల వ్యవధిలో పచ్చిరొట్ట పెంచి సేంద్రియ కర్బణాన్ని నేలకు అందించాలన్నారు. పైరు యొక్క వివిధ పెరుగుదల దశలో సూటి ఎరువులను కలుపుకుని వాడితే కాంప్లెక్స్ ఎరువులు వాడనవసరం లేదన్నారు. భూమి శుద్దికోసం పశువుల ఎరువుతో పాటు ట్రైకోడర్మా..సూడోమోనాస్..అవని ఎరువులను కలుపుకుంటే సూక్ష్మజీవులను పెంపొందించుకోవచ్చన్నారు. 500 మంది పైగా పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని కొల్లిపర శ్రీలక్ష్మి వినాయక ఎంటర్‌ప్రైజస్ అధినేత ఆరిమండ రాజేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో గుంటూరు..ప్రకాశం, నల్గొండ కంపెనీ ఇన్‌చార్జి మానుకొండ కృష్ణారెడ్డి, తోటకూర శ్రీనివాసరావు, మేడిశెట్టి బ్రహ్మేశ్వరరావు, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కొండా కిషోర్‌రెడ్డి, ఆరిమండ మహేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం

### -మండల టీడీపీ అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి

కొల్లిపర, జూలై 28 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తూనే..సంక్షేమాన్ని కూడా సకాలంలో అందిస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో టీడీపీ నాయకులు కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలనపై చేపట్టిన ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమాన్ని నాయకులతో కలసి గ్రామంలో నిర్వహించారు. ప్రతి ఇంటింటికీ వెళ్ళి ప్రజలను పలకరిస్తూ కూటమిపాలనపై వివరిస్తూ కరపత్రాలను అందజేస్తూ ప్రజా



సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా చినకోటిరెడ్డి మాట్లాడుతూ జనసేన, బీజేపీలతో కలసి రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపించేందుకు కూటమి పటిష్టంగా ముందుకెళుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అర్హులైన రైతుల ఖతాల్లో ప్రభుత్వం నగదు జమ చేయటం జరిగిందన్నారు. ప్రతి మహిళ కూడా ఈ రాష్ట్రంలో ఎక్కడకు వెళ్ళాలన్నా కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించి మహిళల కళ్ళల్లో వెలుగులు నింపిందన్నారు. కార్యక్రమంలో నీటిసంఘం ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లీశ్వరరెడ్డి, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, ఆరిమండ వెంకటరెడ్డి, విస్సారపు భరత్, చిమటా సూర్యప్రకాష్, గోదా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు భీమా పథకాన్ని సద్వినియోగించుకోవాలి -ఏడిప విజయబాబు

కొల్లిపర, జూలై 28 ప్రభాతవార్త: ఈ పంట నమోదు చేయించుకుని రైతులు భీమా పథకాన్ని సద్వినియోగించుకోవాలని ఏడిప విజయబాబు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని శిరిపురం..చివలూరు గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి ఖరీఫ్ సాగుపై రైతులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఏడిప విజయబాబు మాట్లాడుతూ వరి పంటకు ఎకరానికి రైతు వాటా క్రింద రూ.800 లు,వాతావరణ ఆధారిత పంట భీమా పథకం క్రింద అరటి



పంటకు గాను ఎకరానికి రూ.2,700 చెల్లించేందుకు నిర్ణయించటం జరిగిందన్నారు వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతులు వెదపద్ధతి ద్వారా వరిసాగు చేయటం వలన అధిక దిగుబడులు సాధించటానికి అవకాశం ఉందన్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# క్లీన్‌స్వీప్ చేసినా మారని తీరు



## నాలుగు పొరపాట్లతో టీమిండియా

**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో జరిగిన టి20 సిరీస్‌ను టీమిండియా 3-0తో క్లీన్‌స్వీప్ చేసి అదరగొట్టింది. అయితే 2028 ప్రపంచకప్ లక్ష్యంగా సాగుతున్న ఈ కీలక ప్రయాణంలో ప్రయోగాలు చేయకపోవడం తీవ్రంగా నిరాశపరిచింది. ఈ పర్యటనలో అత్యంత ప్రతిభావంతుడైన ఫాస్ట్ ఆల్‌రౌండర్ సూర్యాన్ష్ షెడ్జ్‌ను పక్కన పెట్టడం పెద్ద లోపం. కేవలం మూడో మ్యాచ్‌లో మాత్రమే అతనికి అవ కాశం దక్కింది. హార్దిక్ పాండ్యాకు తగిన ప్రత్యామ్నాయాన్ని వెతికే ప్రక్రియలో షెడ్జ్ లాంటి యంగ్‌స్టర్‌కు 3 మ్యాచుల్లోనూ ఛాన్స్ ఇవ్వా ల్సింది. నితీష్ కుమార్‌కు గాయాలు, శివమ్ దూబే జట్టులో ఇంకా స్థానాన్ని ఖాయం చేసుకోకపోవ డంతో షెడ్జ్ అత్యంత కీలకమైన ఆటగాడిగా మారే అవకాశముంది. ముస్తాక్ అలీ ట్రోఫీలో 5 వికెట్లు తీయడంతో పాటు, గత ఐపిఎల్‌లో విలువైన పరుగులు సాధించి తన ప్రతిభను నిరూపించు కున్నాడు. అలాగే శ్రీలంక ఎతో పోరులో అద్భుత ప్రదర్శన ఇచ్చాడు. బలహీనమైన జింబాబ్వేపై వరుస ఛన్స్ ఇచ్చి ఉంటే అతడి బ్యాటింగ్, బౌలింగ్ నైపుణ్యాలపై స్పష్టత వచ్చేది. ఒకే ఒక్క మ్యాచ్ ఆధారంగా ఈ యువ ఆటగాడి సామర్థ్యాన్ని అంచనా వేయడం ఏమాత్రం సరైన పద్ధతి కాదు. అలాగే బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చడం ఎంతో ముఖ్యం. ఐసిసి టోర్నీల్లో పరిస్థితులకు అనుగు ణంగా మారే జట్లే విజయం సాధిస్తాయి. అయితే ఈ సిరీస్‌లో భారత్ పాత పద్ధతిలోనే సాగడం గమనార్హం.

అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఓపెనర్లుగా రాగా, మూడో స్థానంలో ఇషాన్ కిషన్, నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్‌కు వచ్చారు. నిరాశపరిచిన అభిషేక్ శర్మ స్థానంలో తిలక్ వర్మను ఓపెనర్‌గా పంపే ప్రయోగం చేయాల్సింది. ఇక పరుగులు చేయడానికి ఇబ్బంది పడుతున్న శివమ్ దూబేను ఆర్డర్‌లో ముందుకు పంపి క్రీజులో ఎక్కువ సమయం గడిపేలా చేసి ఉంటే అతడికి లయ చిక్కేది. మిడిలార్డర్‌లో రింకూ సింగ్‌ను కేవలం ఫినిషర్‌గానే కాకుండా ఇన్నింగ్స్‌ను నిలబెట్టే యాంకర్‌గా పరీక్షించేందుకు ఇది మంచి సమయం. ఐపిఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు కష్టాల్లో పడినప్పుడు నాలుగో స్థానంలో వచ్చి ఇన్నింగ్స్ నిర్మించిన అనుభవం అతడికి ఉంది. ఈ సిరీస్‌లో అతడిని మూడో స్థానంలో ప్రమోట్ చేసి ఉంటే రింకూలో ఉన్న మరో కోణం బయటపడేది. భవి ష్యత్తులో టాప్ ఆర్డర్ బ్యాటర్లు గాయపడితే రింకూ లాంటి ఆటగాడు ఆ స్థానాన్ని భర్తీ చేయగలడనే నమ్మకం కుదిరేది.

మరోవైపు ఎడమచేతి వాటం స్పిన్నర్ హర్ష్ దూబేకు అరంగేట్రం చేసే అవకాశం దక్కకపోవడం మరో లోపం. రవీంద్ర జడేజా కెరీర్ ముగింపునకు చేరువవుతున్న వేళ సరైన ప్రత్యామ్నాయ స్పిన్నర్ కోసం వెతుకులాట సాగుతోంది. విజయ్ హజారే ట్రోఫీ, ఐపిఎల్ 2026లో సత్తా చాటిన దూబేను తుది జట్టులోకి తీసుకుని ఉంటే భారత్‌కు మరొక నాణ్యమైన స్పిన్ బౌలర్ అందుబాటులోకి వచ్చేవాడు.



శ్రీలంక పర్యటనకు..

## భారత్ టెస్ట్ టీమ్ ఖరారు

### జట్టులోకి బుమ్రా, సారాంశ్

**న్యూఢిల్లీ:** ఆగస్టు 15న ప్రారంభమయ్యే శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం భారత జట్టును మంగళవారం ప్రకటించారు. శుభ్‌మన్ గిల్ జట్టుకు నాయకత్వం వహించడం కొనసాగిస్తాడు, కేఎల్ రాహుల్ అతనికి డిప్యూటీగా ఉంటాడు. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రాను జట్టులోకి తీసుకున్నారు, కానీ అతనిభాగస్వామ్యం ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడిఉంటుంది. స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కండరాల గాయం కారణంగా మొదటి టెస్టుకు దూరమవ్వగా, అతని స్థానంలో భారత జట్టులోకి సారాంశ్ జైన్‌ను తీసుకున్నారు. భారత్ జట్టులో శుభమన్ గిల్ (కెప్టెన్), కెఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్ (వికెట్‌కీపర్), సాయి సుదర్శన్, ధ్రువ్ జురెల్ (వికెట్‌కీపర్), రవీంద్రజడేజా, కుల్దీప్‌యాదవ్, మానవ్ సుతార్, జస్ప్రీత్ బుక్రమా, మొహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్‌బ్రార్, దేవదత్ పడిక్కల్, సరన్ష్ జైన్ ఉన్నారు.

వరల్డ్ యూత్ క్లైంబిగ్ ఛాంపియన్..

## రికార్డు నెలకొల్పిన అమీరా



**న్యూఢిల్లీ:** భారతదేశానికి చెందిన 15 ఏళ్ల స్పీడ్ క్లైంబింగ్ ప్రతిభా వంతురాలు అమీరా ఖోస్లా, ఇటలీలోని ఆర్కోలో మంగళవారం జరిగిన ఐఎఫ్ఎస్‌సి ప్రపంచ యూత్ క్లైంబింగ్ ఛాంపియన్ షిప్స్-2026లో కొత్త భారత జాతీయ యూత్ రికార్డును నెలకొల్పి, ప్రపంచంలో ఆరవ స్థానంలో నిలిచి చరిత్ర సృష్టించింది. స్పీడ్ క్లైంబింగ్ ఈవెంట్ ఫైనల్స్‌లో అమీరా 7.60 సెకన్ల అద్భుతమైన సమయాన్ని నమోదు చేసి, తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనను రెండుసార్లు మెరుగుపరుచుకుంది.

అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లో 7.74 సెకన్లను నమోదు చేసిన ఆమె, ఫైనల్‌లో మరింత వేగవంతమైన ప్రదర్శనను కనబ రిచింది. ఆమె సాధించిన విజయం, ప్రపంచ యూత్ ఛాంపియన్ షిప్‌లలో ఒక భారతీయ అథ్లెట్ సాధించిన అత్యుత్తమ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది. క్లైంబింగ్‌తో పాటు, అమీరా అథ్లెటిక్స్‌లో కూడా తనదైన ముద్ర వేసింది. ఆమె నేషనల్ స్కూల్ గేమ్స్ 2024లో 100 మీటర్ల పరుగులో రజత పతకం గెలుచుకుంది.

2024 నుండి 2026 వరకు వరుసగా మూడు సంవత్సరాల పాటు 60 మీటర్ల పరుగులో ఢిల్లీ స్టేట్ ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే ఈ ఛాంపియన్‌షిప్‌లో భారత జట్టులో శ్లోక్ దాదుకర్, నీల్ వార్కే, రుద్ర కరండికర్ కూడా ఉన్నారు. దాదుకర్ 6.76 సెకన్ల టైమింగ్‌తో 27వ స్థానంలో నిలవగా, వార్కే 7.33 సెకన్ల టైమింగ్‌తో 35వ స్థానాన్ని దక్కించుకున్నారు. కరండికర్ 8.47 సెకన్ల టైమింగ్‌తో 44వ స్థానంతో తన ప్రయాణాన్ని ముగించారు.





కామన్వెల్త్ గేమ్స్‌లో

## షర్మిలకు స్వర్ణం శిల్పకు కాంస్యం



### అజయ్‌కు రజతం, బింద్యాకు కాంస్యం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ మహిళల ఎఫ్57 షాట్‌పుట్ విభాగంలో షర్మిల, శిల్పలు కలిసి భారతదేశానికి చారిత్రాత్మక డబుల్ పోడియంను అందించారు. ఈవెంట్‌లో షర్మిల భారతదేశానికి మొట్టమొదటి స్వర్ణ పతకాన్ని అందించగా, శిల్ప కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. వీరు ఇద్దరూ కలిసి కామన్వెల్త్ గేమ్స్‌లో పారా అథ్లెటిక్స్ పతకం గెలిచిన తొలి భారతీయ మహిళలుగా నిలిచారు. షర్మిల తన ప్రచారాన్ని 9.48 మీటర్ల త్రోతో ప్రారంభించి, దానిని 9.58 మీటర్లకు మెరుగుపరిచి, ఆపై తన మూడవ ప్రయత్నంలో 9.81 మీటర్ల త్రోతో చివరికి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఆమె మిగిలిన మూడు ప్రయత్నాలలో 9.17 మీ, 9.37మీ, మరియు 9.60 మీ స్కోరుసాధించి, చాలా సునాయాసంగా స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అయితే, శిల్ప పోడియంకు చేరుకున్న మార్గం మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఆమె మొదట 7.26 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో నాల్గవ స్థానంలో నిలిచింది, కానీ ఈవెంట్ ముగింపులో నైజీరియాకు చెందిన యూకారియా ఇయాజీని అనర్హురాలిగా ప్రకటించిన ఫలితంగా ఆమెకు కాంస్య పతకం లభించింది. వెయిట్‌లిఫ్టింగ్ పురుషుల 79 కేజీల విభాగంలో మలేషియా వెయిట్‌లిఫ్టర్‌తో హోరాహోరీగా తలపడిన అజయ్‌బాబు, చివరకు 330 కేజీల విభాగంలో కేవలం ఒకకిలో తేడాతో రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. బింద్యారాణి 199 కిలోల బరువును ఎత్తి, మహిళల 58 కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకుని, వరుసగా తన రెండవ కామన్వెల్త్ గేమ్స్ పతకాన్ని కైవసం చేసుకుంది.

## కామన్వెల్త్‌లో.. సర్వేశ్‌కు రజతం



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో భారత అథ్లెటిక్స్ చరిత్రలోనే అత్యంత స్ఫూర్తిదాయకమైన అధ్యాయాలలో ఒకదాన్ని సర్వేశ్ కుషారే లిఖించారు. 31 యేళ్ల కుషారే, ఫైనల్‌లో 2.25 మీటర్ల అత్యుత్తమ ఎత్తును అధిగమించి, కామన్వెల్త్ గేమ్స్ 136 యేళ్ల చరిత్రలో హైజంప్‌లో రజత పతకం గెలుచుకున్న తొలి భారతీయుడిగా నిలిచాడు. పురుషుల హైజంప్ ఫైనల్‌లో పాల్గొన్న ముగ్గురు భారతీయులలో సర్వేశ్ కుషారే ఒకడు. మిగతా ఇద్దరూ పతకాల పోటీ నుండి వైదొలగగా, అతను మాత్రం పోరాటం కొనసాగించి భారతదేశానికి పోడియం స్థానాన్ని సాధించిపెట్టాడు. హై జంప్‌లో కుషారే తన మొదటి ప్రయత్నంలోనే 2.20 మీటర్లతో సహా తన మొదటి నాలుగు ఎత్తులను అధిగమించి, బలమైన ఆరంభాన్ని ఇచ్చాడు. అయితే, 2.25 మీటర్ల వద్ద తన మొదటి రెండు ప్రయత్నాలలో విఫలమవడంతో అతను అకస్మాత్తుగా అగ్రస్థానం నుండి వెనుకబడ్డాడు. కానీ తన మూడవ ప్రయత్నంలో తీవ్రంగా పోరాడి, బార్‌ను అధిగమించి, భారతదేశానికి పతకాన్ని ఖాయం చేశాడు. జమైకాకు చెందిన స్వర్ణ పతక విజేత రొమైన్ బెక్‌ఫోర్డ్ లాగే, అతను 2.28 మీటర్ల వద్ద చేసిన మూడు ప్రయత్నాలలోనూ విఫలమైన ప్పటికీ, కౌంట్‌బ్యాక్ ఆధారంగా అప్పటికే రజత పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. టోక్యోలో జరిగిన 2025 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో 2.28 మీటర్ల కొత్త వ్యక్తిగత అత్యుత్తమ రికార్డును నెలకొల్పాడు. ఆ ప్రదర్శన అతనికి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో చారిత్రాత్మకమైన టాప్‌సిక్స్ స్థానాన్ని సంపాదించి పెట్టింది.

## జూన్ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 7.3% వృద్ధి



**ముంబయి,జులై 28:** దేశ పారిశ్రామిక రంగం జూన్ నెలలో గణనీయమైన పురోగతిని నమోదు చేసింది. తయారీ రంగం, మూలధన వస్తువులు (క్యాపిటల్ గూడ్స్), మౌలిక సదుపాయాల ఉత్పత్తి బలంగా పెరగడంతో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ వార్షిక ప్రాతిపదికన 7.3 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది గత 23 నెలల్లో అత్యధిక వృద్ధి రేటు కావడం విశేషం.మే నెలలో సవరించిన గణాంకాల ప్రకారం నమోదైన 5.1 శాతం వృద్ధితో పోలిస్తే జూన్‌లో పారిశ్రామిక ఉత్పత్తి గణనీయంగా పుంజుకుంది. మార్కెట్ అంచనాలు 6 శాతం ఉండగా, వాటిని అధిగమిస్తూ 7.3 శాతం వృద్ధి నమోదైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ దేశీయ పారిశ్రామిక కార్యకలాపాలు బలంగా కొనసాగుతున్నాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. ఐఐపిలో అత్యధిక వాటా కలిగిన తయారీ రంగం జూన్‌లో 7.8 శాతం వృద్ధిని నమోదు చేసి మొత్తం పారిశ్రామిక ఉత్పత్తికి ప్రధాన బలంగా నిలిచింది. దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం, కీలక పరిశ్రమల్లో ఉత్పత్తి పెరగడం ఈ వృద్ధికి దోహదపడింది. విద్యుత్, గ్యాస్ ఉత్పత్తి 10.6 శాతం పెరిగింది. పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరించడంతో పాటు ఇంధన అవసరాలు పెరగడమే ఇందుకు కారణం. గనుల రంగం మాత్రం స్వల్పంగా 1 శాతం వృద్ధిని మాత్రమే నమోదు చేసింది. క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి 14.2 శాతం పెరిగి అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేసింది. పెట్టుబడులు, ఉత్పత్తి సామర్థ్య విస్తరణపై పరిశ్రమలు ఇప్పటికీ విశ్వాసంతో ముందుకు సాగుతున్నట్లు ఇది సూచిస్తోంది.మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగానికి సంబంధించిన వస్తువుల ఉత్పత్తి 7.5 శాతం పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలమౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగంగా కొనసాగుతున్నట్లు ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. వినియోగదారుల మన్నికైన వస్తువుల ఉత్పత్తి 7.7 శాతం పెరగడం ద్వారా గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై వినియోగదారుల డిమాండ్ బలంగా కొనసాగుతోందని స్పష్టమైంది. ఇక నీటి సరఫరా, అనుబంధ సేవలు కూడా జూన్ నెలలో 6.1 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

# ఐటిషేర్ల అండతో ఈక్విటీ నష్టాల కట్టడి



## స్వల్ప నష్టాలతోముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి,జులై 28:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం రోజంతా పరిమిత శ్రేణిలో ట్రేడింగ్ అనంతరం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఐటీ షేర్లలో నమోదైన బలమైన కొనుగోళ్లు మార్కెట్లకు మద్దతు ఇవ్వగా, ఎఫ్ఎంసీజీ, కెమికల్స్, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గడం సానుకూలంగా మారినా, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన నిర్ణయానికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. బిఎస్ఇ సెన్సెక్స్ 69.86 పాయింట్లు తగ్గి 76,765.92 వద్ద ముగియగా, ఎన్ఎస్ఇ నిఫ్టీ 10.60 పాయింట్లు కోల్పోయి 23,985.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్ 7.11 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 1.94 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.65 శాతం క్షీణించి సూచీలను దిగజార్చాయి.విస్తృత మార్కెట్లలో మాత్రం మిశ్రమ ధోరణి కనిపించింది. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ స్వల్పంగా 0.01 శాతం పెరగగా, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.47 శాతం తగ్గింది. మొత్తం ట్రేడైన షేర్లలో 1,528 షేర్లు లాభపడగా, 2,740 షేర్లు నష్టపోయాయి. 169 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఐటీ రంగంలో భారీ ర్యాలీమంగళవారం ట్రేడింగ్‌లో ఐటీ రంగం మార్కెట్‌కు ప్రధాన బలంగా నిలిచింది. నిఫ్టీ ఐటీ సూచీ 3.32 శాతం ఎగిసి 30,418.35 వద్ద ముగిసింది. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో ఈ సూచీ మొత్తం 6.61 శాతం లాభపడింది. ఐటీ కంపెనీల్లో కోఫోర్జ్ 10.16 శాతం ఎగిసి అగ్రస్థానంలో నిలవగా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) 4.46 శాతం, ఎంఫాసిస్ 3.57 శాతం, టెక్ మహీంద్రా 3.49 శాతం, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 3.22 శాతం, ఎల్‌టిఐ మైండ్‌ట్రీ 2.82 శాతం, ఇన్ఫోసిస్ 2.39 శాతం, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ (ఒఎఫ్ఎస్ఎస్) 2.08 శాతం, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 1.93 శాతం, విప్రో 1.41 శాతం చొప్పున లాభపడ్డాయి. త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రభావంతో పలు కంపెనీల షేర్లలో భారీ ఒత్తిడి కనిపించింది. వరుణ్ బేవరేజెస్ త్రైమాసిక ఫలితాల అనంతరం 7.53 శాతం క్షీణించింది. హిందుస్థాన్ యూనిలీవర్ సమీకృత నికర లాభం ఏడాది ప్రాతిపదికన 3.01 శాతం తగ్గి రూ.2,673 కోట్లకు చేరడంతో షేరు 7.11 శాతం పడిపోయింది. ఇండోకో రెమెడీస్ తొలి త్రైమాసికంలో రూ.64.99 కోట్ల లాభం నమోదు చేసినప్పటికీ షేరు 7.72 శాతం క్షీణించింది. టాటా కెమికల్స్ త్రైమాసికంలో రూ.17 కోట్ల సమీకృత నికర నష్టం ప్రకటించడంతో షేరు 3.73 శాతం పడింది.తేజస్ నెట్‌వర్క్స్ రూ.202.24 కోట్ల నికర నష్టం నమోదు చేయడంతో 3.84 శాతం బలహీనపడింది. తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ సమీకృత నికర లాభం 64.30 శాతం తగ్గి రూ.31.59 కోట్లకు చేరినా షేరు స్వల్పంగా 0.10 శాతం పెరిగింది.గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా నికర లాభం 44.3 శాతం తగ్గడంతో షేరు7.80 శాతం క్షీణించింది. ఔరియన్‌ప్రో సొల్యూషన్స్ సమీకృత నికర లాభం 10.62 శాతం తగ్గడంతో 11.79 శాతం పతనమైంది.


ఇండస్ టవర్స్ 1.73 శాతం నష్టపోయింది.ఆర్ఆర్ కేబుల్ 2.36 శాతం లాభపడింది.ఓం ఇన్‌ఫ్రా ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖ చేపట్టిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుకు అత్యల్ప బిడ్డర్‌గా ఎంపిక కావడంతో షేరు 4.78 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 1.93 డాలర్లు తగ్గి 86.43 డాలర్లకు చేరింది. దేశీయ విదేశీ మారక మార్కెట్లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.8875 వద్ద ట్రేడవగా, గత ముగింపు 95.9900గా నమోదైంది. ఎంసిఎక్స్‌లో ఆగస్టు 5,2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర 1.17 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,41,395 వద్ద ట్రేడైంది.

## ఎయిరిండియా, ఎక్స్‌ప్రెస్‌ల నికర నష్టం రూ.22,238 కోట్లు



**ముంబయి,జులై 28:** టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లు 2026 ఆర్థిక సంవత్సరంలో భారీ నష్టాలను ప్రకటించాయి. ఈ రెండు సంస్థల సంయుక్త నికర నష్టం రూ. 22,238 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 10,859 కోట్ల నష్టంతో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ. ఇదే సమయంలో సంస్థల సంయుక్త ఆదాయం కూడా దాదాపు 9 శాతం తగ్గి రూ. 71,870 కోట్లకు పరిమితమైంది. ఎయిరిండియా రూ. 15,368 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేయగా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ రూ. 6,767 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ప్రస్తుతం ఎయిరిండియాలో టాటా సన్స్‌కు 73.82 శాతం, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు 25.1 శాతం వాటా ఉంది. ఈ ఫలితాలపై వాటాదారులను ఉద్దేశించి ఎయిరిండియా ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ సంస్థ పునరుద్ధరణను ఒక దీర్ఘకాలిక ప్రక్రియగా చూడాలని సూచించారు. చరిత్రలో ఏ గొప్ప విమానయాన సంస్థ అయినా దశాబ్దాల కాలంలో నిర్మితమైందనీ, అంతేకానీ కొన్ని త్రైమాసికాల్లో కాదని ఆయన స్పష్టం చేశారు. సంస్థను కొనుగోలుచేసిననాటి పరిస్థితి, విడిభాగాల సరఫరాలో అంతరాయాలు, పాత వ్యవస్థల ఆధునికీకరణ వంటి సవాళ్లను అధిగమించేందుకు 5 నుంచి 10 యేళ్ల సమయం పడుతుందని వివరించారు. ఛైర్మన్ వ్యాఖ్యలను బట్టి చూస్తే, 2022లో ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసిన ఈ జాతీయ విమానయాన సంస్థను గాడిన పెట్టేందుకు టాటా గ్రూప్ తొలుత అంచనావేసిన దానికంటే ఎక్కువసమయం, పెట్టుబడులు అవసరమవుతాయని స్పష్టమవుతోంది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆరు పాత ఎయిర్‌బస్ ఏ319 విమానాలను విక్రయించేందుకు ఎయిరిండియా ఇటీవలే యూకేకు చెందిన స్కైటెక్ ఎవిసి సంస్థను నియమించుకుంది.

## ఇండిగో సిఇఒగా విల్లీ వాల్ష్‌కు కేంద్రం ఓకే



**న్యూఢిల్లీ,జులై 28:** దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో కొత్త సిఇఒగా విల్లీ వాల్ష్ నియామకానికి కేంద్ర ప్రభుత్వం మంగళవారం భద్రతా అనుమతి మంజూరు చేసింది. అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం డైరెక్టర్ జనరల్‌గా ఆయన పదవీకాలం ఈనెల 31తో ముగియనుండగా, ఆగస్టు 3లోగా ఇండిగోలో చేరనున్నట్లు సమాచారం. మార్చిలో అప్పటి సిఇఒ పీటర్‌ఎల్బర్స్ ఆకస్మికంగా వైదొలిగిన తర్వాత సంస్థ కొత్త నాయకత్వం కోసం ఎదురు చూస్తోంది. సిఇఒగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇండిగో కార్యకలాపాల నిర్వహణతో పాటు సంస్థ దీర్ఘకాలిక వ్యూహాల రూపకల్పనలో విల్లీ వాల్ష్ కీలక పాత్ర పోషించనున్నారు. విలియం విల్లీ వాల్ష్ 1961 అక్టోబర్ 25న ఐర్లాండ్‌రాజధాని డబ్లిన్‌లో జన్మించారు.1979లో ఐరిష్ విమానయాన సంస్థ ఏర్ లింగస్‌లో క్యాడెట్ పైలట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. అనంతరం బోయింగ్737 విమాన కెప్టెన్‌గా పనిచేస్తూనే ట్రినిటీ కాలేజ్ డబ్లిన్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రే షన్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు.1990ల చివర్లో నిర్వహణ విభాగంలోకి అడుగుపెట్టిన ఆయన, 2000లో ఏర్ లింగస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా, 2001లో సిఇఒగా నియమితులయ్యారు. 2005లో బ్రిటిష్ ఎయిర్‌వేస్ సిఇఒగా బాధ్యతలు స్వీకరించిన విల్లీ వాల్ష్ సంస్థను సమర్థంగానడిపించారు. 2011లో బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఐబీరియా విలీనానికి ఆయన నాయకత్వం వహించారు. 2021 ఏప్రిల్ నుంచి అంతర్జాతీయ వైమానిక రవాణా సంఘం ఎనిమిదో డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్న విల్లీ వాల్ష్, విమాన భద్రత, నియంత్రణ విధానాలు, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమ వ్యయ నియంత్రణ వంటి అంశాల్లో ప్రపంచవ్యాప్తంగా విమానయాన సంస్థలకు ప్రాతినిధ్యం వహించారు.

2005 నుంచి 2018వరకు ఐఎటిఎ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌లో సభ్యుడిగా, ఒక దశలో ఛైర్మన్‌గా కూడా సేవలందించారు. భారతీయ దేశీయ విమానయాన మార్కెట్లో సుమారు 64 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో అగ్రస్థానంలో ఉంది. సంస్థ రోజుకు 2,200కు పైగా విమాన సర్వీసులు నిర్వహిస్తూ 95 దేశీయ, 40కిపైగా అంతర్జాతీయ గమ్యస్థానాలకు సేవలు అందిస్తోంది. సుమారు 440 విమానాల ఫ్లీట్‌ను నిర్వహిస్తున్న ఇండిగో, అంతర్జాతీయ విస్తరణపై దృష్టి సారించిన నేపథ్యంలో విల్లీ వాల్ష్‌కు ఉన్న ప్రపంచ స్థాయి నిర్వహణ అనుభవం సంస్థ తదుపరి వృద్ధి దశకు బలాన్నిస్తుందని విమానయాన రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అంచనాలను మించిన ఎల్ అండ్ టి నికరలాభం

**ముంబయి,జులై 28:** ఇంజినీరింగ్, నిర్మాణ రంగ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్అండ్‌టి) 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అంచనాలకు మించిన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 14 శాతం పెరిగి రూ.4,123 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే కాలంలో కంపెనీ లాభం రూ.3,617 కోట్లు. మార్కెట్ విశ్లేషకులు రూ.3,985 కోట్ల లాభాన్ని అంచనా వేయగా, కంపెనీ ఆ అంచనాలను అధిగమించింది. కంపెనీ మొత్తం ఆదాయం 6.7 శాతం పెరిగి రూ.67,942 కోట్లకు చేరుకుంది. గత యేడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ.63,679 కోట్లు. మార్కెట్ నిపుణులు రూ.67,545 కోట్ల ఆదాయాన్ని అంచనా వేయగా, ఎల్అండ్‌టీ ఆ అంచనాలను కూడా మించింది. వడ్డీ, పన్నులు, తరుగుదల, అమార్టైజేషన్‌కు ముందు లాభం అంటే ఎబిడిటా మాత్రం 3.2 శాతం తగ్గి రూ.6,117 కోట్లకు పరిమితమైంది. గత యేడాది ఇదే కాలంలో ఎబిడిటా రూ.6,318 కోట్లు కాగా, విశ్లేషకుల అంచనా రూ.6,535 కోట్లు. దీంతో కంపెనీ నిర్వహణ లాభదాయకతపై కొంత ఒత్తిడి కనిపించింది.కంపెనీ ఎబిడిటా మార్జిన్ కూడా గత యేడాది 9.9 శాతం నుంచి 9 శాతానికి పడిపోయింది. ఇది 90 బేసిస్ పాయింట్ల క్షీణతగా నమోదైంది. మార్కెట్ అంచనా 9.7 శాతం కాగా, వాస్తవ ఫలితం దానికంటే తక్కువగా ఉంది. ఆర్థిక ఫలితాల ప్రకటనకు ముందు ఎన్ఎస్ఇలో ఎల్అండ్‌టి షేరు ధర 0.63 శాతం పెరిగి రూ.3,830 వద్ద ముగిసింది. అదే సమయంలో ప్రామాణిక సూచీ నిఫ్టీ స్వల్ప నష్టంతో ముగిసింది. దీంతో కంపెనీ ఫలితాలపై పెట్టుబడిదారులు సానుకూలంగా స్పందించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14